RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in




01 డిసెంబర్ 2024 ఆదివారం | హైదరాబాద్ | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:20 | సంచిక:155

# అభివృద్ధిని అడ్డుకోవద్దు..

x రైతులు ప్రతిపక్షాల ట్రాప్‌లో పడవద్దు
x బీఆర్ఎస్ మోసం చేసింది.. రైతులకు పండుగ తెచ్చాం..
x రుణమాఫీపై చర్చకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సిద్ధమా
x ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సవాల్



మహబూబ్‌నగర్ నవంబర్ 30 : రైతు బిడ్డగా పాలమూరు రైతుల కష్టాలు తనకు తెలుసునని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. రైతులు ప్రతిపక్షాల ట్రాప్‌లో పడవద్దని అన్నారు. రుణమాఫీపై చర్చకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సిద్ధమా అని సవాల్ విసిరారు. శనివారం మహబూబ్‌నగర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించారు. అమిస్తాపూర్‌లో రైతు పండుగ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా రైతు రుణమాఫీ నిధులు విడుదల చేసిన తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. రైతుల కోసం రూ.54 వేల కోట్లు ఖర్చు పెట్టామని అన్నారు. రైతుల కోసం ఇంకా కేటాయించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని చెప్పారు. గతేడాది నవంబర్ 30వ తేదీన అసెంబ్లీ ఎన్నికలు జరిగాయని తెలిపారు. దొరల గడీలను కూల్చారని చెప్పారు. పాలమూరులో కృష్ణమ్మ పారుతున్నా ప్రజల కష్టాలు తీరలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి కోసం ముంబై, హైదరాబాద్‌కు వలసలు పోయే పరిస్థితి ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు.

అభివృద్ధిని అడ్డుకోవద్దు

"గతంలో ఎవరూ భూసేకరణ చేయలేదా. ...ప్రాజెక్టులు కట్టలేదా.. పరిశ్రమలు నిర్మించలేదా. నా జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు చేసి.. ప్రజలకు ఉపాధి కల్పించాలని భావించాను. మాయగాళ్ల మాటలు విని పరిశ్రమలను అడ్డుకుంటున్నారు. మాయగాళ్ల మాటలు విని లగచర్ల ప్రజలు కేసుల్లో ఇరుకున్నారు. జిల్లాను అభివృద్ధి చేయాలంటే భూసేకరణ చేయాలా.. వద్దా. అధికారులను కొడితే శ్రీశైలం.. సాగర్ ప్రాజెక్టులు పూర్తయ్యేవా. మాయమాటలు నమ్మి అభివృద్ధిని అడ్డుకోవద్దు. కేసీఆర్‌కే గజ్వేల్‌లో వెయ్యి ఎకరాల ఫామ్ హౌస్ ఉంది. మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుకు పెద్దపెద్ద ఫామ్‌హౌస్‌లు ఉన్నాయి. ప్రజలను రెచ్చగొట్టి కేసుల పాల్జేసి వాళ్లు వెళ్లి ఫామ్‌హౌస్‌లో ఉంటారు. కేసీఆర్ చేసిన దోపిడీకి ప్రజలు, కాంగ్రెస్ ప్రభుత్వం బలైపోయింది. మల్లన్నసాగర్‌లో భూమి పోతే రైతు చితిపేర్చుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. రైతు మల్లారెడ్డి కుటుంబానికి బీఆర్ఎస్ న్యాయం చేసిందా. భూములు కోల్పోతున్నవారు పరిహారం అడగండి ఇస్తాను. కావాలంటే ఎకరాకు రూ.20 లక్షల పరిహారం అయినా ఇస్తాం.మాయగాళ్ల మాటలు నమ్మి అభివృద్ధిని అడ్డుకోవద్దు" అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

బీఆర్ఎస్ మోసం చేసింది..

మాజీ ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు తర్వాత... ఇన్నాళ్లకు మళ్లీ పాలమూరు బిడ్డ సీఎం అయ్యారని గుర్తుచేశారు. తనకు వచ్చిన అవకాశాన్ని బాధ్యతగా నిర్వర్తిస్తున్నానని ఉద్ఘాటించారు. కాంగ్రెస్ పార్టీలో సీనియర్లందరూ జూనియర్ అయినా తనకు సహకరిస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతురుణమాఫీని పూర్తి చేసిందా అని ప్రశ్నించారు.వడ్డీతో సహా రూ.లక్ష రుణమాఫీ చేస్తామని బీఆర్ఎస్ మోసం చేసిందని మండిపడ్డారు. కేసీఆర్ ఇచ్చింది వడ్డీలకు కూడా సరిపోలేదన్నారు. వరి వేస్తే.. ఉరి వేసుకున్నట్లే అని కేసీఆర్ అనలేదా అని నిలదీశారు.

రైతులకు పండుగ తెచ్చాం..

తమ ప్రభుత్వం మాత్రం వరి వేస్తే.. రూ.500 బోనస్ ఇచ్చి.. వరి రైతులకు పండుగ తెచ్చిందని ఉద్ఘాటించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరానికి రూ.1.02 లక్షల కోట్లు ఖర్చు చేసిందని చెప్పారు. మూడేళ్లు నిండకుండానే కాళేశ్వరం కూలిందని ఎద్దేవా చేశారు. ఈ ఏడాది తెలంగాణలో 1.50 లక్షల మెట్రిక్ టన్నుల వరి పండిందని తెలిపారు.దేశంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా రుణమాఫీ చేశామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. 25 లక్షల రైతు కుటుంబాలకు రూ.21 వేల కోట్ల రుణమాఫీ చేశామని గుర్తుచేశారు. సాగుకు ఉచిత కరెంట్ పేటెంట్ హక్కు కాంగ్రెస్‌దేనని తెలిపారు. ఎవరెవరో వచ్చి పాలమూరును దత్తత తీసుకుంటానని ప్రకటించారని.. ఆయన ఈ జిల్లాకు చేసిందేమీ లేదని అన్నారు. మన ప్రాజెక్టులకు నిధులు ఇచ్చేందుకు కేసీఆర్‌కు మనసు రాలేదని.. ఎంపీగా గెలిపించిన జిల్లాకు కేసీఆర్ ఏం చేశారో చెప్పాలని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు.

# మాజీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ పై దాడికి యత్నం



న్యూఢిల్లీ నవంబర్ 30 మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ పాదయాత్రలోగ్భ్రాంతికర ఘటన చోటుచేసుకుంది. పాదయాత్రలో చొరబడ్డ ఓ యువకుడు కేజ్రీవాల్ మీద దాడికి యత్నించాడు. వెంటనే ఆప్ నాయకులు, కార్యకర్తలు ప్రతిస్పందించి ఆ యువకుడిని పట్టుకుని చితకబాదారు.దీనికి ముందు కేజ్రీవాల్ ప్రసంగిస్తూ ఢిల్లీలో శాంతిభద్రతలు క్షీణించాయని ఆందోళనవ వ్యక్తం చేశారు. ఢిల్లీని గ్యాంగ్ స్టర్లు నడిపిస్తున్నారని ఆరోపించారు. దుకాణాలపై జరుగుతున్న దాడుల వల్ల వ్యాపార వర్గాల్లో భయాందోళనలు నెలకొన్నాయన్నారు.

# గౌతమ్ అదానీకి అనుకూలంగా వ్యవహరిస్తున్న ప్రధాని మోడీ


## లోక్ సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ

కొజికోడ్ నవంబర్ 30 ప్రధాని నరేంద్ర మోడీ పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని లోక్ సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ శనివారం ఆరోపించారు. "లోక్ సభలో మేము రాజకీయ సిద్ధాంతాలపై పోరాడుతున్నాము. మేమేమో అనుభూతులు, భావోద్వేగాలు, ప్రేమ?వంటి వాటి గురించి మాట్లాడుతున్నాం. కానీ వారేమో విద్వేషం, క్రోధం, విభజన, హింస గురించి మాట్లాడుతున్నారు. అందరినీ సమానంగా చూడాలని రాజ్యాంగం చెబుతోంది. ఇతర భారతీయలకు భిన్నంగా అదానీని మాత్రం ప్రత్యేకంగా చూస్తామని ప్రధాని మోడీ అంటున్నారు" అని రాహుల్ గాంధీ వాయనాడ్ లో జరిగిన బహిరంగ సభలో తెలిపారు."అమెరికా అదానీని ఆరోపిని చేసినప్పటికీ, దోషిగా చేసినప్పటికీ అదేమంత విషయం కాదని మోడీ అంటున్నారు. మన దేశంలో మాత్రం అతడిని దోషిని చేయమంటున్నారు" అని రాహుల్ గాంధీ అన్నారు. లంచం కేసులో అమెరికా ప్రాసిక్యూటర్లు అదానీని దోషిగా తేల్చారు. ఆయనపై కేంద్రం కఠిన చర్యలు చేపట్టాలని కాంగ్రెస్, ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి.రాహుల్ గాంధీ బిజెపి మీద దాడి చేస్తూ వారి వద్ద డబ్బు, ఇంటెలిజెన్స్ సంస్థలు, సిబిఐ, ఈడి, ఐటి వంటివన్నీ ఉన్నాయి. కానీ మా దగ్గర కేవలం ప్రజల భావోద్వేగాలున్నాయి. మేము బిజెపి సిద్ధాంతాలను ఓడిస్తామన్న విశ్వాసం మాకుంది" అన్నారు. "ప్రియాంక గాంధీ మీ పార్లమెంటు ప్రతినిధి. మీరామెను ఎన్నుకున్నారు. ప్రజల్లో ఉన్న అభిమానం ప్రియాంక గాంధీని ఎంపీని చేసిందని నేను భావిస్తున్నాను" అంటూ రాహుల్ గాంధీ తెలిపారు.


# పోటీ అంశాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమతుల్యత పాటించాలి

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీం కోర్ట్ కీలక సూచనలు

న్యూ డిల్లీ నవంబర్ 30 కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సర్వోన్నత న్యాయస్థానం కీలక సూచనలు చేసింది. కేంద్ర సంస్థల అధికారులు రాష్ట్ర పోలీసులచే దర్యాప్తు చేయబడిన, దర్యాప్తు చేస్తున్న కేసుల్లో పోటీ అంశాల మధ్య సమతున్యతను పాటించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. ఈడీ అధికారి అంకిత్ తివారీ లంచం కేసు విచారణ సందర్భంగా జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భుయాన్ ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. సమాఖ్య నిర్మాణంలో, ప్రతి భాగం ప్రతి భాగం దాని గుర్తింపు, అధికార పరిధిని కలిగి ఉండేలా చూసుకోవాలని చెప్పింది. ఒక రాష్ట్రం ఏకపక్షంగా కేంద్ర ప్రభుత్వ అధికారులను అరెస్టు చేయాలని నిర్ణయించుకుంటే.. అది రాజ్యాంగ సంక్షోభానికి దారి తీస్తుందని కోర్టు పేర్కొంది.అలాంటి పరిస్థితిలో రాష్ట్రానికి ప్రత్యేక అరెస్టు అధికారం ఉందని చెబితే, అది సమాఖ్య నిర్మాణానికి ప్రమాదకరమని.. అయితే తమ పరిధిలోని కేసును దర్యాప్తు చేసే అధికారాన్ని రాష్ట్ర పోలీసులకు లేకుండా చేయడం సరికాదని కూడా ధర్మాసనం పేర్కొంది. ఈ కేసులో ఇరువర్గాల వాదనలు విన్న కోర్టు.. ఈ పోటీ అంశాల మధ్య సమతుల్యతను సాధించేందుకు ఇరుపక్షాల వాదనలు పరిశీలిస్తామని చెప్పింది. విచారణలో నిందితుడు తన పక్షాన్ని ప్రదర్శించలేనప్పటికీ, న్యాయమైన దర్యాప్తునకు ఆయనకు హక్కు ఉందని పేర్కొంది. కేసు విచారణను జనవరిలో విచారించనున్నట్లు తెలిపింది. లంచం ఆరోపణలపై అంకిత్ తివారీకి సుప్రీం మార్చి 20న మధ్యంతర బెయిల్‌ను జారీ చేసిన విషయం తెలిసిందే. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ వేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ జరిపింది. అంకిత్ తివారీ కేసు దర్యాప్తును సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్‌కు బదిలీ చేయాలని డిమాండ్ చేశారు.అంకిత్ తివారీని తమిళనాడు విజిలెన్స్ అండ్ యాంటీ కరప్షన్ డైరెక్టరేట్ (ఆఎంఅ) లంచం ఆరోపణలపై అరెస్టు చేసింది. మధురైలోని ఈడీ సబ్ జోనల్ కార్యాలయంలో విధుల్లో ఉన్న అంకిత్ తివారీ 2023 డిసెంబర్ 1న తమిళనాడుకు చెందిన ప్రభుత్వ అధికారి నుంచి రూ.20లక్షలు లంచం తీసుకుంటుండగా అరెస్టు చేసినట్లు డీవీఏసీ పేర్కొంది. ఆ తర్వాత ఈడీ తమిళనాడు పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసింది. రాష్ట్ర విజిలెన్స్ అధికారులు మధురైలోని జోనల్ కార్యాలయంలోకి చొరబడి కేసు రికార్డులను దొంగిలించారని ఆరోపించారు. విచారణ సందర్భంగా తమిళనాడు తరఫు న్యాయవాది వాదిస్తూ లంచం తీసుకుంటుండగా తివారీ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారని, కేసు దర్యాప్తు దాదాపు పూర్తయిందని వాదనలు వినిపించారు. ఈడీ పిటిషన్‌ను సుప్రీంకోర్టు పరిగణనలోకి తీసుకున్నందున పోలీసులు ఇంకా ఛార్జిషీట్ దాఖలు చేయలేదన్నారు.



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి** డీసీ రాజేంద్ర నగర్ సర్కిల్‌లో హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ నివాసంలో నిర్వహించిన సమగ్ర ఇంటింటి సర్వేలో ఎన్యుమరేటర్ శ్రీమతి మాధవి, జెడ్సీ వెంకన్న, డీసీ రాజేంద్ర నగర్ సర్కిల్, ఎన్యూమరేషన్ సూపర్‌వైజర్ ఉపేందర్, వార్డు ఇంచార్జి సయీద్ పాల్గొన్నారు.



**జిహెచ్ఎంసి ప్రజాబలం ప్రతినిది** నలగండ్ల సరస్సు పరిరక్షణ బృందం హెచ్‌డబ్ల్యూ మేయర్‌ని కలసి సరస్సు పునరుద్ధరణ కోసం అభ్యర్థించారు.

# కేటీఆర్ బాష మార్చుకోవాలి: ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**వేములవాడ ప్రజాబలం ప్రతినిధి** కేటీఆర్ తన భాషను మార్చుకోవాల్సిన అవసరం ఉందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వారి హయాంలో పేదల భూములను లాక్కొని పెద్దలు పంచి పెట్టారు. మీ కార్యకర్తలను కాపాడు కోవడానికి ప్రభుత్వం పై ఇష్టం వచ్చినట్లు మాట్లాడడం చేస్తే ఊరుకోం. మీ వల్ల జరిగిన పొరపాటును సరిదిద్దుతున్నాం. దళిత గిరిజనులకు చెందాల్సిన భూములు ఉన్నత ర్గాలకు చెందితే దానిని సరిదిద్దడం తప్పా. మొన్న కలెక్టర్ పై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై ఐఏఎస్ ల సంఘం స్పందిస్తే వాటికి కేటీఆర్ ఇప్పటివరకు సమాధానం చెప్పలేదు.ఆయన భాష వల్ల సిరిసిల్ల ప్రాంతం పరువు పోకుండా కాపాడాల్సిన బాధ్యత ఉంది.వాడు వీడు అంటే మేము కూడా వాడు వీడు అనాల్సి వస్తుంది.రేవంత్ రెడ్డి తాత వరకు ఎందుకు కేటీఆర్ మొన్నటి ఎన్నికల్లో పిసిసి అధ్యక్షులుగా రేవంత్ రెడ్డి మీ అయ్యను కుర్చీలో నుంచి దింపి ఫామ్ హౌస్ కి పరిమితం చేయడాన్నీ మరిచిపోయావా. ప్రజాస్వామ్య పంతాలో విమర్శిస్తే మేము స్వాగతిస్తాం స్వీకరిస్తాం భుతులు మాట్లాడితే మేము మాట్లాడతాం. అసెంబ్లీ సమావేశాలలో మా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేసీఆర్ ను వచ్చి సూచనలు సలహాలు ఇవ్వమంటే ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు.

# ప్రజాబలం

## 01 డిసెంబర్ 2024 ఆదివారం


# దేశరాజధాని మార్పు అవసరమా....

దేశ రాజధాని అంటే ఎలా ఉండాలి.. పచ్చటి ప్రదేశాలు, ఎత్తయిన నిర్మాణాలు, ప్రభుత్వ కార్యాలయాలు, ఆహ్లాదమైన ప్రదేశాలు.. ఇలా కానీ మన భారతదేశ రాజధాని మాత్రం దీనికి భిన్నం. ఇక్కడ అంతా కాలుష్యమే.. ప్రాణవాయువు సైతం కలుషితమే. ఇక్కడి కాలుష్యం రాను రాను ఢిల్లీ వాసుల ఆయుష్షు తగ్గించుకుంటూ వెళ్తోంది. చలికాలం వచ్చిందంటే చాలు ఎయిర్ క్వాలిటీ ఇండక్స్ లో గాలి నాణ్యత పడిపోతూనే ఉంటుంది. దిన దిన శ్వాస పీల్చుకోవాలన్నా ఇబ్బంది తప్పదు. ప్రక్షాళనకు చాలా మార్గాలు అన్వేషించారు. ఒకసారి సరి సంఖ్య, బేసి సంఖ్యలో వాహనాలకు అనుమతిచ్చారు. అయినా ఎయిర్ పొల్యూష్యన్ లో మాత్రం పెద్దగా మార్పు లేదు. రాజధానే ఇలా ఎలా అన్న ప్రశ్నలు తరుచూ ప్రజా ప్రతినిధులు, నేతలకు కలుగుతోంది. అయితే ఇదేదో నెలల సమస్య కాదు పదేళ్లకు పైగా ఇదే సమస్య. ఒక సిగరేట్ పీల్చే సాధారణ వ్యక్తి ఊపిరితిత్తులు ఎలా ఇన్ ఫెక్షన్ కు గురవుతాయో ఢిల్లీలో ఉంటూ సిగరేట్ అలవాటు లేని వారి లంగ్స్ కూడా అలాగే ఉంటాయని నిపుణులు చెప్తున్నారు. చలికాలంలో ఢిల్లీలో పరిస్థితి మరింత దిగజారుతుంది. గాలిలో నాణ్యత 420పైగా పడిపోతుంది. మనిషికి మనిషి కనపడనంత దట్టమైన పొగమంచు కమ్ముకుంటుంది.మరి ఒక్క ఢిల్లీకే ఎందుకంత దుస్థితి అంటే శాస్త్రవేత్తలు చెప్తున్నది ఆశ్చర్యం కలిగిస్తుంది. ఢిల్లీ కాలుష్యాన్ని ఆకర్షించేదిగా ఉంటుందట. దేశంలో వివిధ ప్రాంతాల్లో కలుష్యం మెల్లగా ఢిల్లీకి చేరుతుందట. ఇది ఎంత వరకు నిజమో తెలియదు కానీ పరిస్థితులు చూస్తే అలానే కనిపిస్తున్నాయి. కశ్మీర్ మాజీ సీఎం ఫరూక్ అబ్దుల్లా రాజధానిని ఢిల్లీ నుంచి మార్చాలని కోరారు.బడులకు సెలువులు, ప్రజా రవాణా నిలిపివేతలు నిరంతరం కొనసాగుతున్నాయంటే ఇక ఢిల్లీ రాజధానిగా ఏ మాత్రం సేఫ్ కాదని కాంగ్రెస్ నాయకుడు శశిథరూర్ అంటున్నారు. వీరి వ్యాఖ్యల నేపథ్యంలో రాజధానిని మార్చడం ఎలా అవుతుందో కొంత వరకు తెలుసుకునే ప్రయత్నం చేద్దాం..మన ఢిల్లీ లాగానే ఒకప్పుడు చైనా రాజధాని బీజింగ్ లో సమస్య ఉండేది. కానీ బిలియన్ల కొద్దీ ఖర్చు, ఏడేళ్ల కఠిన శ్రమతో ఆ పరిస్థితిలో మార్పు వచ్చింది. కానీ మన దేశంలో అది మరింత కష్టంతో కూడుకుంది. దేశ రాజధానిని మార్చాలంటే చాలా ఇబ్బందితో కూడుకుంది. ఎందుకంటే ఇన్ ఫ్రా స్ట్రక్చర్, ప్రభుత్వ కార్యాలయాలు, చట్ట సభలు ఏర్పాటు చేయాలి అది అంత సులువు కానేకాదు. గుజరాత్ లో అహ్మదాబాద్ అత్యంత కాలుష్య కూపంలో ఉండడంతో గాంధీ నగర్ ను నిర్మించారు. అంటే అది ఒక రాష్ట్రానికి సంబంధించి కాబట్టి నడుస్తుంది. కానీ ఇది దేశానికి సంబంధించి కాబట్టి మరింత శ్రమించాల్సి వస్తుంది.ఇండోనేషియా లాంటి చిన్న దేశం తన రాజధానిని జకార్త నుంచి బోర్నియోకు మార్చుకుంది. దీనికి సుమారు 40 మిలియన్ల డాలర్లకు పైగా ఖర్చు వచ్చింది. ఇక అదే మన దేశమైతే వందలు, వేలు దాటి పోతుంది. ఎందుకంటే పార్లమెంట్ భవనాల నిర్మాణం, ప్రభుత్వ కార్యాలయాలు, మౌలిక వసతులు ఇలా చాలా నిర్మించాలి. ఇదంతా అయ్యే పని కాదు. చాలా వరకు ఖర్చు అవుతుంది. ఇక అంత కన్నా మరింత కఠిన నిబంధనలు తీసుకువచ్చి ఢిల్లీ కాలుష్యాన్ని తగ్గిస్తే ఆర్థికంగా, సామాజికంగా ఇబ్బంది లేకుండా ఉంటుంది..దీపావళి వేడుకల అనంతరం ఢిల్లీ నేషనల్ క్యాపిటల్ రీజియన్(ఎన్సీఆర్) 388 పాయింట్లతో కాలుష్యంలో ప్రపంచంలోనే ప్రథమ స్థానంలో నిలిచినట్లు స్విస్ సంస్థ ఐక్యూ ఎయిర్ వెల్లడించింది. టపాకాయలు కాల్చడం వల్ల ఏర్పడే కాలుష్యం కారణంగా పిఎం(పార్టిక్యులేట్ మ్యాటర్) 2.5 స్థాయిలు గణనీయంగా పెరిగాయి. పిఎం అంటే, పిఎం అంటే పార్టిక్యులర్ మ్యాటర్ (కణ కాలుష్యం అని కూడా అంటారు). గాలిలో కనిపించే ఘన కణాలు, ద్రవ బిందువుల మిశ్రమం ఇది. పిఎం 2.5 అంటే సాధారణంగా 2.5 మైక్రోమీటర్లు, చిన్న వ్యాసం కలిగిన సూక్ష్మమైన పీల్చదగిన కణాలు అనారోగ్యకరమైన పిఎం 2.5 స్థాయిలను పీల్చడం వల్ల గుండె జబ్బులు, ఆస్తమా, తక్కువ బరువుతో పిల్లలు పుట్టడం వంటి ఆరోగ్య సమస్యల ప్రమాదాన్ని పెంచుతుంది. అనారోగ్య స్థాయిలు దృశ్యమానతను తగ్గిస్తాయి. గాలి మబ్బుగా కనిపించేలా చేస్తుంది. నిర్మాణ ప్రదేశాలు, పల్లపు ప్రదేశాలు, వ్యవసాయం, అడవి మంటలు, బ్రష్/ వ్యర్థాలను కాల్చడం, పారిశ్రామిక వనరులు, బహిరంగ ప్రదేశాల నుంచి గాలికి వచ్చే దుమ్ము, పుప్పొడి, బ్యాక్టీరియా శకలాల నుంచి విడుదలవుతుంది. పిఎం నేరుగా మూలాల నుంచి (ప్రాథమిక కణాలు) విడుదల చేయవచ్చు. లేదా సల్ఫర్ డయాక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్, కొన్ని కర్బన సమ్మేళనాలు తదితర వాయువుల(సెకండరీ పార్టికల్స్) రసాయన ప్రతి చర్యల ద్వారా వాతావరణంలో ఏర్పడవచ్చు. ఈ సేంద్రీయ సమ్మేళనాలు చెట్లు, వృక్షసంపద తదితర సహజ వనరుల ద్వారా అలాగే పారిశ్రామిక ప్రక్రియలు, మోటారు ఎగ్జాస్ట్ వంటి మానవ నిర్మిత (మానవ జన్య) మూలాల నుంచి విడుదల అవుతాయి. గాలి నాణ్యత సూచీ ఏకంగా 500 మార్క్‌ను దాటినట్లు వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. వాయు కాలుష్యానికి తోడు రాజధాని నగరాన్ని దట్టమైన పొగమంచు కమ్మేయడంతో పరిస్థితి అధ్వానస్థాయికి చేరింది. వాయు కాలుష్యం కారణంగా ప్రజలు తీవ్ర అనారోగ్య పరిస్థితుల్ని ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో రాజధానిలో గాలి కాలుష్యంపై కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ స్పందించారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో ఢిల్లీని రాజధాని నగరంగా కొనసాగించాలా..? అంటూ ప్రశ్నించారు.దిల్లీ ప్రపంచంలోని అత్యంత కాలుష్య నగరంగా నిలిచిందని థరూర్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇక్కడ ప్రమాదకర కాలుష్య కారకాలు నాలుగు రెట్లు పెరిగినట్లు చెప్పారు. అత్యంత కాలుష్య నగరాల్లో రెండో స్థానంలో ఉన్న బంగ్లాదేశ్ రాజధాని ఢాకాతో పోలిస్తే.. ఢిల్లీలో ప్రమాదకర స్థాయి ఐదు రెట్లు అధికంగా ఉందన్నారు. రాజధానిలో గత కొన్నేళ్లుగా ఇదే పరిస్థితి కొనసాగుతున్నా.. కేంద్రం మాత్రం పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. నవంబర్ నుంచి జనవరి వరకూ ఈ నగరం నివాసానికి అనుకూలంగా ఉండడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. మిగతా కాలంలోనూ ఇక్కడ జీవనం సాగించడం అంతంతమాత్రమేనన్నారు. ఇలాంటి పరిణామాల మధ్య ఢిల్లీని దేశ రాజధానిగా కొనసాగించాలా..? అంటూ శశిథరూర్ ప్రశ్నించారు. ప్రస్తుతం ఈ పోస్ట్ వైరల్‌గా మారింది.2022లో, ఇండోనేషియా తన రాజధానిని తక్కువ గాలి నాణ్యతకు ప్రసిద్ధి చెందిన జకార్తా నుండి నుసాంటారాకు మార్చడానికి చట్టాన్ని ఆమోదించింది. పర్యావరణ సమస్యలు, వాతావరణ సమస్యల కలయికతో ఈ నిర్ణయం తీసుకున్నారు. జకార్తా నుండి సుమారు 1,000 కి.మీ దూరంలో ఉన్న నుసంతారా, ప్రస్తుతం నిర్మాణంలో ఉంది, పూర్తి పరివర్తన 2045 నాటికి పూర్తవుతుందని భావిస్తున్నారు.

# అంగన్ వాడీ కేంద్రాలకు పాల సరఫరాలో గ్యాప్ ఉండొద్దు

**100 శాతం టార్గెట్ ను రీచ్ కావాలిసిందే**

**మూడు నెలల సమయం ఇస్తున్నాం**

**పాల సరఫరాను విజయ డెయిరీ మెరుగు పరుచుకోవాలి**

**పోషకాహార తెలంగాణే ప్రజా ప్రభుత్వ లక్ష్యం**

**ఆరోగ్య లక్ష్మీ పథకంపై మంత్రి సీతక్క సమీ**



క్షఅంగన్ వాడీ కేంద్రాలకు చేసే పాల సరఫరాలో ఎటువంటి గ్యాప్స్ లేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క ఆదేశాలు జారీచేసారు. మారు మూల ప్రాంతాల్లోని అంగన్ వాడీ కేంద్రాలను సకాలంలో పాల సరఫరా జరగాల్సిందేనని స్పష్టం చేసారు. పోషకాహార తెలంగాణ లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న

ఆరోగ్య లక్ష్మి పథకం పై మంత్రి సీతక్క శనివారం నాడు సచివాలయంలో తన చాంబర్ లో సమీక్షా సమావేశం నిర్వహించారు. అంగన్ వాడీ కేంద్రాలకు జరుగుతున్న పాల సప్లై పై మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, డైరెక్టర్ కాంతి వెస్లీ, ఇతర ఉన్నతాధికారులతో కలసి మంత్రి సీతక్క సమీక్షించారు. గర్భిణీలు, బాలింతలకు పోషకాహారం అందించే లక్ష్యంతో ప్రభుత్వం ఆరోగ్య లక్ష్మి పథకాన్ని అమలు చేస్తుంది. ఇందులో బాగంగా ప్రతి రోజ 200 ఎం ఎల్ పాలను గర్భిణీలు, బాలింతలకు అంగన్ వాడీ కేంద్రాల ద్వారా పంపిణి చేస్తారు. ప్రభుత్వ విజయ డెయిరీ టెట్రా ప్యాకెట్ల అంగన్ వాడీ కేంద్రాలకు సప్లై చేస్తుంది. గత డిసెంబర్ నుంచి ఇప్పటి వరకు 1.67 కోట్ల లీటర్ల సరఫరా కోసం ఆర్డర్ చేయగా...1.56 కోటి లీటర్ల పాలను విజయా డెయిరీ సరఫరా చేయగలిగింది. అంటే 94 శాతం మేర సప్లై చేయగలిగింది. అయితే కొన్ని అంగన్ వాడీ సెంటర్లకు సకాలంలో పాలు సప్లై కాకపోవడం పట్ల మంత్రి సీతక్క సీరియస్ అయ్యారు. అంగన్వాడీ కేంద్రాలకు ప్రభుత్వం కోరినంత మేర పాలు సరఫరా చేయగలరా? లేదా?..అంత సామర్థ్యం ఉందా? లేదా? సరిపోయినంత సప్లై చేసే శక్తి లేకపోతే..మీా ఇండెంట్ ను తగ్గించి ఇతర సంస్థల ద్వారా సప్లై చేసుకోవాలా అని విజయ డెయిరీ ప్రతినిధులను మంత్రి సీతక్క ప్రశ్నించారు. మరో మూడు నెలల పాటు అవకాశం ఇస్తామని..పాల సరఫరా సంతృప్తికరంగా లేకపోతే ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రభుత్వ విజయ డెయిరీ రైతుల నుంచి పాలను సేకరిస్తుందని...అందుకే రైతుల ప్రయోజనాలు కాపాడేందుకు విజయ డెయిరీ నుంచి పాలను కొనుగోలు చేస్తున్నామని గుర్తు చేసారు. రైతుల ప్రయోజనాలను కాపాడటంతో పాటు తమకు గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల సంరక్షణ అంతే ముఖ్యమని మంత్రి సీతక్క స్పష్టం చేసారు. అందుకే అంగన్ వాడీ కేంద్రాలకు జరిగే పాల సప్లై లో ఏలాంటి గ్యాప్స్ లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేసారు. ఆరోగ్య తెలంగాణ, పోషకాహార తెలంగాణ నిర్మాణమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తుందని..ఆ లక్ష్యాన్ని చేరుకునే దిశగా పనిచేయాలని ఆదేశించారు. అంగన్వాడి కేంద్రాలకు సరఫరా అయ్యే పాల నాణ్యతను స్వయంగా రుచి చూసి మంత్రి సీతక్క పరిశీలించారు. పాల నాణ్యత పట్ల సంతృప్తి వ్యక్త పరిచారు. ప్రస్తుతం లీటర్ టెట్రా ప్యాక్ ను రూ.57 కి విజయ డెయిరీ సరఫరా చేస్తుంది. ధరలను సవరించాలని విజయా డెయిరీ ప్రతిపాదించగా..మంత్రి తిరస్కరించారు. మూడు నెలల పాటు ఏలాంటి గ్యాప్స్ లేకుండా పాలను సరఫరా చేసిన తర్వాత మరో సారి సమీక్షించి ధరల పెంపుపై నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేసారు మంత్రి సీతక్క.

# మన యువతే మన భవిష్యత్తు.

**మాజీ రాష్ట్రపతి రామ్ నాధ్ కోవింద్.**

**కెఎల్ యూనివర్శిటీ 14వ స్నాతకోత్సవంలో పాల్గొన్న మాజీ రాష్ట్రపతి రామ్ నాధ్ కోవింద్, గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్.**

**42 బంగారు పతకాలు.37 రజిత పతకాలు.166 మంది పి. హెచ్. డి604 మంది పోస్ట్ గ్రాడ్యుయేషన్3936 అండర్ గ్రాడ్యుయేషన్.**

గుంటూరు : కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీ 14వ స్నాతకోత్సవం శనివారం నాడు వడ్డేశ్వరంలోని వర్శిటీ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. భారత మాజీ రాష్ట్రపతి రామ్ నాధ్ కోవింద్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఆంధ్రప్రదేశ్ గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్ గౌరవ అతిథిగా హాజరై విద్యార్దులకు డిగ్రీలను అందజేశారు. ఈ సందర్భంగా మాజీ రాష్ట్రపతి రామ్ నాధ్ కోవింద్ మాట్లాడుతూ తనను కెఎల్ వర్శిటీ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా ఆహ్వానించినందుకు ఆనందంగా ఉందన్నారు. యువతే మన భవిష్యత్తు అని అన్నారు. ముఖ్యంగా మనదేశంలో ఉన్న యువతకు శారీరక దృఢత్వం అవసరమన్నారు. యోగా , ప్రాణయామం, వ్యాయామం లాంటి కసరత్తులు చేస్తూ యువత ఎప్పుడూ దృఢంగా ఉండాలన్నారు. విద్య వలన వినయం వస్తుందన్నారు. వినయం మనిషిని ఉన్నత స్థాయికి తీసుకువెళుతుందన్నారు. 21వ శతాబ్దంలో కేవలం డిగ్రీ ఉంటే సరిపోదన్నారు. డిగ్రీతో పాటు నైపుణ్యాలు నేటి యువతకు అవరసమని పేర్కొన్నారు. ప్రపంచం నూతన ఆవిష్కరణలతో దూసుకుపోతుందన్నారు. అందుకు భారత యువత కూడా ఏమాత్రం తీసిపోదన్నారు. నిత్యం నేర్చుకునే తత్వమే అత్యంత శక్తివంతమైన ఆయుధమని అన్నారు. చదువుకునేందుకు గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చిన వారు ఎంతో మంది ఉండి ఉంటారని, అయితే తాను కూడా గ్రామీణ ప్రాంతం నుండే వచ్చానని చెప్పారు. ఉన్నత పాఠశాల విద్య కోసం ప్రతీ రోజు 6 కిలోమీటర్ల దూరం నడుచుకుంటూ వెళ్లి వచ్చేవాడినని తన బాల్య జీవితాన్ని గుర్తు చేసుకున్నారు. కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీ అధ్యక్షులు శ్రీ కోనేరు సత్యన్నారాయణ గారు మాట్లాడుతూ తాము తమ వర్శిటీలో చదువుతున్న విద్యార్దులకు చదువుతో పాటు సామాజిక కార్యక్రమాల పట్ల అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. గ్రామీణ ప్రాంతాలకు తమ విద్యార్దులు వెళ్లి పలు రకాల సేవా కార్యక్రమాలు చేస్తున్నారని తెలిపారు. దేశంలోనే అత్యున్నత అంతర్జాతీయ స్థాయి నాణ్యతా ప్రమాణాలు కలిగి ఎ ప్లస్ సర్టిపికేట్ ఉన్న తమ వర్సిటీ లో విద్యాభ్యాసం పూర్తి చేసిన విద్యార్దులు దేశ విదేశాల్లో రు.57 లక్షల రూపాయల జీతాలతో ఉద్యోగాలు సాదించి చరిత్ర సృష్టించారని తెలిపారు. వైస్ చాన్సులర్ డాక్టర్ జి.పార్ధసారదివర్మ మాట్లాడుతూ 2024 విద్యా సంవత్సరంలో విద్యాభ్యాసం పూర్తి చేసుకున్న 4 వేల 7వందల 6 మంది విద్యార్థులకు డిగ్రీలను ప్రదానం చేయనున్నట్లు తెలియచేశారు. ఇందులో 166 మంది పి. హెచ్. డి, 604 మంది పోస్ట్ గ్రాడ్యుయేషన్, 3 వేల 9వందల 36 మంది అండర్ గ్రాడ్యుయేషన్ కోర్సులు పూర్తి చేసుకున్న విద్యార్థులు ఉన్నారని పేర్కొన్నారు. అలాగే గత విద్యా సంవత్సరంలో అత్యంత ప్రతిభ కనబరచిన 42 మంది విద్యార్థులకు బంగారు, 37 మందికి రజత పతకాలను, నగదు బహుమతులను అందించనున్నట్లు ఆయన చెప్పారు. తమ విశ్వ విద్యాలయానికి చెందిన విద్యార్థులు ఆయా విబాగాలలో సుమారు 170కి పైగా జాతీయ, అంతర్జాతీయ ప్రాజెక్టులను విజయవంతంగా పూర్తి చేశారని తెలిపారు. అందుకుగాను యుజిసి నుండి కెఎల్ యు కు వంద కోట్ల రూపాయల వరకు నిధులు కేటాయించబడినట్లు పేర్కొన్నారు. తమ వర్సిటీ లో 1200 మంది అత్యంత నిపుణులైన అద్యాపకులు ఉండగా వారిలో 600 మంది వివిద విబాగాలలో డాక్టరేట్ లు సాదించినవారే కావడం విశేషమన్నారు పలువురు విద్యార్దులు అంతర్జాతీయ స్థాయిలో వివిద క్రీడలలో బంగారు, రజిత పతకాలు సాదించి దేశం గర్వపడేలా చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమానికి కోనేరు సత్యన్నారాయణ గారు అధ్యక్షత వహించారు. సంధాత కర్త, వర్శిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావులు వ్యవహరించారు. కార్యక్రమంలో కెఎల్ ఇఎఫ్ కార్యదర్శి కోనేరు శివకాంచనలత, ఉపాధ్యక్షులు కోనేరు రాజా హరీన్, బోర్డు సభ్యురాలు కోనేరు నిఖిల, అన్ని విభాగాల డీన్లు, డైరెక్టర్ లు, ప్రిన్సిపల్స్, విభాగాధిపతులు పాల్గొన్నారు.

# పవర్ కావాంటే పవన్...

కాకినాడ, నవంబర్ 30, జనసేన అధినేత పవన్ కల్యాణ పూర్తి ఫామ్ లో ఉన్నాడు. సినీరంగంలో వెలిగిపోయినట్లుగా రాజకీయ రంగంలోనూ 2024 ఎన్నికల తర్వాత ఆయన పవర్ స్టార్ అయ్యారు. పవర్ కావాలంటే పవన్ వెంట ఉండాలన్న నినాదాన్ని ఆయన వెంట పెట్టుకుని తిరుగుతున్నారు. ఇది ఆయనకు వెన్నంటి ఉన్న కాపు సామాజికవర్గం కావచ్చు. అభిమానులు కావచ్చు. ఆయనకు జనంలో ఉన్న క్రేజ్ కావచ్చు. పవన్ కల్యాణ్ పక్కన ఉంటే చాలు గెలుపు తథ్యమన్న భావన రాజకీయపార్టీల్లో నెలకొంది. పవన్ కల్యాణ్ ను వదులుకునేందుకు బహుశ కూటమిలోని ఏ పార్టీ సిద్ధంగా లేదు. పది కాలాల పాటు అధికారంలో ఉండాలంటే పవన్ సహకారం అవసరమన్న నమ్మకంలో నేతలున్నారు అదే సమయంలో తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు కూడా పవన్ కల్యాణ్ కు అన్ని విధాలుగా గౌరవం ఇస్తున్నారు. గుర్తింపు ఇస్తున్నారు. ఆయన అడిగింది అడిగినట్లు చేస్తున్నారు. తన వారిని కాదనుకుని మరీ పవన్ మాటను తీసిపక్కన పెట్టలేని పరిస్థితుల్లో చంద్రబాబు ఉన్నారు. వంద రోజులు పాలన సమావేశంలోనూ, ఇటీవల జరిగిన ఎమ్మెల్యేలతో జరిగిన భేటీలోనూ ఇదే కూటమితో వచ్చే ఎన్నికల్లో వెళతామని చంద్రబాబు చెప్పారంటే పవన్ వెంట ఉంటే విజయం తమ వెంటేనన్న ధీమాతో ఉన్నారు. పవన్ కల్యాణ్ కు పెద్దగా పదవీకాంక్ష లేదు. అధికార దాహం కూడా లేదని, అలాగే పాలనలో పెద్దగా జోక్యం చేసుకునే మనస్తత్వం కాదని, తన పని తాను చేసుకుబోయే వ్యక్తి కనుక ఇద్దరి మధ్య కెమిస్ట్రీ బాగా కుదిరిందని టీడీపీ నేతలే అంగీకరిస్తున్నారు. ఇక కూటమిలోని మరొక పార్టీ బీజేపీ. బీజేపీ పవన్ కల్యాణ? ను కేవలం ఆంధ్రప్రదేశ్ కు పరిమితం చేసి చూడటం లేదు. దక్షిణాది రాష్ట్రాలకు తమ పార్టీకి ముందు ముందు భవిష్యత్ నేతగా భావిస్తుంది. అందుకే పవన్ కల్యాణ? కు



బీజేపీ కేంద్ర నాయకత్వం అంత ప్రయారిటీ ఇస్తుంది. పవన్ తరచూ ఢిల్లీ వెళుతూ యన ప్రాతినిధ్యం వహించే శాఖకు మాత్రం నిధులు దండిగానే మంజూరు చేసుకుంటున్నారు. బీజేపీ అధినాయకత్వం కూడా పవన్ ను మచ్చిక చేసుకుంటుంది. మరో వైపు పవన్ కల్యాణ? కూడా వ్యక్తిగతంగా బీజేపీ కంటే మోదీ, అమిత్ షాలకు వీరభక్తుడిగా నిలిచారు. వారిద్దరినీ అమితంగా ప్రేమించే పవన్ కల్యాణ? వారిని వదులకుని వేరు కుంపటి పెట్టుకునే ప్రయత్నం చేయరన్నది అంతే వాస్తవం. అందుకే జమిలి ఎన్నికలు 2027 ఎన్నికల్లో జరుగుతాయిని ప్రచారం జరుగుతుంది. అదే జరిగితే పవన్ కల్యాణ్ పంట పండినట్లే. ఎందుకంటే ముందు వచ్చిన ఎన్నికల్లో పవన్ కల్యాణ? ఈసారి అత్యధిక స్థానాలను కూటమి పార్టీల నుంచి తెచ్చుకునే అవకాశముంది. మొన్నటి ఎన్నికల్లో 21 అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ, రెండు పార్లమెంటు స్థానాలకే పరిమితమైన జనసేనాని ఈసారి మాత్రం అంతకు రెట్టింపు స్థానాలను కోరే అవకాశముంది. అందుకే జనసేనలోకి పార్టీ నేతలను చేర్చుకుంటున్నారని అంటున్నారు. టీడీపీ నుంచి కూడా పెద్దగా ఇబ్బంది ఉండకపోవచ్చని అంటున్నారు. కనీసం యాభై స్థానాలకు పైగానే ఈసారి పోటీచేయాలన్న ఉద్దేశ్యంతో ఆయన ఉన్నారని తెలిసింది. తాను కింగ్ మేకర్ గా మారాలన్నది పవన్ కల్యాణ్ వ్యూహంగా కనిపిస్తుంది. అందుకే పవన్ ఏం మాట్లాడకుండా తన పని తాను చేసుకుపోతున్నారు. అయితే ఇటీవల శాసనసభలో పదేళ్ల పాటు సీఎంగా చంద్రబాబు ఉండాలని చేసిన కామెంట్స్ కూడా వ్యూహాత్మకమేనని అంటున్నారు. ఏపీ రాజకీయాల్లో ఆసక్తికరమైన పరిణామాలు జమిలి ఎన్నికల తర్వాత చోటు చేసుకుంటాయన్న అభిప్రాయం మాత్రం బలంగా వినిపిస్తుంది.

# ఏపీలో తగ్గిన మద్యం ధరలు




ఒంగోలు, నవంబర్ 30, ఏపీలో మద్యం ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. ఐదేళ్లుగా చుక్కలనంటుతున్న మద్యం ధరలతో ఖజానాకు భారీగా ఆదాయం వస్తున్న ప్రజల జేబులకు మాత్రం భారీగా చిల్లు పడుతోంది. 2019 జూన్ ధరలతో పోలిస్తే 2024 జూన్‌కు మద్యం ధరలు దాదాపు రెట్టింపు అయ్యాయి. ఏపీలో అక్టోబర్ 16నుంచి ప్రైవేట్ మద్యం దుకాణాలు ఏర్పాటయ్యాయి. ప్రభుత్వ మద్యం దుకాణాల స్థానంలో వేలంలో దక్కించుకున్న వారి ఆధ్వర్యంలో మద్యం దుకాణాలను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో కొత్తగా రూ.99 బ్రాండ్‌ను తీసుకొచ్చిన మిగిలిన బ్రాండ్ల ధరలను మాత్రమే పాత ధరలనే కొనసాగించింది. దీనిపై పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. జనం జగన్ బాటలోనే చంద్రబాబు ప్రభుత్వం నడుస్తోందని గొణుక్కుంటూ మద్యం కొనుగోలు చేస్తున్నారు. దీనిపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు రావడంతో ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టింది. మద్యం ధరలపై ఇప్పటికే రిటైర్డ్ జడ్జి ఆధ్వర్యంలో కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ నివేదిక రావడానికి ముందే ధరలు తగ్గుముఖం పట్టడం చర్చనీయాంశంగా మారింది. .రాష్ట్రంలో మద్యం ధరలను తగ్గించడానికి మూడు పాపులర్ కంపెనీలు ముందుకు వచ్చాయి. ప్రముఖ సంస్థల ప్రతిపాదనలకు ఎక్సైజ్ శాఖ వాటి ఆమోదం తెలిపింది. తగ్గించిన ధరలను అమల్లోకి తెస్తూ ఉత్తర్వులు విడుదల అయ్యాయి. ప్రస్తుతం దుకాణాల్లో పాత ఎమ్మార్పీలతో ఉన్న బాటిళ్లను ఆ ధరలకే విక్రయిస్తారు. కొత్తగా వచ్చే స్టాకును తగ్గించిన ధరలతో అమ్ముతారు. ఏపీలో గత ఐదేళ్లలో ప్రముఖ బ్రాండ్ల విక్రయాలకు అవకాశం ఉండేది కాదు. తాజాగా అన్ని బ్రాండ్లను విక్రయించుకోడానికి అనుమతిస్తున్నారు. ధరలు తగ్గిన బ్రాండ్లలో మాన్షన్ హౌస్ ఒకటి. 2019లో టీడీపీ ప్రభుత్వం గద్దె దిగే సమయానికి క్వార్టర్ రూ.110 ఉన్న మద్యాన్ని వైసీపీ హయంలో ఓ దశలో రూ.300కు విక్రయించారు. పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో ధరలు తగ్గించి చివరకు రూ.220కు ఫిక్స్ చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా అవే ధరలు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం మాన్షన్ హౌస్ బ్రాందీ క్వార్టర్ ధర రూ.220 నుంచి రూ.190కి తగ్గింది. అదే బ్రాండ్ హాఫ్ బాటిల్ ధర రూ.440 నుంచి రూ.380కి, ఫుల్ బాటిల్ ధర రూ.870 నుంచి రూ.760కి తగ్గించారు. రాయల్ చాలెంజ్ సెలెక్ట్ గోల్డ్ విస్కీ క్వార్టర్ ధర రూ.230 నుంచి రూ.210కి తగ్గింది. ఇదే బ్రాండ్ ఫుల్ బాటిల్ ధర రూ.920 నుంచి రూ.840కి తగ్గించారు. యాంటిక్విటీ బ్లూ విస్కీ ఫుల్ బాటిల్ ధర రూ.1600 నుంచి రూ.1400కు తగ్గింది. మద్యం ధరలపై పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో ప్రభుత్వం ఓ కమిటీని నియమించింది. త్వరలో ఈ కమిటీ అన్ని బ్రాండ్ల కంపెనీలతో చర్చించి ధరల సవరణపై సిఫారసు చేయనుంది. అందుకు అనుగుణంగా కొత్త ధరలు అమల్లోకి వస్తాయి. కమిటీ నిర్ణయించక ముందే కొన్ని బ్రాండ్లు రేట్లు తగ్గించుకుంటున్నాయి. మరో రెండు ప్రముఖ బ్రాండ్ల మద్యం ధరలు రెండు మూడు రోజుల్లో ధరలు తగ్గించనున్నాయి. హైకోర్టు రిటైర్డ్ జడ్జి నేతృత్వంలో మద్యం ధరల సవరణ కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఆ కమిటీ అన్ని కంపెనీలతో ధరల సవరణపై చర్చలు జరపనుంది. బాటిల్ తయారీకి ఎంత ఖర్చు అవుతుంది? ప్రభుత్వానికి వచ్చే ఆదాయంతో పాటు ఇతర రాష్ట్రాల్లో విక్రయిస్తున్న ధరలను పరిశీలించనుంది. ఏపీ, తెలంగాణలో విక్రయించే బ్రాండ్ల ధరల్లో భారీ వ్యత్యాసాలుంటే వాటిని ప్రశ్నించే అవకాశం ఉంది. ముందు జాగ్రత్తగా ధరలు తగ్గిస్తున్నాయని చెబుతున్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైసీపీ ఘోర పరాజయం పాలవడంలో మద్యం కూడా కీలక పాత్ర పోషించింది. సంపూర్ణ మద్య నిషేధం పేరుతో అధికారంలోకి వచ్చిన జగన్ చివరకు మద్యం అమ్మకాలతో అమ్మఒడి వంటి సంక్షేమ పథకాలకు లింకు పెట్టి మద్యం అమ్మకాలు సాగించాడు. మద్యం ధరలు గణనీయంగా పెరగడం, నాణ్యత లేకపోవడం, ఊరు పేరు లేని బ్రాండ్ల విక్రయాలను జే బ్రాండ్లుగా ప్రచారం చేయడంలో టీడీపీ సక్సెస్ అయ్యింది. మద్యం ధరలు భారీగా పెంచడంతో ప్రభుత్వానికి ఆదాయం కూడా 2019తో పోలిస్తే రెట్టింపైంది. మద్యం ఉత్పత్తి సంస్థలు నేరుగా విక్రయించే అవకాశం లేకపోవడంతో తమ మద్యాన్ని ఏపీ బేవరేజీస్ కార్పొరేషన్‌కు సరఫరా చేస్తుంటాయి. మద్యం గరిష్ట ధరను ప్రభుత్వమే నిర్ణయిస్తుంది. డిస్టిలరీలు ప్రభుత్వానికి సరఫరా చేసే ధరను బేసిక్ ధరగా పరిగణిస్తారు. ఈ ధరపై ఎక్సైజ్ డ్యూటీ విధిస్తారు. ఆ మొత్తానికి స్పెషల్ మార్జిన్, హోల్‌సేల్ ట్రేడ్ మార్జిన్ విధిస్తారు. ఈ పన్నులన్నీ విధించిన తర్వాత వచ్చేదానిపై వ్యాట్ వసూలు చేస్తారు. ఈ మొత్తం ధరపై 20 శాతం రిటైలర్ మార్జిన్ విధిస్తారు. ఈ మొత్తంపై అదనపు రిటైల్ ఎక్సైజ్ టాక్స్ వేస్తారు. పన్నులన్నీ కలిపిన తర్వాత కొనుగోలుదారుడికి అందించే ధరను ఎమ్మార్పీగా ముద్రిస్తారు. మద్యం ఉత్పాదక ధరతో పోలిస్తే ప్రభుత్వం వసూలు చేస్తున్న పన్నులే అధికంగా ఉంటున్నాయి. వైసీపీ హయంలో రకరకాల పేర్లతో మద్యం ఆదాయాన్ని పెంచుకునే ప్రయత్నాలు జరిగాయి. మద్యం బేసిక్ ధర ఆధారంగా అదనపు రిటైల్ ఎక్సైజ్ టాక్స్ విధిస్తారు. ఇలా వసూలు చేసే పన్ను ఇండియన్ మేడ్ ఫారిన్ లిక్కర్‌పై 137 శాతం నుంచి 226 శాతం వరకు ఉంటుంది. కొన్ని బ్రాండ్లపై ఉత్పాదక వ్యయం కంటే అధికంగా పన్నులు చెల్లిస్తున్నారు. బీర్లపై 211శాతం, వైన్‌పై 187శాతం, రెడీ టు డ్రింక్స్‌పై 39శాతం వసూలు చేస్తున్నారు.

# పక్కదారి పడుతున్న సచివాలయ సేవలు

నెల్లూరు, నవంబర్ 30, ఆంధ్రప్రదేశ్‌లో గ్రామ వార్డు సచివాలయ వ్యవస్థను ప్రక్షాళన చేస్తామని ప్రకటించి నెలలు గడుస్తున్నా ఆ దిశగా చర్యలు మాత్రం కొరవడ్డాయి. రాష్ట్ర వ్యాప్తంగా 15వేల గ్రామ, వార్డు సచివాలయాలను ఐదేళ్ల క్రితం వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. సచివాలయాల్లో దాదాపు లక్షా 30వేల మందికి పైగా శాశ్వత ఉద్యోగులు ఉన్నారు. వైసీపీ ప్రభుత్వంలో దాదాపు 23 రకాల ప్రత్యక్ష నగదు బదిలీ పథకాలను అందించడంలో సచివాలయాలు కీలకం వ్యవహరించాయి. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత పాత పథకాలు నిలిచిపోయాయి. దీంతో సచివాలయ సిబ్బందిని ఇతర ప్రభుత్వ శాఖలు తమ పనులకు వాడుకుంటున్నారు. అవి లేని చోట ఉద్యోగులు కార్యాలయాలకు వచ్చి వెళుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పౌర సేవల్ని ప్రజల వద్దకు చేర్చే క్రమంలో గ్రామ వార్డు సచివాలయాలను ఏర్పాటు చేశారు. ప్రతి 2-3వేల జనాభాకు ఓ సచివాలయాన్ని ఏర్పాటు చేసి అందులో 8-10మంది సిబ్బందిని నియమించారు. ఇలా ఏర్పాటు చేసిన సచివాలయాల పరిధిలో ప్రతి ఇంటిని అయా సచివాలయాలకు అనుసంధానించారు. ప్రతి యాభై ఇళ్లకు ఓ వాలంటీర్‌ను నియమించి వారి ద్వారా ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందించే వారు. ఊరురా సచివాలయాలను ఏర్పాటు చేసినా ఆ సచివాలయం పరిధిలో ప్రజలు తప్ప ఇతరులకు అవి పనికొచ్చేవి కాదు. రాష్ట్ర వ్యాప్తంగా 15వేలకు పైగా ప్రభుత్వ కార్యాలయాలను ఇంటర్నెట్‌తో అనుసంధానించినా ఒక సచివాలయానికి సంబంధించిన వారికి మరో సచివాలయం పరిధిలో సేవలు అందని పరిస్థితి ఉండేది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎలక్ట్రానిక్ సర్వీసెస్ డెలివరీ విభాగం ద్వారా మెరుగైన పౌర సేవలు అందించిన చరిత్ర ఏపీకి ఉంది. సచివాలయాల ఏర్పాటుతో గతంలో ఏర్పాటైన మీసేవలను రద్దు చేయాలని ప్రభుత్వం భావించింది. హైకోర్టు జోక్యంతో వాటిని కొనసాగిస్తున్నారు. మరోవైపు సచివాలయాల్లో అందాల్సిన పౌర సేవలు సక్రమంగా అందకపోవడం, ప్రచారం తప్ప డిజిటల్ సేవలు ప్రజలకు అందించే పరిస్థితులు లేకపోవడంతో ప్రజలు తిరిగి మీసేవల చుట్టూ తిరగాల్సి వస్తోంది. సచివాలయాల్లో పనిచేసే సిబ్బందిపై అన్ని ప్రభుత్వ శాఖలు పెత్తనం చేయడం మరో కోణం. నేరుగా పౌర సేవలు అందించే అధికారం సచివాలయాలకు కల్పించలేదు. సంబంధిత విభాగం ద్వారా సచివాలయ సిబ్బంది ద్వారా దరఖాస్తులను పంపడానికి మాత్రమే పరిమితం అయ్యాయి. ఉదాహరణకు పదేళ్ల క్రితం వరకు విజయవాడ అర్బన్ మొత్తం ఒకే మండలంగా ఉండేది. ఒక ఎమ్మార్వోతో పాటు మరో 60మంది సిబ్బంది ఉండేవారు. అప్పట్లో మీ సేవల్లో పౌర సేవల కోసం దరఖాస్తు చేసుకుంటే గరిష్టంగా మూడు రోజుల్లో వాటికి పరిష్కారం లభించేది. క్యాస్ట్, ఇన్‌కమ్, రెసిడెన్స్ తో పాటు రెవిన్యూ కార్యాలయాలు జారీ చేసే అన్ని రకాల సర్టిఫికెట్లను గరిష్టంగా వారం లోపు పరిష్కరించేవారు. ఉమ్మడి ఏపీలో డిజిటల్ పౌర సేవల్ని చంద్రబాబు ప్రవేశపెట్టినపుడు ఏ సర్టిఫికెట్ ఎన్ని రోజుల్లో జారీ చేయాలనే సిటిజన్ ఛార్టర్ అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రదర్శించేవారు. గడువులోగా సేవలు అందకపోతే ఫిర్యాదు చేసే వ్యవస్థలు ఉండేవి. ప్రస్తుతం విజయవాడ నగరం నాలుగు మండలాలుగా మారింది. నగరంలో నలుగురు ఎమ్మార్వోలు పనిచేస్తున్నారు. 286 సచివాలయాల్లో 286మంది విఆర్వో స?థాయి సిబ్బంది పనిచేస్తున్నా పౌరసేవలు సక్రమంగా అందడం లేదు. సచివాలయాల్లో దరఖాస్తు చేస్తే ఎప్పటి సర్టిఫికెట్లు అందుతాయో తెలియని పరిస్థితి. ప్రభుత్వ ఉద్యోగులకు సహజంగా అలవడే అవలక్షణాలను కొందరు సచివాలయ సిబ్బంది వేగంగా అలవర్చుకున్నారు. కార్యాలయాల్లో ఉండకపోవడం సేవల్ని సక్రమంగా అందించకపోవడం వంటి సమస్యలు రాష్ట్రమంతటా ఉన్నాయి. దీనికి తోడు ఇతర శాఖలు అప్పగించిన పని ఒత్తిడి తమపై ఉంటోందనే ఉద్యోగుల వాదన ఉంది. డిజిటల్ పౌర సేవల విషయంలో ఉన్నతాధికారుల నిర్లక్ష్యం కూడా స్పష్టంగా కనిపిస్తోంది. రెవిన్యూ ద్వారా అందించే పలు రకాల సేవల్ని నేరుగా అందిస్తున్నట్టు అయా శాఖలు చెబుతున్నా క్షేత్ర స్థాయిలో మాత్రం ఇబ్బందులు తప్పడం లేదు. సచివాలయాల్లో మ్యుటేషన్ వంటి సేవలు అందించాల్సి ఉన్నా ఆ పనిచేయడం లేదు. ఈసీలు, సర్టిఫైడ్ కాపీల వంటి వాటిని ఆన్‌లైన్‌లో జారీ చేయడంలో సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయి. ఆన్‌లైన్‌లో జారీ చేసే సర్టిఫికెట్లను న్యాయస్థానాలు తిరస్కరిస్తున్నాయి. స్వయంగా దరఖాస్తు చేసి ప్రింట్ తీసుకుంటే తెల్లకాగితంపై వచ్చే సర్టిఫికెట్లను ఈసీలు, సీసీలను కోర్టులు అనుమతించడం లేదని న్యాయవాదులు చెబుతున్నారు. సచివాలయ ఉద్యోగులకు విధి నిర్వహణలో స్వతంత్ర గుర్తింపు లేకపోవడంతో వారిలో జవాబుదారీతనం కూడా లోపించింది. దీనికి తోడు వివిధ ప్రభుత్వ శాఖలు క్షేత్ర స్థాయి పనులకు సచివాలయ ఉద్యోగులను వాడుకుంటున్నాయి. ఎవరికి వారు తాము అప్పగించిన పని మొదట పూర్తి చేయాలని ఒత్తిడి చేస్తున్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా కుటుంబాల సర్వే, జియో ట్యాగింగ్ పూర్తి చేసే బాధ్యత అప్పగించింది. అది ఇంకా కొలిక్కి రాలేదు. కొన్ని చోట్ల బయో మెట్రిక్, ఐరీస్ యంత్రాలు పనిచేయక పోవడం, మరికొన్ని చోట ఇతర పని ఒత్తిళ్లతో జియో ట్యాగింగ్, ఇంటింటి సర్వేను అటకెక్కించారు. సచివాలయాల నిర్వహణపై ఏటా వేల కోట్ల రుపాయలను ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. ఊరురా ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటు ఆలోచన బాగున్నా వాటి ద్వారా అందుతున్న సేవలు ఏ మేరకు ప్రజలకు చేరుతున్నాయనేది కూడా ముఖ్యమే. ఏ ప్రభుత్వ శాఖకు సంబంధించిన పౌర సేవల్ని సచివాలయాలు నేరుగా అందించే పరిస్థితి లేదు. పట్టణాల్లో కనీసం డ్రైనేజీ కనెక్షన్లు, పారిశుధ్య నిర్వహణ, ఇంటి పన్ను వసూళ్లు, విద్యుత్ కనెక్షన్లు వంటి సేవల్ని కూడా సచివాలయాలు నేరుగా అందించే పరిస్థితి లేదు. 'ఏపీలో సచివాలయ వ్యవస్థ వైఫల్యాలపై జాతీయ స్థాయి పబ్లిక్ పాలసీ కోర్సుల్లో పాఠ్యాంశాలుగా చెప్పే పరిస్థితి నెలకొంది.

# గంజాయి నియంత్రించేందుకు ఈగల్ ఏర్పాటు

గుంటూరు, నవంబర్ 30, ఏపీ పోలీస్ శాఖలో కొత్త దళం ఏర్పాటైంది. గంజాయి, మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం మోపేందుకు ఎలైట్ యాంటీ-నార్కోటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్ఫోర్స్మెంట్ – ఈగల్ ఏర్పాటైంది. మొత్తం 459 మంది సిబ్బంది పనిచేసే ఈగల్‌ను ఏర్పాటు హోంశాఖ కార్యదర్శి కుమార్ విశ్వజిత్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖలో కొత్త వ్యవస్థ ఏర్పాటైంది. వ్యవస్థీకృతంగా మారిన గంజాయి సాగు, మాదక ద్రవ్యాల రవాణా అరికట్టేందుకు పోలీస్ శాఖలో కొత్త దళాన్ని ఏర్పాటు చేశారు. ఎలైట్ యాంటీ-నార్కోటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్ఫోర్స్మెంట్ – ఈగల్ పేరుతో కొత్త జట్టును ఏర్పాటు చేస్తూ హోంశాఖ కార్యదర్శి కుమార్ విశ్వజిత్ ఉత్తర్వులు జారీ చేశారుఈగల్ ఏర్పాటులో దానికి రూపురేఖలు తీసుకువచ్చారు. అమరావతిలో రాష్ట్రస్థాయి నార్కోటిక్స్ పోలీసుస్టేషన్, జిల్లాకొకటి చొప్పున 26 నార్కోటిక్స్ కంట్రోల్ విభాగాలు ఉంటాయి. పోలీస్ శాఖలో గతంలో ఉన్న స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోను కూటమి ప్రభుత్వం రద్దు చేసింది. వైసీపీ హయంలో ఎక్సైజ్, పోలీసులతో కలిపి అక్రమ మద్యం,ఇసుక, మైనింగ్‌లపై నిఘా కోసం సెబ్‌ను ఏర్పాటు చేశారు. దాని వల్ల ప్రత్యేకంగా ఏమి సాధించలేకపోయారనే అపప్రదను వైసీపీ మూటగట్టుకుంది. దానిని టీడీపీ రద్దు చేసింది. కొత్తగా ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేస్తూ హోంశాఖ ఉత్త ర్వులు జారీ చేసింది. ఈగల్ బృందానికి గుంటూరు, కర్నూలు జిల్లాల్లో ఎస్పీగా, తర్వాత సుదీర్ఘ కాలం ఇంటెలిజెన్స్ బ్యూరోలో పనిచేసిన ఐజీ ఆకే రవికృష్ణ సారథ్యం వహిస్తారు. ఈగల్ కోసం అమరావతిలో రెండు స్టేషన్లు, గంజాయి సమస్య తీవ్రంగా ఉన్న ఏవోబీలోని విశాఖపట్నం, పాడేరు కేంద్రాలుగా మరో రెండు కలిపి మొత్తం నాలుగు రాష్ట్రస్థాయి టాస్క్ ఫోర్స్ బృందాలు ఈగల్‌లో పనిచేస్తాయి. అమరావతిలో రాష్ట్రస్థాయి నార్కోటిక్ పోలీసుస్టేషన్ ఏర్పాటు చేస్తారు. కేసుల విచారణ కోసం రాష్ట్ర వ్యాప్తంగా మరో ఐదు చోట్ల ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేస్తారు. ఫిర్యాదులకు టోల్ ఫ్రీ నంబర్ 1972 ఏర్పాటు చేశారు.

నార్కొటిక్స్ స్టేషను రాష్ట్రమంతటా పరిధి కల్పించారు. అమరావతిలో ఏర్పాటుచేసే నార్కోటిక్స్ పోలీస్ సిబ్బందికి రాష్ట్రంలో ఎక్కడైనా గంజాయి డ్రగ్స్ సంబంధిత కేసుల దర్యాప్తు చేయెుచ్చు. కేసుల విచారణకు విశాఖ, రాజమహేంద్రవరం, విజయవాడ, గుంటూరు, తిరుపతిల్లో ప్రత్యేకంగా ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది. మాదక ద్రవ్యాలపై ఫిర్యాదులు చేసేం టోల్ ఫ్రీ నంబర్ (1972)ను ఏర్పాటు చేశాడు ఆమరావతిలో ఏర్పాటు చేసే కాల్ సెంటర్ 24 గంటలూ పనిచేస్తుంది. నార్కోటిక్స్ పోలీసు, నార్కోటిక్స్ కంట్రోల్ విభాగాల్లో మొత్తం 450 మంది సిబ్బంది పని చేయ నున్నారు. ప్రధాన కార్యాలయానికి 200 మందిని, జిల్లాల్లోని స్టేషన్ విభాగాలకు 181 పోస్టులు కేటాయించారు. పోలీసు శాఖలోని సిబ్బందిని డిప్యూటేషన్‌పై తీసుకొని ప్రత్యేకంగా శిక్షణ ఇస్తారు. ఈ విభాగంలో పనిచేసే వారికి అదనపు ఇన్సెంటివ్‌లు చెల్లిస్తారు. ఈగల్ హెడ్ ఆఫీస్, నార్కోటిక్ పోలీస్ స్టేషన్, జిల్లా నార్కోటిక్ కంట్రోల్ సెల్ లో పని చేసే వారికి విధి నిర్వహణ కాలంలో 30శాతం స్పెషల్ అలోవెన్స్ చెల్లిస్తారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆధ్వర్యంలో విశాఖపట్నం, రాజమహేంద్రవరం, విజయవాడ, గుంటూరు, తిరుపతి ప్రాంతాల్లో 5 స్పెషల్ కోర్టులు లేదా ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ఏర్పాటును డీజీపీ నేరుగా పర్యవేక్షిస్తారు. ఒక్కో నార్కోటిక్ పోలీస్ స్టేషన్ లో 66 మంది సిబ్బంది డిప్యుటేషన్ లో విధులు నిర్వర్తిస్తారు. జిల్లాలవారీగా నార్కోటిక్స్ కంట్రోల్ సెల్స్ లో 144 మంది పనిచేస్తారు. మొత్తం 358 మంది అధికారులతో ఈగల్ వ్యవస్థ ఏర్పాటు చేశారు. ఔట్ సోర్సింగ్ సిబ్బంది కూడా కలుపుకుని డ్రగ్స్ నియంత్రణ కోసం మొత్తం 459 మందితో కూడిన ఈగల్ వ్యవస్థలో ఉంటారు. అందులో డిప్యూటేషన్ పద్ధతిలో 341 మంది, రెగ్యులర్ పద్ధతిలో 17 మందికి విధులు అప్పగించారు. రూ.8.59 కోట్ల ఖర్చుతో ఈగల్ నిర్వహణకు ప్రత్యేక బడ్జెట్ కేటాయింపులు చేశారు. పరిశోధన పర్యవేక్షణ మరియు లీగల్ వింగ్, డాక్యుమెంటేషన్ ట్రైనింగ్ మరియు అవార్నెస్ వింగ్, అడ్మినిస్ట్రేటివ్ అండ్ లాజిస్టిక్స్ వింగ్, టెక్నికల్ వింగ్, స్టేట్ టాస్క్ ఫోర్స్ ల వంటి 5 కీలక విభాగాల ఏర్పాటుకు మార్గదర్శకాలు చేశారు. 1972 టోల్ ఫ్రీ నంబర్ నిర్వహణ కోసం సెంట్రల్ కంట్రోల్ రూమ్ లో 12 మంది కాల్ టేకర్ల నియమించారు. స్వాధీనం చేసుకున్న డ్రగ్స్ సీసీ టీవీల ద్వారా సెంట్రల్ డిపాజిటరీ ద్వారా నిరంతర నిఘా ఉంచుతారు. నార్కోటిక్ ప్రధాన పోలీస్ స్టేషన్ లో 66మంది పోలీస్ అధికారుల బృందం సేవలు అందిస్తారు. ప్రతి జిల్లాలో ఒకటి చొప్పున ఏపీ వ్యాప్తంగా 26 డిస్ట్రిక్ నార్కోటిక్స్ కంట్రోల్ సెల్ (డీఎన్ సీసీ)ల ఏర్పాటు చేస్తారు.

# కొడాలి, వల్లభనేనిలకు సినిమాలేనా...

విజయవాడ, నవంబర్ 30, వైసీపీ హయాంలో మాజీ మంత్రి కొడాలి నాని , మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అంతకంటే దారుణంగా బూతులతో చెలరేగిపోయారు. అయితే వారిపై ఎన్ని కేసులు నమోదవుతున్నా చర్యలు తీసుకోవడం లేదు. కూటమి ప్రభుత్వ ఏర్పాడ్డాక గత అయిదేళ్లలో ఇష్టానుసారం సోషల్ మీడియాలో చెలరేగిపోయిన వైసీపీ మద్దతుదారుల భరతం పడుతున్నారు పోలీసులు. వైసీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు బూతు మంత్రులకు బ్రాండ్ అంబాసిడర్‌గా నిలిచారు గుడివాడ మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి కొడాలి నాని. ఆయనతో పాటు అప్పటి గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ సైతం అదే రేంజ్లో చెలరేగిపోయారు. టీడీపీ టికెట్‌తో రెండు సార్లు గన్నవరం ఎమ్మెల్యేగా గెలిచి.. రెండో సారి గెలిచినప్పుడు కొడాలి నాని వెంట వెళ్లి జగన్ సమక్షంలో వైసీపీ తీర్థం పుచ్చుకున్న వంశీ.. అప్పటి వైసీపీ నేతలకంటే ఎక్కువగా బూతు పురాణం వినిపించారు. అటు గుడివాడ, ఇటు గన్నవరాల్లో కొడాలి నాని, వల్లభనేని వంశీలపై కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక పలు కేసులు నమోదవుతున్నాయి. టీడీపీ అధినేత చంద్రబాబు, లోకేష్‌లతో పాటు జనసేనాని పవన్‌కళ్యాణ్‌లను వ్యక్తిగతంగా, కుటుంబపరంగా దూషించినందుకు గాను వరుసగా కేసులు పెడుతున్నారు. దానికి తోడు వారు చేసిన అక్రమాలు, దౌర్జన్యాలపై పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారు. అయితే వారిపై మాత్రం ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదుఅ ఇద్దరినీ పర్మనెంటుగా బుక్ చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్న అభిప్రాయం వ్యక్తమతుంది. వారి అక్రమ వ్యవహారాలపై పక్కాగా ఆరా తీసి, పకడ్బందీ సాక్ష్యాలతో చర్యలు చేపట్టడానికి కసరత్తు జరుగుతున్నట్లు చెప్తున్నారు. ఆ క్రమంలో గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి ఉచ్చు బిగుస్తున్నట్లు తెలుస్తోంది. గన్నవరం నియోజకవర్గంలో అక్రమ మైనింగ్ జరిగినట్లు విజిలెన్స్ గుర్తించింది. అక్రమ తవ్వకాలపై మాజీ ఎమ్మెల్యే వంశీతో పాటు అతని ప్రధాన అనుచరులపై కూడా విజిలెన్స్ కేసులు నమోదు అయ్యే అవకాశాలు కనిపిస్తుండడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. వంశీ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో గన్నవరం నియోజకవర్గంలో మైనింగ్ కోసం తన వద్ద పని చేసే డ్రైవర్లతో పాటు కూలీల పేరుతో.. తవ్వకాలకు దరఖాస్తులు పెట్టి ఇష్టానుసారంగా ఐదేళ్ల పాటు తవ్వకాలు చేసినట్టు ఆరోపణలు ఉన్నాయి. కొండలు, గుట్టలు, బంజర భూములు, పోలవరం కట్టలను సైతం తవ్వినట్లు విమర్శలు ఉన్నాయి. వల్లభనేని వంశీపై ఆరోపణలను ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో మైనింగ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర సైతం ప్రస్తావించారు. దాంతో అక్రమ మైనింగ్‌పై విజిలెన్స్ అధికారులు దూకుడు పెంచినట్లు సమాచారం. ఈ క్రమంలోనే రైతులు, దినసరి కూలీలు ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా వంశీని ప్రధాన సూత్రధారుడిగా గుర్తించినట్లు తెలుస్తోంది. సీనరేజి చెల్లించకుండా తవ్విన మట్టి విలువ సుమారు 100 కోట్లు ఉండొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. అక్రమ తవ్వకాలపై మాజీ ఎమ్మెల్యే వంశీతో పాటు అతని ప్రధాన అనుచరులపై కూడా విజిలెన్స్ కేసులు నమోదు చేయనున్నట్టు తెలుస్తుంది. ఈఃత్వరలో వంశీని అరెస్ట్ చేసే అవకాశం ఉందని అంటున్నారు. ఇక కొడాలి నాని అరాచకాలపై ఆరోపణలకు కొదవేలేదు. అప్పట్లో ఆయన కేసినో నిర్వహించారని, ప్రత్యర్థులపై క్యాడర్ తో దాడులు చేయించారని ఆరోపణలు వచ్చినా అధికారంలో ఉండటంతో పోలీసులు పట్టించుకోలేదు. కానీ ఇప్పుడు అవే కేసుల్ని పోలీసులు వెలికితీస్తున్నారంట. గుడివాడలో టీడీపీ నేతలు, పార్టీ ఆఫీస్ లపై గతంలో వైసీపీ నేతలు చేసిన దాడుల కేసులు పోలీసులు తిరగదోడుతున్నారంట. అప్పట్లో టీడీపీ ఆఫీస్ లో ఉన్న రావి, ఇతరనేతలపై కత్తులు, కర్రలు, ఇనుపరాడ్లు, పెట్రోల్ ప్యాకెట్లతో దాడులకు పాల్పడ్డారు . ఆ దాడులకు సంబంధించి పోలీసులు వీడియో ఫుటేజ్ సేకరించారంట. ఈ దాడుల్లో పాల్గొన్న కొడాలి నాని అనుచరులు, ఇతర వైసీపీ నేతలపై ప్రస్తుతం కేసులు నమోదవుతున్నాయి. మరోవైపు గతంలో కే కన్వెన్షన్ క్యాసినో వ్యవహారంపై టీడీపీ నిజనిర్ధారణ కమిటీ వేసింది. అప్పట్లో గుడివాడ వచ్చిన నిజ నిర్ధారణ కమిటీపైనా వైసీపీ నేతలు దాడులకు పాల్లడ్డారు. కార్లు, ఫర్నిచర్ ధ్వంసం చేసిన ఘటనల్లో అప్పటి పోలీసులు చర్యలు తీసుకోలేదు. అప్పటి కేసుల్ని వెలికితీసి ఇందులో కొడాలి నాని పాత్రను నిరూపించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నా రంట. కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో.. అప్పుడు వారికి కొమ్ము కాసిన పోలీసులే ఇప్పుడు చుక్కలు చూపిస్తున్నారనే కామెంట్లు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే గతంలో టీడీపీపైనా, ఆ పార్టీ అధినేత, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబుపైనా, ఆయన కుటుంబసభ్యుల పైనా పలుమార్లు వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన కొడాలి నాని, వల్లభనేని వంశీలకి ఉచ్చు బిగిస్తున్నారని అంటున్నారు. చంద్రబాబు కుటుంబంపై వ్యాఖ్యల అంశాన్ని ఫోకస్ చేయకుండా? నాని, వంశీ పాల్పడిన ఇతర కార్యకలాపాలపై నమోదైన కేసుల్లో వారిని జైలుకు పంపించే ప్రయత్నాలు జరుగుతున్నాయని చెబుతున్నారు. వారిలానే సీఎంపై నోరు పారేసుకున్న పెడన మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి జోగి రమేశ్ విషయంలో వ్యవహరిస్తున్నట్లుగానే కొడాలి నాని విషయంలోనూ ముందుకెళ్లనున్నట్లు తెలుస్తోంది. గతంలో చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేయడంతోపాటు తన అనుచరులతో కలిసి బాబు ఇంటిపైకి జోగి రమేశ్ దూసుకెళ్లి దాడి చేయడం తెలిసిందే. అయితే ఈ అంశాన్ని ప్రస్తావించకుండా.. అగ్రిగోల్డ్ భూములను జోగి రమేశ్ కుటుంబ సభ్యులు అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారన్న కేసుపై ఆయన కుమారుడు జోగి రాజీవ్ ను పోలీసులు అరెస్టు చేశారు. ఆ క్రమంలోనే కొడాలి నాని, వల్లభనేని వంశీల చుట్టు ఉచ్చు బిగుసుకుంటున్నట్లు చెప్తున్నారు.

# సంగం డెయిరీ పదవే అడ్డంకా...

గుంటూరు, నవంబర్ 30, పొన్నూరు నియోజకవర్గం ఎమ్మెల్యే, టీడీపీలో సీనియర్ నేత దూళిపాళ్ల నరేంద్రకు పదవీ యోగం లేనట్లే కనిపిస్తుంది. ఎందరికలో పదవులు లభిస్తున్నా నరేంద్రకు మాత్రం తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చినా పదవులు మాత్రం దక్కడం లేదు. నరేంద్ర కు మంత్రి పదవి రావాల్సినంత సీనియారిటీ ఉంది. ఆయన సామాజికవర్గంగా కూడా బలమైన నేత. ఆయన ఇప్పటికి ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. 2024లో పొన్నూరు నియోజకవర్గం నుంచి గెలిచిన ధూళిపాళ్ల నరేంద్ర ఇక వెనుదిరిగి చూడలేదు. 1999, 2004, 2009, 2014 ఎన్నికల్లో వరసగా విజయం సాధించారు. ఒక్క 2019 ఎన్నికల్లో మాత్రమే కిలారు రోశయ్య చేతిలో ఓటమి పాలయ్యారు. మరోసారి 2024 ఎన్నికల్లో టీడీపీ నుంచి గెలిచారు. 1994 లో తన తండ్రి ధూళిపాళ్ల వీరయ్య మరణంతో తెలుగుదేశం పార్టీలోకి అడుగుపెట్టిన ధూళిపాళ్ల నరేంద్ర ఇక వెనుదిరిగి చూడలేదు. పక్క చూపులు చూడలేదు. ఆయనకు వివాద రహితుడిగా పేరుంది. అదే సమయంలో అవినీతి మచ్చ కూడా ఇంత వరకూ అంటలేదు. అయితే అదేందో కానీ నరేంద్ర విజయం సాధించినా, టీడీపీ అధికారంలోకి వచ్చినా ఆయనకు మంత్రి పదవి మాత్రం దక్కలేదు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా టీడీపీ తరుపున పోరాటం చేసిన వాళ్లలో నరంద్ర ఒకరు.ఆరోసారి గెలిచి ఉమ్మడి గుంటూరు జిల్లాలోనే సీనియర్ నేతగా ధూళిపాళ్ల నరేంద్ర ఉన్నారు. 2024 కూటమి గెలిచిన తర్వాత ఆయనకు టీడీపీ కోటాలో మంత్రి పదవి వస్తుందని భావించారు. కానీ అదే సామాజికవర్గానికి చెందిన జనసేన నేత నాదెండ్ల మనోహర్ కు మంత్రి పదవి దక్కడంతో సామాజికవర్గం కోటాలో ధూళిపాళ్లనరేంద్ర పేరును పక్కన పెట్టినట్లే కనిపిస్తుంది. గత ప్రభుత్వ హయాంలో నరేంద్ర ఎన్నో ఇబ్బందులు పడ్డారు. చివరకు అరెస్టయి జైలుకు కూడా వెళ్లి వచ్చారు. అయినా నరేంద్ర కు మాత్రం ఎటువంటి పదవులు దక్కకపోవడం ఆయన వర్గంలో చర్చనీయాంశమైంది. అయితే నరేంద్ర సంగం డెయిరీ ఛైర్మన్ గా కొనసాగుతున్నారు. ఆ పదవి ఉన్నందున మరో పదవి ఇవ్వడానికి టీడీపీ అధినాయకత్వం మొగ్గు చూపడం లేదన్న కామెంట్స్ వినపడుతున్నాయి. అయితే నరేంద్ర పార్టీని నమ్ముకున్న విధానం, గెలిచిన తీరును చూసైనా మంత్రి పదవి కాకపోయినా కేబినెట్ ర్యాంకు ఉన్న మరో పదవిని ఇస్తే బాగుండేదన్నఅభిప్రాయం పార్టీలో వ్యక్తమవుతుంది. అయితే నరేంద్ర ముక్కుసూటి మనస్తత్వం ఆయనను పదవులకు దూరం చేస్తుందన్న వాదన కూడా లేకపోలేదు. మొత్తం మీద ఆరోసారి ఎమ్మెల్యేగా గెలిచినా కూడా నరేంద్రకు పదవి దక్కకపోవడం పై ఆయన అనుచరులు పెదవి విరుస్తున్నారు పార్టీ అధినాయకత్వం మాత్రం సంగం డెయిరీ ఛైర్మన్ పదవికి రాజీనా?మా చేస్తే పదవి ఇస్తామన్న ప్రతిపాదన పెట్టినా అందుకు నరేంద్ర తిరస్కరించినట్లు తెలిసింది.

# పోస్టాఫీసులకు పరుగో... పరుగు..

తిరుపతి, నవంబర్ 30, సాధారణంగా పోస్టాఫీస్ లకు ఆదరణ తగ్గింది. ఒక్క హెడ్ పోస్టాఫీసులు తప్ప.. మిగతా వాటిలో పెద్దగా లావాదేవీలు కనిపించవు. జనాలు కూడా ఉండరు. అటువంటిది గత కొద్ది రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పోస్టాఫీస్ లు జనాలతో కళకళలాడుతున్నాయి. రోజురోజుకీ జనం తాకిడి పెరుగుతోంది. చాలామంది కొత్త ఖాతాలు తెరిచేందుకు క్యూ కడుతున్నారు. గతంలో ఎన్నడూ లేని ఈ వాతావరణానికి కారణం ప్రభుత్వం నుంచి వచ్చిన ఒక సంకేతమే. ఏపీలో కూటమి అధికారంలోకి వచ్చి ఆరు నెలలు అవుతోంది. ఇప్పుడిప్పుడే సంక్షేమ పథకాల అమలు ప్రారంభం అయ్యింది. పెన్షన్ల పెంపు, ఉచిత గ్యాస్ సిలిండర్లు వంటి పథకాలు అమలవుతున్నాయి. మిగతా పథకాలు సైతం వీలైనంత త్వరగా అమలు చేస్తామని కూటమి ప్రభుత్వం చెబుతోంది. ఇదే క్రమంలో బ్యాంకుల్లో ఖాతాలు లేని వారు, ఆధార్ లింకు కాని వారు పోస్ట్ ఆఫీస్ లో ఖాతాలు తెరవాలని ఓ సంకేతం వచ్చింది. దీంతో లక్షలాది మంది జనం పోస్ట్ ఆఫీస్ ల చుట్టూ తిరగడం ప్రారంభించారు. అయితే ఇప్పటికే పోస్ట్ ఆఫీసుల్లో ఖాతాలు ఉన్నవారు సైతం ఎగబడుతుండడం విశేషం.ఇదివరకు మాదిరిగా పోస్ట్ ఆఫీసులకు ఆదరణ తగ్గింది. ఉత్తర ప్రత్యుత్తరాలు కూడా తగ్గాయి. ఇప్పుడంతా నెట్ బ్యాంకింగ్ విధానం అమల్లోకి వచ్చింది. దీంతో పోస్ట్ ఆఫీస్ లో వైపు చూడడం మానేశారు ప్రజలు. కానీ ఇప్పుడు కొత్తగా వచ్చిన ఈ ప్రచారంతో ఎక్కువమంది పోస్ట్ ఆఫీస్ వైపు పరుగులు తీస్తున్నారు. వాస్తవానికి బ్యాంకులో అకౌంట్ లేనివారు, ఉండి కూడా ఆధార్ తో లింకు కాని వారు మాత్రమే పోస్ట్ ఆఫీసుల్లో ఖాతా తెరవాల్సి ఉంటుంది. అలాగే పోస్ట్ ఆఫీసులో అకౌంట్ ఉన్నవారు వాటికి నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ తో లింక్ కాకపోతే.. అటువంటివారు పోస్ట్ ఆఫీస్ కి వెళ్లి లింక్ చేసుకోవాలి. కానీ ఇవేం తెలియని చాలామంది ఎక్కడ సంక్షేమ పథకాలుకోల్పోతామని భావించి పోస్ట్ ఆఫీస్ వైపు పరుగులు తీస్తున్నారు.అయితే ఈ విషయంలో అవగాహన కల్పించాల్సిన సచివాలయ సిబ్బంది తమకు పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. ఆధార్ లింక్ కాని వారి వివరాలను సేకరించి పంపిస్తున్నారు. అయితే అసలు విషయం తెలియని చాలామంది అనవసరంగా పోస్ట్ ఆఫీస్ లకు వెళ్తున్నారు. ఆధార్ లింకు ఎందుకు? అలా ఎందుకు చేయాలి? చేయకపోతే వచ్చే ఇబ్బందులు ఏంటి? అనే అంశాలను గ్రామస్థాయిలో అవగాహన కల్పిస్తే పెద్ద ఇబ్బందులు ఉండవు. అయితే సచివాలయ సిబ్బంది ఆధార్ లింక్ కోసం పంపిస్తుండటంతో.. ప్రతి ఒక్కరూ పోస్ట్ ఆఫీస్ లకు వెళ్తున్నారు. దీంతో పోస్ట్ ఆఫీసులు రద్దీగా మారుతున్నాయి.

# సీనియర్లకు పదవులు నో...




విజయవాడ, నవంబర్ 30, టీడీపీలో సీనియర్ నేతలందరూ దాదాపు క్రియాశీలక రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్లే కనపడుతుంది. పార్టీలోనూ, నియోజవర్గాల్లోనూ వారు పట్టు కోల్పోవడంతో పాటు నేటి తరంతో వారు పరుగులు తీయలేరని, పాత పద్ధతుల నుంచి బయట పడటక పోవడంతో చంద్రబాబు నాయుడు సీనియర్ నేతలను మొన్నటి ఎన్నికల్లోనే పక్కన పెట్టారు. కొందరు నేతలు తాము స్వచ్ఛందంగా రాజకీయాల నుంచి పక్కకు తప్పుకోగా, మరికొందరిని చంద్రబాబు కావాలనే తప్పించారు. చంద్రబాబు నాయుడు ఎన్నికలకు ముందు చేయించిన సర్వేల్లో వీరికి ప్రజల నుంచి సరైన మద్దతు లభించకపోవడమూ కారణమే. ఈనాటి రాజకీయాల్లో నిత్యం ప్రజల్లో ఉండాలి. వివాహాలు, మరణాలకు ఒక్కటేంటి.. ఏ ఇంట్లో కార్యక్రమం జరిగినా ఎమ్మెల్యే ఖచ్చితంగా హాజరయ్యే పరిస్థితులున్నాయి. అలా మారిపోయింది. ఒకనాడు అలా కాదు. ముఖ్యమైన నేతల ఇళ్లకే ఎమ్మెల్యేలు వెళ్లేవారు. గ్రామాల్లోకి కూడా ఎన్నికలకు ముందు వెళ్లి అలా కనిపించి వచ్చే వారు. కానీ ఇప్పుడు అలా కాదు...గ్రామాలను ఖచ్చితంగా నెలలో ఒకసారి విజిట్ చేయాల్సిందే. అక్కడే వారితో కూర్చుని భోజనం చేయాల్సిందే. ఆరోజు అంతా ఆ గ్రామస్థులతో గడిపి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇవ్వాల్సి వస్తుంది. ప్రజలు ఎక్కువగా డిమాండ్ చేసే పరిస్థితి ఎక్కువగా ఉంది పాత రాజకీయ పద్ధతులను ఈ పరిస్థితుల్లో వయసు మీద పడటం, పాత రాజకీయ పద్ధతులను వదులుకోకపోవడం, వాటినే పట్టుకుని వేలాడుతుండటంతో ప్రజల వారంటే ఒకరకమైన ఏహ్యాభావం ఏర్పడింది. దీంతో సీనియర్ నేతలు అధికార తెలుగుదేశం పార్టీలో కనిపించడం లేదు. అంతా యువరక్తంతో నిండిపోయింది. ఇది మంచిపరిణామమే అయినా కొన్ని సార్లు అనుభవం కూడా రాజకీయాలకు అవసరం అవుతుంది. ముఖ్యంగా యనమల రామకృష్ణుడు ఎమ్మెల్సీగా ఉన్నా ఆయన టీడీపీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. ఇక కేఈ కుటుంబం కూడా దాదాపు పక్కకు తప్పుకుంది. ఆయన కుమారుడు శ్యాంబాబ్ మాత్రమే ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఉన్నారు. అశోక్ గజపతిరాజు వంటి సీనియర్ నేత కూడా ఏ పదవి లేకుండా విజయనగరంలో ఖాళీగా కూర్చున్నారు. రాయపాటి కుటుంబం రాజకీయాల నుంచి పూర్తిగా పక్కకు తప్పుకుంది. రాయపాటి సాంబశివరావుకు కూడా వయసు మీరడంతో ఆయనకు ఎంపీ టిక్కెట్ కూడా చంద్రబాబు ఇవ్వలేదు. దీంతో ఆ కుటుంబం పాలిటిక్స్ నుంచి పూర్తిగా తప్పుకున్నట్లయింది. ఇక మాగుంట బాబు వంటి వారిని కూడా చంద్రబాబు పక్కన పెట్టారు. ఇలా అనేక మంది సీనియర్ నేతలు ఒకప్పుడు టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు చక్రం తిప్పిన వారు ఇప్పుడు స్క్రీన్ మీద కనిపించకుండా పోయారు. వారిలో కొందరికే పెద్దల సభకు అవకాశం ఇచ్చేందుకు చంద్రబాబు రెడీ అవుతున్నారని తెలిసింది. కేబినెట్ లో కూడా యువరక్తానికే పెద్ద పీట వేయడంతో సీనియర్‌లకు ఇక సైకిల్ పార్టీలో కాలం చెల్లినట్లేనని అనుకోవాల్సిందే.


# రేషన్ బియ్యం దందాపై పవన్ ఆగ్రహం

విజయవాడ, నవంబర్ 30, ఏపీలో రేషన్ బియ్యం దందాపై పవన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదల బియ్యం విదేశాలకు తరలిపోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల కాకినాడ పోర్టు నుంచి సౌత్ ఆఫ్రికా కు 640 టన్నుల బియ్యంతో వెళ్తున్న షిప్ పట్టుబడిన సంగతి తెలిసిందే. కాకినాడ జిల్లా కలెక్టర్ తో పాటు ఎస్పీ ఆ షిప్ ను అదుపులోకి తీసుకున్నారు. ఈ నేపథ్యంలో ఈరోజు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్,మంత్రి నాదెండ్ల మనోహర్ పట్టుబడిన షిప్ తో పాటు బియ్యాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంత జరుగుతున్న స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులకు బాధ్యత లేదా?అని ప్రశ్నించారు.వైసిపి ప్రభుత్వ హయాంలో భారీగా కాకినాడ పోర్టు నుంచి బియ్యం తరలిపోవడంపై పవన్ విమర్శలు వ్యక్తం చేశారు. అయితే ఇప్పుడు కూటమి అధికారంలోకి వచ్చినా.. ఇంకా బియ్యం తరలిపోతుండడంపై ఆవేదన వ్యక్తం చేశారు పవన్అప్పట్లో వైసీపీ ఎమ్మెల్యే ఒకరు కీలకంగా వ్యవహరించారు ఈ దందాలో. ఆయనపై పెద్ద ఎత్తున ఆరోపణలు వచ్చాయి. పవన్ సైతం ఆయన పేరును ప్రస్తావిస్తూ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు కూడా. అయితే అదే కాకినాడ పోర్టు నుంచి ఇప్పుడు కూడా రేషన్ బియ్యం తరలిపోతుండడం పై సీరియస్ గా ఉన్నారు పవన్. ఇంత జరుగుతున్నా స్థానిక ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు, ఇతర అధికారులు ఏం చేస్తున్నట్టు అని ప్రశ్నించారు.రేషన్ బియ్యం మాఫియా కు కాకినాడ పోర్టు హబ్ గా మారిందని సంచలన వ్యాఖ్యలు చేశారు. బియ్యం మాఫియా వెనుక ఎంతటి వారున్నా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు పవన్.మరోవైపు పవన్ ఆదేశాలతో అధికారులు ఉరుకులు, పరుగులు పెట్టారు. కొద్ది రోజుల కిందట పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పోర్టు ప్రాంతాన్ని పరిశీలించారు. బియ్యం తరలింపు విషయంలో సీరియస్ ఆదేశాలు జారీ చేశారు. కానీ అక్కడ బియ్యం తరలింపు ప్రక్రియ మాత్రం ఆగలేదు. ఇంకా పెరుగుతుండడం పై స్వయంగా డిప్యూటీ సీఎం పవన్ రంగంలోకి దిగారు. నేరుగా సౌత్ ఆఫ్రికాకు బియ్యంతో వెళ్తున్న షిప్ ను పరిశీలించారు. అక్కడికక్కడే సీరియస్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో అధికార యంత్రాంగంలో ఒక రకమైన చలనం ప్రారంభం అయ్యింది. మరోవైపు రాష్ట్రస్థాయిలో బియ్యం మాఫియా విషయంలో ప్రభుత్వం కీలక ఆదేశాలు ఇచ్చే అవకాశం కనిపిస్తోంది.

ఆఫ్రికాకు రేషన్ బియ్యం

వైసిపి హయాంలో కాకినాడ పోర్టు ద్వారా భారీగా బియ్యం తరలిపోతున్నాయని అప్పట్లో కూటమి నేతలు ఆరోపించారు. దీని వెనుక వైసీపీ నేతలు ఉన్నారన్నది అప్పట్లో కూటమి నేతల నుంచి వినిపించిన మాట.అయితే ఇప్పటికీ రేషన్ బియ్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడడం లేదు. గతంలో కాకినాడ పోర్టులో పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వరుస తనిఖీలు కూడా చేశారు. అయినా సరే ఎటువంటి మార్పు రాలేదు. తాజాగా కాకినాడ పోర్టు నుంచి రేషన్ బియ్యంతో వెళ్తున్న ఓ సౌతాఫ్రికా షిప్ ను కాకినాడ జిల్లా కలెక్టర్ తో పాటు ఎస్పీ పట్టుకున్నారు. షిప్ లో దాదాపు 640 టన్నుల అక్రమ రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు గుర్తించారు. ఈ షిప్ పరిశీలించేందుకు డిప్యూటీ సీఎం పవన్ తో పాటు మంత్రి నాదెండ్ల మనోహర్ వెళ్ళనున్నారు. సౌత్ ఆఫ్రికా షిప్ తో పాటు లాంచీలో వేలాది టన్నుల బియ్యం ఉన్నట్లు అధికారులు గుర్తించారు.దీంతో దానిని కూడా పవన్,మనోహర్ లు కలిసి పరిశీలించనున్నారు. ప్రభుత్వం ఎన్ని రకాల కట్టడి చర్యలు చేపట్టినా రేషన్ బియ్యాన్ని ఆఫ్రికన్ దేశాలకు బియ్యం మాఫియా తరలిస్తూనే ఉంది. ముఖ్యంగా కాకినాడ కేంద్రంగా ఈ దందా నడుస్తూనే ఉంది.ఈ బియ్యం తరలింపు వెనుక లవన్ ఇంటర్నేషనల్ ఎక్స్పోర్ట్ సంస్థను గుర్తించారు. పవన్ స్వయంగా రంగంలోకి దిగుతుండడం సంచలనం అవుతోంది. అక్కడికక్కడే దీనిపై అధికారులకు ఆదేశాలు ఇవ్వబోతున్నారు పవన్. దీంతో పవన్ పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. గతంలో విపక్షంలో ఉన్నప్పుడు కాకినాడ పోర్టు నుంచి బియ్యం తరలింపు పై చాలా సందర్భాల్లో మాట్లాడారు పవన్. ఇప్పుడు అధికారిక హోదాలో అక్కడకు వెళ్తున్నారు. దీంతో పవన్ ఎటువంటి ఆదేశాలు ఇవ్వబోతారో అన్న చర్చ నడుస్తోంది.అయితే కాకినాడ పోర్టు నుంచి రేషన్ బియ్యం తరలింపు ఇప్పటిది కాదు. గతం నుంచి కూడా ఈ దందా కొనసాగుతూనే ఉంది. వివిధ జిల్లాల నుంచి రేషన్ బియ్యం రోడ్డు మార్గంలో ఇక్కడికి చేరుకుంటుంది. అనంతరం నౌకల ద్వారా విదేశాలకు తరలిపోతుంది. ముఖ్యంగా ఆఫ్రికన్ దేశాలకు ఈ బియ్యం తరలిస్తున్నట్లు తెలుస్తోంది. దీనిపై ఉక్కు పాదం మోపాల్సిన అవసరం ఉంది.

# జనవరి 11నే అయోధ్య వార్షికోత్సవం



లక్నో, నవంబర్ 30, భారత దేశం లోనే కాదు ప్రపంచంలో ఉన్న హిందువుల స్వప్నం అయోధ్యలో రామాలయ నిర్మాణం. 500 ఏళ్లుగా రామాలయ నిర్మాణం కోసం జరిగిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. ఎట్టకేలకు అయోధ్యలో రామ మందిర నిర్మాణంపై సుప్రీం కోర్టు తీర్పు వెల్లడించడంతో రెండేళ్ల క్రితం ఆలయ నిర్మాణం ప్రారంభించారు. 2022 డిసెంబర్ నాటికి మొదటి దశ నిర్మాణం పూర్తయింది. దీంతో 2023, జనవరి 22న ఆలయలో బాలరాముడి విగ్రహం ప్రతిష్టాపనోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. దేశంలోని ప్రముఖులతోపాటు విదేశాల నుంచి కూడా ప్రముఖులు తరలివచ్చారు. బాల రాముడిని దర్శించుకుని తరించారు. పూర్తిగా విరాళాలతో ఈ ఆలయం నిర్మించారు. ప్రధాని నరేంద్రమోదీ బాలరాముని ప్రాణప్రతిష్ట నిర్వహించారు. అప్పటి నుంచి నిత్యం వేల మంది భక్తులు అయోధ్య వెళ్లి రామయ్యను దర్శించుకుంటున్నారు.ఆలయం ప్రారంభించి మరో రెండు నెలల్లో ఏడాదది పూర్తవుతుంది. ఈ నేపథ్యంలో వార్షికోత్సవం నిర్వహణ కోసం శ్రీరామజన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ అధ్యక్షతన ఇటీవల సమావేశం నిర్వహించారు. రామాలయ వార్షికోత్సవ వేడుకల నిర్వహణపై నిర్ణయం తీసుకున్నారు. వార్షికోత్సవ వేడుకలను జనవరి 22న కాకుండా జనవరి 11నే నిర్వహించాలని నిర్ణయించారు. పది రోజుల ముందే వేడుకల నిర్వహణ వెనుక కారణం ఉందని ట్రస్ట్ సభ్యులు తెలిపారు. ఈ సమావేశంలో ఏ రోజు ఏ ఉత్సవం నిర్వహించాలో నిర్ణయం తీసుకున్నారు. రామాలయం వార్షికోత్సవాన్ని హిందూ క్యాలెండర్ ప్రకారం నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు. పుష్య శుక్ల ద్వాదశి అంటే కూర్మ ద్వాదశి రోజు ఉత్సవం జరుపుకోవాలని పండితులు తెలిపారు. అంటే ఇంగ్లిష్ క్యాలెండర్ 2025, జనవరి 11న ఈ తిథి వస్తుంది. దీని ప్రకారమే అయోధ్యలో నూతన రామాలయ, బాలరాముని ప్రాణ ప్రతిష్ట వార్షికోత్సవం నిర్వహించాలని తీర్మానించారు. శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ వేడుకలకు ఏర్పాట్లు చేయాలని కూడా సమావేశంలో నిర్ణయించారు.

# విమర్శలను కౌంటర్ చేయడంలో వైఫల్యం మంత్రులు ఎందుకు సైలెంట్

హైదరాబాద్, నవంబర్ 30, తెలంగాణ రాష్ట్రంలో పదేళ్ల తరువాత కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. రేవంత్ హయాంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి 11 నెలలు కావస్తోంది. మరో నెల గడిస్తే ఏడాది పూర్తవుతుంది. ఒక్క ఏడాదిలోనే తాము ఎన్నో అభివృద్ధి పనులు చేశామని కాంగ్రెస్ చెప్పుకుంటోంది. ఎన్నో పథకాలను అమలు చేశామని సీఎం, మంత్రులు చెబుతున్నారు. ఏడాదిలో ఎన్నో గొప్ప పనులు చేసినట్లు ప్రచారం చేస్తున్నారు. ఈ ఏడాదిలో తాము గొప్పగా పనులు చేశామని, కేసీఆర్ గత పదేళ్లలో చేయని పనులను తాము చేశామని రేవంత్ ఇటీవల బహిరంగ సభల్లోనూ చెబుతూ వస్తున్నారు.ఇదిలా ఉంటే.. బీఆర్ఎస్ మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉన్నారు. ఆ పార్టీపై విమర్శలు చేస్తూనే ఉన్నారు. పదేళ్లుగా తాము ఇటుక ఇటుక పేర్చి అభివృద్ధి చేశామని, ఇప్పుడు వాటిని పేకమేడల్లా కూల్చేస్తున్నారంటూ గులాబీ నేతలు వాపోతున్నారు. పదేళ్లలో చూడని విధ్వంసం ఏడాదిలోనే చూస్తున్నామని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయితే.. ఎవరి వాదనలు ఎలా ఉన్నా ఇప్పుడు ప్రజల్లో మాత్రం ఇదే విషయంపై చర్చ నడుస్తోంది. రెండు వర్గాలు కూడా తమ వాదనలను బలంగా రుద్దే ప్రయత్నమే చేస్తున్నారు. ఈ విషయంలో రేవంత్ కాస్త వెనుకబడిపోయారని కామెంట్స్ వినిపిస్తున్నాయి. చేసింది చెప్పుకోవడంలో కాంగ్రెస్ వర్గాలు అనుకున్నంతగా ముందడుగు వేయలేకపోతున్నారని అంటున్నారు.అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు అధికారం చేపట్టిన వెంటనే రేవంత్ సర్కార్ ఫ్రీ బస్ జర్నీ ప్రారంభించారు. ఈ పథకం వల్ల పెద్ద ఎత్తున మహిళలకు డబ్బులు మిగులుతున్నాయి. లక్షలాది మంది మహిళలు ఉచితంగా ప్రయాణిస్తున్నారు. అయితే.. మహిళలకు ఎంతవరకు మేలు చేశామో కూడా చెప్పుకోలేకపోతున్నారు. ఈ విషయాన్ని పబ్లిసిటీ చేసుకోవడంలో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా విఫలమైంది. ఇక మరో పెద్ద టాస్క్ అయిన రుణమాఫీ కూడా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం నెరవేర్చింది. రైతులకు చాలా మందికి రుణమాఫీ చేసింది. దాదాపు 18వేల కోట్ల వరకు రుణమాఫీ చేసినట్లు ప్రభుత్వం లెక్కలు చెప్తున్నాయి. అయితే.. రుణమాఫీ పైనా ప్రచారం చేసుకోవడంలో రేవంత్ సర్కార్ విఫలమైనట్లు ప్రచారాలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా బీఆర్ఎస్ పార్టీ ఇంకా పూర్తిస్థాయిలో రుణమాఫీ కాలేదన్న విమర్శలకు ఎక్కువగా మైలేజీ వస్తున్నట్లు తెలుస్తోంది. అయితే.. ఈ ఏడాది కాలంలో రేవంత్ రెడ్డి మంచి పనులే చేశారు. ఎక్కడ కూడా ప్రజలపై భారం మోపే ఒక్క పనిని కూడా చేయలేదు. కానీ.. బీఆర్ఎస్ మాత్రం నిమిషం కరెంటు పోయినా దానికి రేవంత్ రెడ్డినే కారణమంటూ నిందిస్తూనే ఉంది. ఇప్పుడే పాలన మెరుగ్గా ఉన్నప్పటికీ బీఆర్ఎస్ చేస్తున్న ప్రచారాన్ని మాత్రం కాంగ్రెస్ ఎందుకు తిప్పికొట్టలేకపోతోందా అని అంటున్నారు. నిజానికి గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ఇలాగే ఉండేది. కానీ.. దేనికి కాంగ్రెస్ వెనుకబడి పోతోందా అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. మరోవైపు.. పరిశ్రమలు ఏర్పాటు చేయాలంటే భూముల సేకరణ సైతం కావాలి. సీఎం సొంత నియోజకవర్గంలో భూసేకరణ చేయాలని అనుకుంటే దానిని బీఆర్ఎస్ వివాదస్పదం చేసింది. కానీ.. దానికి ఆ స్థాయిలో కాంగ్రెస్ కౌంటర్ ఇవ్వలేకపోయింది. ఇప్పటికైనా రేవంత్ అండ్ టీమ్ బీఆర్ఎస్ విమర్శలను తిప్పికొట్టకపోతే ముందుముందు ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ప్రారంభమయ్యే అవకాశాలు లేకపోలేదన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

# ఐపీసీ 497 కొట్టేసిన సుప్రీం

## ఇష్టమైన బంధం నేరం కాదన్న న్యాయస్థానం

న్యూఢిల్లీ, నవంబర్ 30, భారత దేశంలో వైవాహిక బంధానికి మంచి గుర్తింపు ఉంది. మన బంధాన్ని ప్రపంచంలో చాలా దేశాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయి. మన సంప్రదాయం ప్రకారం పెళ్లి చేసుకోవడానికి విదేశీయులు భారత్‌కు వస్తున్నారు. కొందరు విదేశీయులు భారత్‌కు చెందిన యువతీ యువకులను ప్రేమించి పెళ్లి చేసుకుంటున్నారు. ఇక మన వివాహ బంధాలు ఎక్కువకాలం ఉంటాయని భావిస్తారు. అందుకే మన సంప్రదాయాన్ని చాలా మంది విశ్వసిస్తున్నారు. భారతీయులు కూడా ప్రేమ పెళ్లి కన్నా పెద్దలు కుదిర్చిన వివాహాలు ఎక్కువ కాలం నిలబడతాయంటారు. అయితే ఇటీవల పాశ్చాత్య పోకడతో మన యువత కూడా దారి తప్పుతోంది. పెళ్లికి ముందే ప్రేమ, దోమ, లివింగ్ టుగెదర్, డేటింగ్ అంటూ పెళ్లి తర్వాత జరగాల్సివి పెళ్లికి ముందే కానిచ్చేస్తున్నారు. దీంతో పెళ్లి తర్వాత కూడా కొందరు పాత సంబంధాలు కొనసాగిస్తున్నారు. ఇవి సంసారాల్లో చిచ్చు పెడుతున్నాయి. దాడులకు, హత్యలకు, విడాకులకు దారి తీస్తున్నాయి అయితే వివాహేతర సంబంధం విషయంలో తాజాగా సుప్రీంకోర్టు సంచలన తీర్పు ఇచ్చింది. పెళ్లి తర్వాత వివాహిత తన ఇష్టంతో మరో పురుషుడితో శృంగారంలో పాల్గొంటే తప్పుగా పరిగణించలేమని దేశ అత్యున్నత న్యాయస్థానం తెలిపింది. ఈమేరకు ముంబై ఖార్గర్ స్టేషన్‌లో ఏడేళ్ల క్రితం ఓ వ్యక్తిపై



వితంతువు పెట్టిన రేప్ కేసుపై విచారణ జరిపిన సుప్రీం ధర్మాసనం.. అది తప్పుడు కేసని కొట్టేసింది. రిలేషన్ బాగున్నప్పుడు శృంగారంలో పాల్గొని.. విభేదాలు వచ్చాక కక్షతో రేప్ కేసులు పెట్టడం సరికాదని పేర్కొంది. ఇది మగవాళ్లకు ఆందోళన కలిగించే అంశమని జస్టిస్ బీవీ. నాగరత్న, జస్టిస్ కోటీశ్వర్‌సింగ్ ధర్మాసనం తెలిపింది. కొందరు పెళ్లి చేసుకుంటామనే ఒప్పందంతో సన్నిహితంగా ఉంటారని, కచ్చితంగా చెప్పలేమని స్పష్టం చేసింది. వివాహేతర సంబంధంపై గతంలో కూడా సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. భర్తకు మహిళ వ్యక్తిగత ఆస్తి కాదని, వివాహేతర బంధాన్ని నేరంగా పరిగణిస్తున్న ఐపీసీ 497ను కొట్టేసింది. 2018 సెప్టెంబర్‌లో వెలువడిన తీర్పు ప్రకారం మహిళ వ్యక్తిగత స్వేచ్ఛను హరిస్తున్న 497 కు కాలం చెల్లిందని అభిప్రాయపడింది. అది రాజ్యాంగ విరుద్ధమని న్యాయస్థానం తెలిపింది. బ్రిటిష్ కాలం నాటిన వ్యభిచార వ్యతిరేక చట్టం మహిళలను మగవారు తమ సొంత ఆస్తిగా పరిగణించేలా ఉందని పేర్కొంది. ఇది వారి ప్రాథమిక హక్కులకు భంగం కలిగించడమే అని అభిప్రాయపడింది. ఇష్టంతో శృంగారంలో పాల్గొనడం మహిళల హక్కు అని తెలిపింది. ఆమెకు షరతులు విధించలేమని స్పష్టం చేసింది. వివాహేతర బంధం నేరం కాకపోయినా నైతికంగా తప్పు. దీనిని కారణంగా చూపి విడాకులు తీసుకోవచ్చు అని కూడా ధర్మాసనం తెలిపింది.

# హైదరాబాద్ లో ఖేల్ ఇండియా 2026

హైదరాబాద్, నవంబర్ 30, హైదరాబాద్ నగరంలో 32వ జాతీయ క్రీడలు (2002లో), ఆఫ్రో ఆషియన్ గేమ్స్, 7వ మిలిటరీ గేమ్స్ సహా అనేక జాతీయ స్థాయి పోటీలు జరిగాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆ లేఖలో ప్రస్తావించారు. క్రీడా రంగానికి గత పదేండ్ల పాలనతో పోలిస్తే ప్రస్తుత ప్రభుత్వం ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నదని, జాతీయ స్థాయి పోటీలను నిర్వహించడానికి అవసం ˇమైన అన్ని రకాల సౌకర్యాలు ఉన్నాయని ఆ లేఖలో సీఎం రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. గచ్చిబౌలిలోని స్పోర్ట్స్ కాంప్లెక్సుల అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్, సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్, హాకీ టర్ఫ్, షూటింగ్ రేంజ్, సరూర్‌నగర్‌లో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం (ఎయిర్ కండిషన్డ్), సింథటిక్ టెన్నిస్ కోర్ట్, స్కేటింగ్ ట్రాక్, ఔట్ డోర్ స్టేడియం, ఎల్బీ స్టేడియంలో ఇండోర్ స్టేడియంతో పాటు టెన్నక్ కాంప్లెక్స్, ఫుట్ బాల్ గ్రౌండ్, కేవీబీఆర్ ఇండోర్ స్టేడియం, హుస్సేన్ సాగర్‌లో వాటర్ స్పోర్ట్స్ నిర్వహించే సౌకర్యం, ఉస్మానియా క్యాంపస్‌లో సైక్లింగ్ వెల్‌డ్రోమ్, సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్, స్విమ్మింగ్ పూల్, స్కేటింగ్ ట్రాక్, జింఖానా-2 గ్రౌండ్‌లో ఫుట్ బాల్ గ్రౌండ్‌తో పాటు ఔట్ డోర్ గేమ్స్ నిర్వహించే వసతులు ఉన్నాయని ఆ లేఖలో సీఎం రేవంత్




గుర్తుచేశారు. క్రీడాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం తగిన ప్రాధాన్యత ఇస్తూ ప్రతి ఏటా ఖేలో ఇండియా యూత్ గేమ్స్, వింటర్ గేమ్స్, పారా గేమ్స్, యూనివర్శిటీ గేమ్స్ తదితరాలను 2018 నుంచి క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నదని సీఎం రేవంత్ గుర్తుచేశారు. గతేడాదితో పోలిస్తే ఈసారి బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం పది రెట్ల మేర క్రీడల కోసం కేటాయింపులను పెంచినట్లు సీఎం రేవంత్ గుర్తుచేశారు. కేవలం క్రీడల నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాలు మాత్రమే కాకుండా క్రీడాకారులు చేరుకునేలా రైలు, విమాన సౌకర్యాలు కూడా ఉన్నాయని, పేరెన్నికగన్న స్టార్ హోటళ్ళు, ఇతర వసతి సౌకర్యాలు కూడా ఉన్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వడం మాత్రమే కాకుండా యువతను ప్రోత్సహించేలా ప్రత్యేక పాలసీని కూడా రూపొందిస్తున్నదని, ఆ శాఖను స్వయంగా ముఖ్యమంత్రే నిర్వహిస్తున్నట్లు కూడా ఆ లేఖలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ విజ్ఞప్తిని కేంద్ర మంత్రికి వివరించిన రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి జితేందర్ రెడ్డి?. అంతర్జాతీయ స్థాయిలో మన దేశానికి క్రీడారంగంలో గుర్తింపు, పేరు ప్రఖ్యాతులు వచ్చేలా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు కలిసి పనిచేయాల్సిన అవసరాన్ని వివరించారు. క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నందుకు కేంద్ర మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ ఒక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత ఆర్థికంగా మాత్రమే కాక అనేక రంగాల్లో ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ప్రత్యేక గుర్తింపు సాధించిందని, ఇకపైన క్రీడా పోటీల నిర్వహణతో పాటు భవిష్యత్తులో ఉత్తమ క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన అవగాహనతో ఉన్నదని జితేందర్ రెడ్డి గుర్తుచేశారు.

## డివైడర్ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు.. ప్రయాణికులకు గాయాలు

సంగారెడ్డి సంగారెడ్డి - జోగిపేట మండలం నేరడి కుంట శివారులో నేషనల్ హైవేపై ఆర్టీసీ బస్సు అదుపుతప్పి రోడ్డుపై డివైడర్ను ఢీకొట్టడంతో పలువురు గాయపడ్డారు. నారాయణఖేడ్ నుంచి హైదరాబాదుకు 45 మందితో ఆర్టీసీ బస్సు వెళ్తున్న క్రమంలో బస్సు అదుపుతప్పి రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్ను ఢీకొట్టగా పెను ప్రమాదం తప్పిందని తెపారు.

## అమెరికా కాల్పుల్లో ఖమ్మం యువకుడి మృతి బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్సీ తాతా మధు



ఖమ్మం అమెరికాలో నల్ల జాతీయుల కాల్పుల్లో మృతి చెందిన నూకారపు సాయి తేజ కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ తాతా మధు శనివారం పరామర్శించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి ఓదార్చారు. ఆయన వెంట ఖమ్మం రూరల్ బీఆర్ఎస్ నాయకులు బెల్లం వేణు,నాయకులు తదితరులున్నారు

## అమెరికా కాల్పుల్లో ఖమ్మం యువకుడు మృతి



ఖమ్మం ఖమ్మం నగరానికి చెందిన యువకుడు సాయి తేజ ను అమెరికా లో నల్ల జాతీయులు కాల్చి చంపారు. మృతుడు నాలుగు నెలల క్రితం అమెరికా లో చదువుకునేందుకు వెళ్లాడు. నూకారపు కోటేశ్వర రావు దంపతులకు ఇద్దరు సంతానం కాక అమ్మాయి అబ్బాయి ఇద్దరు కూడా అమెరికాలో ఉంటారు. ఓ స్టోర్ లో క్యాష్ కౌంటర్ దగ్గర పార్ట్ టైం జాబ్ చేస్తున్న సాయి తేజ ని కొందరు దుండగులు వచ్చి డబ్బులు అడగగా ఇచ్చిన కూడా కాల్చి చంపి వెళ్లారని తల్లీదండ్రులు కన్నీరు పెట్టుకున్నారు.

# గురుకుల పాఠశాలలను సందర్శించిన బిజెపి నేత అందేలా శ్రీరాములు యాదవ్

మహేశ్వరం: మహేశ్వరం నియోజకవర్గం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ లో ఉన్నటువంటి కందుకూరు మండల గురుకుల పాఠశాలను బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మహేశ్వరం నియోజకవర్గ ఇన్చార్జ్ అందెల శ్రీరాములు యాదవ్ సందర్శించారు. అనంతరం అక్కడి పరిస్థితులను తెలుసుకున్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ తో మాట్లాడి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు . అనంతరం శ్రీరాములు మాట్లాడుతూ గురుకుల పాఠశాలలో కనీస మౌలిక వసతులు లేక విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. నిత్యం ఏదో ఒక గురుకుల పాఠశాలలో కలుషిత ఆహారంతో కొందరు, అనారోగ్యంతో ఇంకొందరు, అలాగే ఆత్మహత్యకు పాల్పడుతూ మరణిస్తున్నారని ఆయన ఆ రోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన సంవత్సర కాలంలో 51 విద్యార్థులను పొట్టన పెట్టుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, గురుకులాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా సమీక్షించాలి అని డిమాండ్ చేశారు. క్షేత్రస్థాయిలో నెలకొన్న సమస్యలను తెలుసుకొని తక్షణమే పరిష్కరించాలనీ, ప్రతి గురుకులాలలో మంచినీటి సరఫరా , స్నానపు గదులు, మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచేలా చూడాలన్నారు. జిల్లాలో ఉన్నటువంటి అన్ని గురుకుల పాఠశాలలకు జిల్లా కలెక్టర్ స్థానికంగా ఉన్నటువంటి నాయకులతో కలిసి ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని శ్రీరాములు కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక బిజెపి నేతలు పాల్గొన్నారు.

# బాపట్ల జిల్లాలో కాలేజి బస్సుకు మంటలు

బాపట్ల చెరుకుపల్లి మండలం గూడవల్లి వద్ద శనివారం ఉదయం షార్ట్ సర్క్యూట్ కారణంగా ఓ కాలేజి బస్సులో మంటలు చెలరేగాయి. దీంతో నర్సింగ్ కాలేజీ బస్సు పూర్తిగా దగ్ధమైంది. ఘటన సమయంలో బస్సులో 30 మంది విద్యార్థులు ఉండగా.. బస్సుకు మంటలు అంటుకోగానే వెంటనే కిందకు దిగడంతో పెద్ద ప్రమాదం తప్పింది. రేపల్లె నుంచి గుంటూరుకు విద్యార్థులు పరీక్షల రాసేందుకు వె ళ్తుండగా ప్రమాదం జరిగింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# మార్నింగ్ వాక్ చేస్తూ వాహనం ఢీ వ్యక్తి మృతి

రాజన్న సిరిసిల్ల గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టడంతో తంగళ్ళపల్లి మండలం పద్మనగర్ కు చెందిన నాగిషెట్టి ప్రసాద్ (35) మృతి చెందాడు. మార్నింగ్ వాకింగ్ లో ఉండగా గుర్తు తెలియని కార్ ఢీకొట్టడంతో అక్కడే స్పృహ తప్పి పడిపోయాడు. స్థానికులు సిపిఆర్ చేసి ఆసుపత్రి తరలించారు. మార్నింగ్ వాకింగ్ చేస్తూ 15 నిమిషాల ముందు ప్రసాద్ సెల్ఫీ వీడియో పోస్ట్ చేసాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.

# ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ యువతిని కాపాడిన పోలీసులు

తిరుమల ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతున్న మహిళ ప్రాణాలను పోలీసులు కాపాడారు. తన సోదరి ఆత్మహత్యాయత్నం చేసుకుంటు ఉంది అని బెంగళూర్ నుండి తిరుపతి పోలీస్ కంట్రోల్ రూమ్ కు వాట్సప్ ద్వారా ఫిర్యాదు వచ్చింది. సకాలంలో పోలీసుల బృందం స్పందించి టీటీడి విజిలెన్స్ సహాయంతో సత్వర చర్యలు తీసుకోవడంతో ప్రాణనష్టం తప్పింది. తక్షణ స్పందనతో నిండు ప్రాణాలు కాపాడి ప్రాణం పోసారు. కుటుంబ వ్యక్తిగత కారణాలతో మహిళ ఆత్మహత్యాయత్నం చేనసినట్లు సమాచారం. ఫోన్ నెంబర్ ఆధారంగా లొకేషన్ గుర్తించి, టీటీడి విజిలెన్స్ వారి సహకారంతో మెట్టు మార్గంలో గుర్తించి కాపాడారు.

# సెప్టిక్ ట్యాంక్ వాహనదారుల అందోళన

ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట సెప్టిక్ ట్యాంక్ క్లీనర్స్ వాహనదారులు ఆందోళనకు దిగారు. ఎస్ ఎఫ్ టి క్లీనింగ్ ప్లాంట్ పనిచేయకపోవడం వల్ల సెప్టిక్ ట్యాంక్ వ్యర్థాలను తరలించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేసారు. మూడు నెలల క్రితం వచ్చిన వరదల వల్ల ఎస్ ఎఫ్ టి ప్లాంట్ మునిగి పోయిందని అధికారులు దృష్టికి ఎన్నిసార్లు తీసుకుపోయిన పట్టించుకోవడంలేదని ఆరోపించారు. తక్షణమే తమ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట సెప్టిక్ ట్యాంకుల క్లీనింగ్ వాహనాలను పెట్టి నిరసన ప్రకటించారు

## ఎంపి అవినాష్ రెడ్డి అనుచరుల ఆధీనంలోని కార్లు స్వాధీనం

సంగారెడ్డి ఎంపి అవినాష్ రెడ్డి అనుచరుల ఆధీనంలో ఉన్న కార్లను సంగారెడ్డి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాటిని సంగారెడ్డి పోలీస్ స్టేషన్ కు తరలించారు. 2020లో సంగారెడ్డి లోని హరిహర ట్రావెల్స్ యజమాని సతీష్ వద్ద ఆరు కార్లను వికారాబాద్కు చెందిన మణిరాజ్ అద్దెకు తీసుకున్నాడు. కొంతకాలం తర్వాత మణిరాజ్ తన ఫోన్ స్విచ్ ఆఫ్ చేసుకున్నాడు. ఈ ఆరు కార్లు పులివెందులలో ప్రత్యక్షం అయ్యాయి. ఎంపీ అవినాష్ రెడ్డి అనుచరులు ఈ కార్లను వాడుతున్నారు. మూడు సంవత్సరాల క్రితం సంగారెడ్డి పోలీస్ స్టేషన్లో కార్ల అదృశ్యంపై సతీష్ ఫిర్యాదు చేసాడు. మూడు సంవత్సరాలుగా సమస్య కొలిక్కిరాలేదు. చివరకు సతీష్ తనకు న్యాయం చేయాలంటూ ఏపీ ప్రభుత్వానికి మొరపెట్టుకున్నాడు. స్పందించిన ఎపి ప్రభుత్వం పులివెందుల పోలీసుల ద్వారా సంగారెడ్డి పోలీసులకు కార్లను అప్పగించింది. శుక్రవారం రాత్రి ఆరు కార్లను స్వాధీనం చేసుకుని సంగారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్కు కార్లను తరలించారు.

## పెద్ద పులి దాడిలో యువకుడికి తీవ్ర గాయాలు



కొమురం భీం కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ టీ) మండలం దుబ్బగూడా గ్రామ సమీపంలో పత్తి చేనులో పత్తి ఏరుతుండగా అదే గ్రామానికి చెందిన రౌతు సురేష్ అనే యువకునిపై పెద్దపులి దాడి చేసింది. ఘటనలో సురేష్ కు తీవ్ర గాయాలు అయ్యాయి. అతడిని సిర్పూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## విద్యార్థినిలపై టీచర్ లైంగిక వేధింపులు బంధువుల అందోలన

నల్గోండ నల్లగొండ జిల్లా నిడమనూరు మోడల్ స్కూల్ లో దారుణం జరిగింది. విద్యార్థినిలపై సోషల్ టీచర్ ఆంజనేయులు లైంగిక వేధింపుల భాగోతం బయటపడింది. తనతో అసభ్యంగా ప్రవర్తించాడని ఏడవ తరగతి విద్యార్థిని ప్రిన్సిపాల్ కు ఫిర్యాదు చేసింది. విషయం తెలిసి స్కూల్ ముందు విద్యార్థినిల తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు.

## రహదారి భద్రతపై శ్రీ నలంద విద్యార్థుల మెగా ర్యాలీ

మహబూబాబాద్ జిల్లా తొర్రూరు నవంబర్ 30 తొర్రలు పట్టణంలో శ్రీ నలంద పాఠశాల విద్యార్థులు స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాంలో భాగంగా సేఫ్ ఇండియా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక ట్రాఫిక్ ఎస్ఐ రాంజీ నాయక్ పాల్గొని రోడ్డు భద్రత మరియు ట్రాఫిక్ నియమ నిబంధన గురించి విద్యార్థులతో కలసి పట్టణ ప్రజలకు అవగాహన కల్పించారు , పాఠశాల ప్రిన్సిపాల్ రవీందర్ మాట్లాడుతూ ప్రతి వానాదారుడు విధిగా హెల్మెట్ , సీట్ బెల్ట్ ధరించి పరిమితి వేగంతో డ్రైవింగ్ చేయడం అనేది తప్పనిసరి అని తెలిపారు , మద్యం సేవించి వాహనాలు నడపకూడదు, పాదాచారులకు దారి ఇవ్వడం, ట్రాఫిక్ సిగ్నల్స్ సంకేతాల గుర్తించడం వంటి నియమాలను తెలిపారు , హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపిన వారికి పుష్పగుచ్చాలు అందజేసి ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు

ఇట్టి కార్యక్రమంలో ఏఎస్ఐ తారాచంద్ , హేమ , పాఠశాల చైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, చేతన్ , పద్మాకర్, డీన్ యాకన్న , ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు

# చొప్పదండి లో బిఆర్ఎస్ హాస్టల్ బాట, నేతల అరెస్టులు

కరీంనగర్ చొప్పదండి లో బిఆర్ఎస్ హాస్టల్ బాట నిర్వహించింది. శనివారం ఉదయం గురుకుల పాఠశాలల సమస్యల తెలుసుకునేందుకు మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ బయలు దేరారు. పోలీసులు ఇద్దరిని అరెస్టు చేసారు. సుంకె రవిశంకర్ ను హౌస్ అరెస్టు చేసారు. కొప్పుల ఈశ్వర్ ను అదుపులోకి తీసుకొని ఇంటికి తరలించారు.

# సంక్షేమ పథకాల అమలులో వేగం
# పెంచిన కూటమి ప్రభుత్వం

***ఎన్టీఆర్ భరోసా ఫించన్లను ఎలాంటి జాప్యం లేకుండా లబ్ధి పొందేలా చర్యలు***
***వితంతువులకు .. 15 రోజుల్లోనే పింఛను లబ్ధి***
***ఏపీలో 63.92 లక్షల మందికి రూ.2709 కోట్ల ఎన్టీఆర్ భరోసా పింఛన్లు***
***పేదల సంక్షేమానికే కూటమి ప్రభుత్వం పెద్దపీట***
***టీడీపీ నేత, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వర రావు***



గొల్లపూడి ఎన్ని ఇబ్బందులు, కష్టాలు ఎదురైనా సీఎం చంద్రబాబు క్రమం తప్పకుండా ఫించన్లు అందిజేస్తున్నారని టీడీపీ నేత, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వర రావు తెలిపారు. పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని అన్నారు. డిసెంబర్ నెల ఒకటో తేదీ ఆదివారం కావడంతో సామాజిక పింఛన్లు ఒకరోజు ముందుగానే అంటే...ఈనెల 30వ తేదీనే పంపిణీ చేస్తున్నట్లు ఇందుకు సంబంధించి పింఛన్దారుల జాబితాతోపాటు సొమ్ములు విడుదల చేయడం జరిగిందని పేర్కొన్నారు. శనివారం ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి పంచాయితీ పైపులరోడ్డులో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# చొప్పదండిలో తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో అడ్మీషన్ లు ప్రారంభం
## మండల కోఆర్డినేటర్ భక్తు విజయ్ కుమార్



చొప్పదండి తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే కరీంనగర్ జిల్లా చొప్పదండి మండల కేంద్రంలో అధ్యయన కేంద్రం ఎక్స్ లెంట్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ లో స్పెషల్ అడ్మిసన్స్ డ్రైవ్ జరుగుతున్నాయని చొప్పదండి మండల కో ఆర్డినేటర్ భక్తు విజయ్ కుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.టీవోఎస్ఎస్, ఎస్ఎస్సి తెలుగు,ఇంగ్లీష్, ఉర్దూ మీడియంలో అయిదు సబ్జక్టులు మాత్రమే ఉంటాయని తెలిపారు. టీవోఎస్ఎస్ ఇంటర్ ఒకే సంవత్సరంలో సీఈసి,హెచ్ ఈ సి,ఎమ్ ఈ సి తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ మీడియంలో అయిదు సబ్జక్టులు మాత్రమే ఉంటాయని తెలిపారు.ఓపెన్ పదవ తరగతి ఓపెన్ ఇంటర్ అడ్మిషన్స్ కి చివరి తేదీ నవంబర్ డిసెంబర్ 11-2024 ఉందని తెలిపారు.పదవ తరగతి, ఇంటర్ చదవలేకపోయామని బాధపడుతున్న వారికీ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా ఓపెన్ టెన్త్, ఓపెన్ ఇంటర్ ప్రవేశల కోసం 11-12-2024 వరకు జరుగుచున్నాయని తెలిపారు.ఈ సర్టిఫికెట్ పై చదువులకు, ప్రమోషన్స్ కి అర్హులు.

చదువుకునే వారికీ సువర్ణ అవకాశం కల్పించబడిందని తెలిపారు.పదవ తరగతికి 1.ఫోటో, ఆధార్ కార్డు,ఒరిజినల్ టీసి,క్యాస్ట్, సెల్ నంబర్, 2.ఇంటర్ కి ఫోటో, ఆధార్, పదవ తరగతి మెమో, క్యాస్ట్, సెల్ నెంబర్ కావాలని తెలిపారు.పూర్తి సమాచారం కోసం ఎక్స్ లెంట్ హై స్కూల్ 9848947288 ,9652608597 నంబర్ లను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కో ఆర్డినేటర్ భక్తు విజయ్ కుమార్ మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నట్లు తెలిపారు.

# కొమురం భీం జిల్లాలో హడలెత్తిస్తున్న పెద్దపులి

***నాలుగేళ్లలో నలుగురిని చంపిన పులి***
***శుక్రవారం పులి దాడిలో మరో మహిళ మృతి***
***నిత్యం పశువుల మందపై దాడులు***
***పలు ప్రాంతాల్లో వన్ ఫార్టీ ఫోర్ సెక్షన్***

ఆసిఫాబాద్, కొమరం భీమ్ జిల్లాలోనీ పలు మారుమూల అటవీ సమీప ప్రాంతాలలో గడిచిన నాలుగు సంవత్సరాల నుండి పెద్దపులి హడలెత్తిస్తుందని చెప్పవచ్చు. సదరు పెద్దపులి గడిచిన ఈ నాలుగేళ్ల కాలంలో నలుగురిని పొట్టన పెట్టుకున్నది.గత కొన్నిరోజులుగా పశువుల మందలపై దాడులు చేస్తున్న పులి.. శుక్రవారం ఉదయం ఓ యువతిని చంపేసింది. కాగజ్‌నగర్ మండలం గన్నారంలో ఉదయం 8.30 గంటల సమయంలో పత్తి ఏరుతున్న మోర్లె లక్ష్మిపై దాడి చేసింది. దీంతో ఆమె తీవ్రంగా గాయపడి మృతిచెందింది. ఈ నేపథ్యంలో అటవీ శాఖ అధికారులు అలర్ట్ అయ్యారు. దాడి జరిగిన ప్రాంతానికి దగ్గరలోనే పులి సంచరిస్తున్నట్లు నిర్ధరించారు. ఈ నేపథ్యంలో కాగజ్‌నగర్ మండలంలోని పలు గ్రామాల్లో ఆంక్షలు విధించారు. ఈజ్గామ్, నజ్రూల్ నగర్, సీతానగర్, అనుకోడా, గన్నారం, కడంబా, ఆరెగూడ, బాబూనగర్, చింతగూడ గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు. ఆయా గ్రామాల ప్రజలు పంట చేలకు, అటవీ ప్రాంతాలకు వెళ్లకుండా 144 సెక్షన్ విధించారు. దాడి చేసిన చోటుకే పులి మళ్లీ వచ్చే అవకాశం ఉందని, అటువైపు ఎవ్వరూ వెళ్లొద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. జిల్లాలోని అటవీ ప్రాంత గ్రామాల్లో సంచరిస్తున్న పులులు ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నాయి. నిత్యం ఎక్కడో చోట పశువుల మందలపై పంజా విసురుతూ దడ పుట్టిస్తున్నాయి. నాలుగేళ్ల క్రితం దహెగాం మండలం దిగడ గ్రామానికి చెందిన విగ్నేశ్‌ను, పెంచికల్‌పేట్ మండలం కొండపల్లి గ్రామానికి చెందిన పసుల నిర్మలను, గతేడాది వాంకిడి మండ లం ఖానాపూర్‌కు చెందిన రైతు సిడాం భీము ను పొట్టనబెట్టుకోగా, ఆ ఘటనలు మరవకముందే శు క్రవారం ఓ పులి మరో మహిళను బలి తీసుకున్నది.

**పత్తి ఏరుతుండగా దాడి..**

కాగజ్‌నగర్ మండలం గన్నారం గ్రామానికి చెందిన మోర్లె లక్ష్మి (22) .. శుక్రవారం మరో 20 మంది కూలీలతో కలిసి సమీపంలోని చేనులో పత్తి ఏరేందుకు వెళ్లింది. ఉదయం 8.30 గంటల ప్రాంతంలో అందరూ పనిలో నిమగ్నం కాగా.. పెద్ద పులి ఒక్కసారిగా మోర్లె లక్ష్మిపై దాడి చేసింది. కూలీలు కేకలు వేయడంతో అది అక్కడి నుంచి వెళ్లిపోయింది. లక్ష్మిని వెంటనే పట్టణంలోని ప్రైవేట్ దవాఖానకు తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

**ఇప్పటి వరకు నలుగురు**

జిల్లాలో పులుల దాడుల్లో ఇప్పటి వరకు నలుగురు మృతి చెందారు. 2020 నవంబర్ 11న దహెగాం మండలం దిగిడ గ్రామానికి చెందిన విగ్నేష్ చేపల వేటకు వెళ్లగా, పులి దాడి చేయడంతో మృతి చెందాడు. 2020 నవంబర్ 29న పెంచికల్‌పేట్ మండలం కొండపల్లి గ్రామానికి చెందిన పసుల నిర్మల (15) పత్తి ఏరుతుండగా, పెద్ద పులి దాడిచేసి చంపేసింది. అలాగే 2023 నవంబర్ 16న వాంకిడి మండలం ఖానాపూర్‌కు చెందిన రైతు సిడాం భీము తన చేనులో పత్తి ఏరుతుండగా పులి పంజా విసరడంతో మృత్యువాత పడ్డాడు. తాజాగా.. శు క్రవారం గన్నారంలో పత్తి ఏరుతున్న మహిళపై పులి దాడి చేసి చంపడం స్థానికంగా కలకలం రేపుతున్నది. కాగా, ఉమ్మడి జిల్లాలో పులుల దాడుల దడపుట్టిస్తున్నాయి. ఈ ఏడాది దాదాపు 40 వరకు పశువులపై దాడులు చేశాయి. ఎప్పుడు ఏ వైపు నుంచి వచ్చి దాడులు చేస్తాయోనని ప్రజలు వణికిపోతున్నారు. దీంతో పలువురు రైతులు తమ పంట పొలాల వైపు వెళ్లాలంటేనే హడలెత్తిపోతున్నారు.

# వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే గండ్ర

జయశంకర్ భూపాలపల్లి, భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని వేశాలపల్లి, పెద్దకుంటపల్లి, కాశింపల్లి, జంగేడు తో పాటు భూపాలపల్లి గ్రామీణ మండలం గుడాడుపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు ప్రారంభించారు. అనంతరం ఆయా గ్రామాలల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ? రైతు సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని, రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలల్లో విక్రయించాలని రైతులకు సూచించారు. ధాన్యం తూకం విషయంలో రైతులను మోసం చేస్తే ఊరుకునేది లేదని ఈ సందర్భంగా ఎమ్మెల్యే అన్నారు.

# పరిపాలనను గాలికొదిలేసిన ప్రభుత్వం

***ప్రతిపక్షాలపై దాడులకే ప్రాముఖ్యత ఇస్తుండ్లు***
***రేవంత్ సర్కార్‌లో గురుకులాలపై నమ్మకం సన్నగిల్లుతోంది***
***పేద బిడ్డలు చదువుకునే పాఠశాలలను బలోపేతం చేయాలి***
***మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్***



మంథని రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పరిపాలనను గాలికి వదిలేసిందని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గారి పిలుపు మేరకు శనివారం ముత్తారం మండలంలోని కస్తూర్బా పాఠశాలను ఆయన సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కస్తూర్బా పాఠశాలలో కొన్ని సమస్యలు పరిష్కారం అయినా మరికొన్ని సమస్యలు ఉన్నాయన్నారు. ప్రస్తుతం ఒక విద్యార్థి అస్వస్థతకు గురై ఉందని, ఆమె ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నామన్నారు. రాష్ట్రంలో రేవంత్ ప్రభుత్వం పరిపాలనను మరిచి ప్రతిపక్షాలపై దాడులకు ప్రాముఖ్యత ఇస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు. రాష్ట్రాన్ని ఏ విధంగా ముందుకు తీసుకెళ్తారో ఏడాదైన ఒక విధానం చెప్పడం లేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో గురుకులాలు, మోడల్ స్కూల్‌లలో విద్యార్థులను చేర్చిందుకు రికమండేషన్‌లు ఉండేవని, కానీ ఈనాడు రేవంత్ సర్కార్‌లో గురుకులాలు, మోడల్ స్కూల్‌లపై నమ్మకం సన్నగిల్లుతోందని, గురుకుల పాఠశాలల నుంచి విద్యార్థులకు వెళ్లిపోయే పరిస్థితులు ఏర్పడ్డాయని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం గురుకుల పాఠశాలలు,మోడల్ స్కూల్‌ల్లో అన్ని వసతులు కల్పించి బలోపేతం చేసే దిశగా అన్ని చర్యలు తీసుకోవడం జరిగిందని, ప్రస్తుతం మోడల్ స్కూల్స్‌లో వంట గదులు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు. అట్టడుగు వర్గాలకు చెందిన పేదింటి విద్యార్థులు చదువుకునే గురుకులాలు, మోడల్ స్కూల్‌ల బలోపేతం చేయాలని, మంచి వాతావరణం, నాణ్యమైన బోజనం అందించేలా సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

# గురుకులలా సందర్శనకు బయలు దేరిన చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అరెస్ట్

***ఎందుకు అరెస్టు చేస్తున్నారో తెలుపాలని పోలీస్ లను నిలదీసిన సుంకె***



చొప్పదండి కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గంలోని వివిధ గురుకుల పాఠశాలలో వసతులు విద్యార్థుల సమస్యలు తెలుసుకోవడానికి చొప్పదండి నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ తన కారులో శనివారం బయలు దేరాడు. విషయం తెలుసుకున్న పోలీసులు మార్గమధ్యంలో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ను అరెస్ట్ చేసి రామడుగు మండల పోలీస్ స్టేషన్ కు తీసుకొని వెళ్ళారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ మాట్లాడుతూ

బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు

గురుకుల బాట కార్యక్రమంలో భాగంగా గురుకులాలు, కేజీబీవీలు, మోడల్ స్కూల్స్, ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలు, కాలేజీలను పరిశీలించేందుకు బయలు దేరగా పోలీసులు చేసిన అక్రమ అరెస్టును ఖండిస్తున్నట్లు తెలిపారు.గురుకుల, పాఠశాల విద్యను రేవంత్ సర్కార్ సంక్షోభంలోకి నెట్టిందని అయిన విమర్శించారు.11 నెలల్లో 52 మంది విద్యార్థులు మరణించారని?ఇందులో 38 ఫుడ్ పాయిజన్ సంఘటనలు జరిగాయని తెలిపారు. పాలన గాలికొదిలేసి నేరపూరిత నిర్లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులను పొట్టన బెట్టుకుంటోందని ఆరోపించారు. రాష్ట్రానికి విద్యాశాఖ మంత్రి లేరని? ముఖ్యమంత్రికి ఢిల్లీకి తిరిగేందుకే సమయం సరిపోతలేదని సుంకె రవిశంకర్ దుయ్యబట్టారు. విద్యార్థులు చనిపోతున్నా ఒక్క సమీక్ష కూడా నిర్వహించని ప్రభుత్వానికి ఉసురు తప్పదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందు అన్ని రకాల గురుకుల విద్యాసంస్థలు కలిపి 291 ఉంటే వాటిల్లో కేవలం 1లక్ష 54 వేల మంది చెదివేవారున్నారని

కేసీఆర్ ప్రభుత్వ పాలనలో స్వరాష్ట్రంలో 1022 గురుకులం ఏర్పాటు చేసుకుని 6 లక్షల10 వేల 810 మంది విద్యార్థులకు అన్ని సౌకర్యాలతో కూడిన నాణ్యమైన విద్య, భోజనం అందిచడం జరిగిందని తెలిపారు. అంతే కాకుండా అన్ని గురుకులాలను కళాశాలలుగా అప్ గ్రేడ్ చేసుకొని,కేవలం గిరిజన గురుకులాలు గతంలో 91 మాత్రమే ఉంటే అదనంగా మరో 97 గురుకులను ఏర్పాటు చేసుకుని 91,370 మంది విద్యార్థులకు నాణ్యమైన విద్యావిధానం, ఇంగ్లిష్ మీడియంలో బోధన, సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం, పౌష్టికాహారం వంటి విద్యాభివృద్ధి పథకాలను రాష్ట్ర ప్రభుత్వం సమర్థంగా అమలు చేసింది అని చెప్పారు. రాష్ట్రంలోని ప్రైవేటు విద్యాసంస్థల నుంచి ప్రభుత్వ విద్యా సంస్థలకు విద్యార్థుల వలసలు పెరుగాయని . గురుకులాల్లో సీట్ల పొందడం కోసం విద్యార్థులు పోటీ పడేవారని పేర్కొన్నారు.ఎలా ఉండే విద్యావ్యవస్థ ఎలా తయారు అయిందని ప్రభుత్వాన్ని విమర్శలు గుప్పించారు.

# ఆహార నాన్యాతపై కమిటీలు
## జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ.

జయశంకర్ భూపాలపల్లి, సంక్షేమ వసతి గృహాలు, విద్యాసంస్థలు, ప్రభుత్వ పాఠశాలల్లో ఆహార భద్రతా, నాణ్యతా ప్రమాణాలు తనిఖీ కోసం జిల్లా, మండల స్థాయి కమిటీలను ఏర్పాటు చేస్తూ జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి, గిరిజన, బీసీ, మైనారిటీ సంక్షేమ, మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ, పాఠశాల విద్య నియంత్రణలో వివిధ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలలు, ఆసుపత్రులు, అంగన్‌వాడీ కేంద్రాలలో ఆహార నాణ్యతలను నిర్ధారించడానికి టాస్క్ ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కమిటి జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ వెల్ఫేర్ విద్యాసంస్థలు, అంగన్‌వాడీలు, ఆసుపత్రులు మరియు ప్రభుత్వం ఆహారం అందించే ఇతర ప్రదేశాలలో ఆహార భద్రత కోసం జిల్లా స్థాయి కమిటీలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్,

రెవెన్యూ డివిజనల్ అధికారి,

జిల్లా పౌర సరఫరాల అధికారి,

జిల్లా వ్యవసాయ అధికారి,

ఎస్సి, ఎస్టీ, బిసి, మైనారిటీసంక్షేమ శాఖల అధికారులు, ఫుడ్ ఇన్స్పెక్టర్ తో జిల్లా స్థాయి కమిటి ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

అలాగే కాటారం రెవెన్యూ డివిజన్ కు సంబంధించి రెవెన్యూ

అదనపు కలెక్టర్ అధ్యక్షతన పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్,

జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి,

జిల్లా సహకార అధికారి

జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి,

ఫుడ్ ఇన్స్పెక్టర్ తో కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

మండల స్థాయి కమిటీ కూడా క ఏర్పాటు చేయబడింది. ఈ కమిటీలో మండల ప్రత్యేక అధికారి చైర్మన్ గా ఉంటారని

ఎంపీడీఓ, తహసిల్దార్,

మండల విద్యాశాఖాధికారి ఉంటారని తెలిపారు.

ఈ జిల్లా, మండల కమిటీలు ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విద్యా సంస్థలు, ఆసుపత్రుల్లో ఆహారం అందిస్తున్న అన్ని ప్రభుత్వ సంస్థలలో తనిఖీ చేసి, తనిఖీ నివేదికను సమర్పించాలని ఆదేశించారు.

అంశాలు::-

బియ్యం, నిత్యావసర వస్తువులు నిల్వలు, వంటగది వద్ద పరిశుభ్రత ప్రమాణాలు, ఆహార నాణ్యతలు పరీక్షలు,

వంట చేయు సమయంలో ఆహార భద్రతా చర్యలు పాటింపు,

వంట చేసే ప్రదేశాన్ని పరిశుభ్రంగా ఉంచడం, వంట పాత్రలు, పరికరాలు, ఇతర వస్తువులను ఎప్పటికప్పుడు శుభ్రపరచడం,

కుక్, హెల్పర్స్ మరియు ఇతర సిబ్బంది వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం మరియు ఆరోగ్య పరీక్షలు, పెస్ట్ కంట్రోల్, ఫుడ్ సర్వింగ్ ఏరియా, పిల్లలు హ్యాండ్ వాష్ వ్యక్తి గత పరిశుభ్రత పాటించుట, సురక్షిత మంచినీటి సరఫరా, డ్రైనేజీలో వ్యర్థాలు నిల్వ లేకుండా పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహణ, వ్యర్థాలు తొలగింపు వంటి కార్యక్రమాలు కమిటీలు కేటాయించిన పరిధిలోని సంస్థలను తనిఖీ చేసి నివేదికలను సమర్పించాలని స్పష్టం చేశారు. ఆహార భద్రతా కమిటీలు చేసిన తనిఖీలు, తీసుకున్న చర్యలపై నివేదికలు అందచేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పేర్కొన్నారు.

# సెకితో సౌర విద్యుత్ ఒప్పందం నష్టదాయకం

అదాని గ్రూపుకు చెందిన రాజస్థాన్‌లోని ప్రాజెక్టుల నుండి ఏడాదికి 7000 మెగావాట్ల (17,000 మిలియన్ యూనిట్లకు మించకుండా) సౌర విద్యుత్ కొనుగోలుకు వైఎస్ఆర్‌సిపి ప్రభుత్వ ఆదేశం మేరకు రాష్ట్ర విద్యుత్ పంపిణీ కంపెనీలు భారత సౌర విద్యుత్ సంస్థ (సెకి)తో చేసుకున్న 25 ఏళ్ళ ఒప్పందం (పవర్ సప్లై అగ్రిమెంట్ పిఎస్ఎ) అనేక విధాలుగా నష్టదాయకమైనది. మోడి ప్రభుత్వ ఆశ్రిత పెట్టుబడిదారీ విధానంలో భాగంగా, మధ్య దళారిగా సెకి టెండర్లలో పేర్కొంటున్న షరతులు తమకు కావలసిన పెట్టుబడిదారీ సంస్థలకు ఎంపిక చేయడానికి వీలుగా తొత్తడం చేస్తున్నది. సౌర విద్యుత్ పరికరాలను తయారు చేసే సామర్థ్యం ఉన్న (ఉత్పత్తి చేయకపోయినా) సంస్థలే ఎంపికయ్యేలా టెండరు షరతులను రూపొందించింది. దీనితో, అలాంటి సామర్థ్యం లేని సంస్థలు టెండర్లు వేయడానికి వీలు లేకుండా పోయింది. నిజమైన పోటీకి తావు లేకుండా పోయింది. తొలుత పేర్కొన్న రేటును అదాని గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ (ఎజిఈఎల్), అజూర్ పవర్ ఇండియా లిమిటెడ్ (ఎపిఐఎల్) యూనిట్‌కు రూ.2.93 నుంచి రూ.2.42కు తగ్గించాక, సెకి వాటిని ఎంపిక చేసింది. దీనికి తోడు మధ్య దళారిగా సెకికి యూనిట్‌కు ఏడు పైసలు చొప్పున కొనుగోలు సంస్థలు (ఎపి డిస్కాంలు) చెల్లించాలి. డిస్కాములే నిజమైన పోటీకి, అత్యధికంగా సంస్థలు పాల్గొనేందుకు వీలు కల్పించే షరతులతో నేరుగా టెండర్లు పిలిచి, అతి తక్కువ రేట్లను పేర్కొన్న సంస్థలను ఎంపిక చేస్తే పలు విధాలుగా ప్రయోజనకరంగా ఉండేది. సెకికి యూనిట్‌కు చెల్లించాల్సిన కమిషన్ 7 పైసలు చొప్పున భారీ మొత్తం ఆదా అయ్యేది. అంటే, ఏడాదికి రూ.119 కోట్ల చొప్పున 25 ఏళ్ళలో రూ.2975 కోట్ల మేరకు ఆదా అయ్యేది. సెకి పై రెండు సంస్థలను ఎంపిక చేసిన నాటికి పోటీ బిడ్డింగు ద్వారా తేలిన సౌర విద్యుత్ రేట్లు చాలా తక్కువగా ఉన్నాయి. యూనిట్‌కు రూ.1.99 వరకు ఆ రేట్లు తగ్గాయి. ఆ విధంగా చూస్తే, యూనిట్‌కు 50 పైసల చొప్పున (సెకి కమిషన్‌తో కలుపుకుని) 17000 మి.యూ కు ఏడాదికి రూ.850 కోట్ల చొప్పున 25 ఏళ్ళలో రూ.21,250 కోట్ల మేరకు డిస్కాంలకు కొనుగోలు వ్యయం తగ్గేది. పోటీ బిడ్డింగులో తేలిన తక్కువ చార్జీలను బట్టి ఈ మొత్తంలో కొంత మార్పు ఉండవచ్చు. ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ కమిషన్ (ఎపిఈఆర్‌సి) వివరాలను వెల్లడించకుండా, బహిరంగా విచారణ జరపకుండా ఇచ్చిన ఆమోదంతో, రాష్ట్ర ప్రభుత్వం, డిస్కాంలు సెకితో 2021 డిసెంబరు మొదటి తేదీన పిఎస్ఎ చేసుకున్నాయి. ఒకేసారి 7000 మె.వా సౌర విద్యుత్ కొనుగోలుకు ఒప్పందం చేసుకోవటం అసాధారణం. సెకితో తాము చేసుకున్న విద్యుత్ కొనుగోలు ఒప్పందం (పిపిఎ) ప్రపంచంలోనే అతి పెద్దది అని అదాని కంపెనీ 2021 డిసెంబరు 14న ప్రకటించింది. 2025 సెప్టెంబరు, 2026 సెప్టెంబరుల నుండి 3000 మె.వా చొప్పున, 2027 సెప్టెబరు నుండి మరో 1000 మె.వా. చొప్పున ఈ సౌర విద్యుత్ కొనుగోలుకు ఎపి డిస్కాంలు, రాష్ట్ర ప్రభుత్వం సెకితో పిపిఎ చేసుకున్నాయి. ఆ మేరకు సరఫరా ప్రారంభమయ్యే నాటికి అంత సౌర విద్యుత్ రాష్ట్రానికి అవసరం లేదు. అనేక సంవత్సరాలుగా మిగులు విద్యుత్‌ను బ్యాక్ డౌన్ చేయాలని (ఉత్పత్తి తగ్గించాలని) థర్మల్ విద్యుత్ ప్లాంట్లను ఆదేశించటం, అలా ఉత్పత్తి చేయని విద్యుత్‌కు స్థిర చార్జీలను చెల్లించటం, మరోపక్క పీక్ కొరతను తీర్చటానికి మార్కెట్లో చాలా అధిక ధరలకు స్వల్పకాలిక విద్యుత్ కొనుగోళ్ళు చేస్తున్న పరిస్థితులు కొనసాగుతున్నాయి. విద్యుత్ డిమాండు పెరుగుదల, విద్యుత్ లభ్యత, మిగులు, పీక్ సమయాలలో కొరత అంచనాల ప్రకారం చూస్తే వచ్చే మూడేళ్ళలో కూడా ఇలాంటి నష్టదాయక పరిస్థితి కొనసాగుతుందని స్పష్టం అవుతుంది. అంటే, అదాని సౌర విద్యుత్‌ను కొనేందుకు డిస్కాంలు ఏ మేరకు థర్మల్ విద్యుత్‌ను బ్యాక్ డౌన్ చేయాల్సి వస్తే ఆ మేరకు నివారించదగిన స్థిర చార్జీలను చెల్లించాల్సి వస్తుంది. అవన్నీ ఎఫ్‌పిపిసిఎ రూపంలో వినియోగదారులపై పడతాయి. ఉత్పత్తి సామర్థ్యాన్ని బ్యాక్ డౌన్ చేయాల్సిన మేరకు ఎపి జెన్‌కో, ఎపిపిడిసిఎల్ వంటి రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు, ఎన్‌టిపిసి వంటి కేంద్ర ప్రభుత్వ సంస్థలే సాంకేతికపరంగా, ఆర్థికంగా నష్టపోతాయి. ఏటేటా డిమాండు పెరుగుదల, విద్యుత్ లభ్యత, అదనంగా చేర్చాల్సిన విద్యుత్ సామర్థ్యాన్ని వాస్తవికంగా అంచనా వేసుకుని, హెచ్చుతగ్గులుండే డిమాండును తీర్చేందుకు సాంకేతికంగా సాధ్యమైన మేరకు విద్యుత్ మిశ్రమం (థర్మల్, జల విద్యుత్, పునరుత్పత్తి అయ్యే సౌర, పవన విద్యుత్ వంటి వాటి మిశ్రమం) సమ తూకంలో ఉండేటట్లు పిపిఎలు చేసుకోవాలి. దానివల్ల మిగులు విద్యుత్ సాధ్యమైనంత తక్కువగా ఉండేటట్లు చూసేందుకు వీలవుతుంది. వినియోగదారులపై భారాలు కూడా ఆ మేరకు తగ్గుతాయి. ఒకేసారి 7000 మె.వా. సౌర విద్యుత్‌కు పిఎస్ఎ చేసుకోవటం వల్ల అదనపు భారాలు పెరుగుతాయి. ప్రతి సంవత్సరం సౌర విద్యుత్ ఏ మేరకు అవసరమౌతుందో వాస్తవిక అంచనాలు వేసుకుని, ఆ మేరకు లభ్యమయ్యే విధంగా పిపిఎలు చేసుకుని అనవసర భారాలను నివారించుకునే అవకాశాలను సెకితో చేసుకున్న ఒప్పందం వల్ల డిస్కాములు కోల్పోయాయి.

# ప్రమాదంలో దేశ సమగ్రత

మణిపూర్‌లో కొనసాగుతున్న హింసలో తాజాగా మరో ఏడుగురు మృతి చెందడమే కాకుండా పరిస్థితి మరింత దిగజారింది. ఇటీవలి కాలంలో, కేంద్ర భద్రతా బలగాలు 11 మంది కుకీలను కాల్చి చంపినందుకు ప్రతీకారంగా జిరిబామ్ నుండి ఎనిమిది నెలల వయసున్న చిన్నారులు, రెండున్నరేళ్ల పిల్లలతో సహా ఆరుగురు మెయితీలను అపహరించారు. పోలీసుల కాల్పుల్లో మరో మెయితీ యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. ఒకవైపు హత్యల పరంపర కొనసాగుతుండగానే మంత్రులు, రాజకీయ పార్టీల నేతల ఇళ్లు, కార్యాలయాలు తగలబడుతున్నాయి. మణిపూర్ ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ కుటుంబ సభ్యుల నివాసంపైనా దాడి జరిగింది. క్యాబినెట్ మంత్రులు తొంగం బిశ్వజిత్, గోబిందాస్ ఇళ్లకు నిప్పుపెట్టారు. తొమ్మిది మంది బిజెపి ఎమ్మెల్యేలు, ఒక కాంగ్రెస్ ఎమ్మెల్యే సహా 14 మంది ఎమ్మెల్యేల ఇళ్లపై దాడి జరిగింది. ఇంఫాల్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి బీరెన్ సింగ్‌ల బిల్‌బోర్డ్‌లను కూడా మూకలు ధ్వంసం చేశాయి. జిరిబామ్‌లో సి.ఆర్.పి.ఎఫ్ కాల్పుల్లో 11 మంది కుకీలు మరణించిన విషయాన్ని పోలీసులు దాచిపెట్టాలని చూశారు. కానీ పోస్టుమార్టం నివేదిక వాస్తవాన్ని బట్టబయలు చేసింది. రాష్ట్రంలో దాడులు, కాల్పులు నిరంతరం జరుగుతుండటంతో రాజకీయ వాతావరణం కూడా శరవేగంగా దిగజారిపోతోంది. మెయితీ నాయకుడిలా పూర్తిగా పక్షపాత ధోరణిలో వ్యవహరిస్తున్న ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ పట్ల మిత్రపక్షాలు, సొంత ఎమ్మెల్యేలు సైతం విశ్వాసం కోల్పోయే పరిస్థితి నెలకొంది. బిజెపి తర్వాత ఫ్రంట్‌లో అతి పెద్ద భాగస్వామిగా వున్న 'నేషనల్ పీపుల్స్ పార్టీ' ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకుంది. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపిస్తూ%ొ% ఏడుగురు ఎమ్మెల్యేలతో కూడిన ఎన్‌పిపి తన మద్దతు ఉపసంహరించుకుంది. ప్రభుత్వానికి ముప్పు లేకపోయినప్పటికీ బీరేన్ సింగ్ ప్రభుత్వానికి ప్రజల్లో ఆదరణ రోజురోజుకు తగ్గుతోందని తెలుస్తోంది. ఇద్దరు ఎమ్మెల్యేలు వున్న 'కుకీ పీపుల్స్ ఫ్రంట్' మద్దతు ఉపసంహరించుకున్న ఏడాది తర్వాత మరో పార్టీ కూడా అదే బాటలో నడిచింది. ఇదిలా వుండగా ఎన్‌పిపి నేత, మేఘాలయ ముఖ్యమంత్రి కాన్రాడ్ సంగ్మా మణిపూర్ ముఖ్యమంత్రిని మార్చాలని పట్టుబడుతున్నారు. మణిపూర్ ఘటనను ఈశాన్య రాష్ట్రాలు ఎలా చూస్తున్నాయనడానికిదొక ఉదాహరణగా చెప్పుకోవచ్చు. ప్రభుత్వం పూర్తిగా విఫలమైందంటూ జిరిబామ్ నియోజకవర్గ బిజెపి అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శితో సహా ఎనిమిది మంది రాజీనామా చేశారు. గత నెలలో స్పీకర్ సత్యవ్రత్ సింగ్, విద్యాశాఖ మంత్రి విశ్వజిత్ సింగ్ సహా 19 మంది బిజెపి ఎమ్మెల్యేలు బీరేన్ సింగ్‌ను మార్చాలని డిమాండ్ చేస్తూ ప్రధానికి లేఖ రాశారు. ఇంఫాల్‌లో సాధారణ పరిస్థితులు వున్నాయో లేవో నిర్ధారించుకోవడానికి మంగళవారం తన నివాసంలో ముఖ్యమంత్రి ఏర్పాటు చేసిన ఎన్‌డిఎ సమావేశం నుండి 11 మంది ఎమ్మెల్యేలు వాకౌట్ చేశారు. వీరిలో ఏడుగురు బిజెపికి చెందిన వారు. ఇదంతా చూస్తుంటే కేంద్ర ప్రభుత్వం, బిజెపి రక్షణగా ఉన్న బీరేన్ సింగ్ కు మద్దతు తగ్గుముఖం పడుతోందన్న విషయం స్పష్టమౌతోంది. ఇదిలా వుండగా గవర్నర్ నివేదిక కోసం ఎదురు చూడకుండా శాంతిభద్రతలు దిగజారడానికి కారణమైన బీరేన్ సింగ్ ప్రభుత్వాన్ని కేంద్రం రద్దు చేయాలని ప్రముఖ న్యాయవాది దుష్యంత్ దవే డిమాండ్ చేశారు. ('ది హిందూ' కథనం). కాబట్టి ముఖ్యమంత్రిని మార్చేందుకు కేంద్రం, బిజెపి సిద్ధంగా ఉండాలి. మణిపూర్ తగలబడిపోతున్నప్పుడు కూడా దాన్ని ఏమాత్రం సమస్యగా భావించని హోంమంత్రి అమిత్ షా మహారాష్ట్రలో ఎన్నికల ప్రచారం చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాల పర్యటనలో ఉన్నారు. అయితే పరిస్థితి విషమించడంతో అమిత్ షా ప్రచారానికి స్వస్తి చెప్పి ఢిల్లీకి హుటాహుటిన వెళ్లాల్సి వచ్చింది. అమిత్ షా రెండు రోజుల పాటు ఉన్నత స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేసి 50 కంపెనీల కేంద్ర పోలీసు బలగాలను మణిపూర్ పంపాలని నిర్ణయించారు. రాష్ట్రంలో సాధారణ పరిస్థితి నెలకొల్పాల్సిన అవసరం ఎంతైనా వుంది. ముందుగా ఈ విషయాన్ని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలియచేయాలి. అందుకు తక్షణమే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలి. సైనిక చర్యతో సమస్య పరిష్కారం కాదన్న విషయాన్ని మోడీ ప్రభుత్వం అర్థం చేసుకోవాలి. వివాదం ప్రారంభమై ఏడాదిన్నర గడిచినా ప్రధాని రాష్ట్ర పర్యటనకు రాకపోవడం నేరపూరిత నిర్లక్ష్యమే. వివిధ వర్గాల ప్రజలను విశ్వాసంలోకి తీసుకునే ప్రయత్నాలు వేగంగా ప్రారంభించాలి. కాశ్మీర్, పంజాబ్, బాబ్రీ మసీదు సమస్యలు తలెత్తినప్పుడు జాతీయ సమైక్యత కమిటీ ద్వారా సమస్యను పరిష్కరించేందుకు అప్పటి ప్రభుత్వాలు ప్రయత్నించాయి. అయితే మోడీ ప్రభుత్వం వచ్చాక జాతీయ సమైక్యత కమిటీ గత చరిత్రగా మారింది. పదకొండేళ్లలో ఎన్నో సమస్యలున్నా ఒక్క సమావేశం కూడా నిర్వహించలేదు. అధికార బిజెపి, ప్రధాని మోడీ జాతీయ సమైక్యత, దేశ సమగ్రత, ఐక్యత గురించి పైకి చిలక పలుకులు పలుకుతుంటారు. కానీ ఆచరణలో మాత్రం వారు విభజించి పాలించాలన్న వలస పాలకుల వ్యూహాన్ని అనుసరిస్తుంటారు. కేంద్రంలోను, రాష్ట్రాలలోనూ అధికారాన్ని హస్తగతం చేసుకునేందుకు మతం, కులం, జాతి, భాష, ఆహారం ప్రాతిపదికన ప్రజలను విభజిస్తున్నారు. యు.పిలో యోగి ఆదిత్యనాథ్ ఆ నినాదంతోనే రాష్ట్ర ప్రజలను మత ప్రాతిపదికన చీలుస్తున్నారు. మొదట వారిని విభజిస్తారు. దాంతో వారు వినాశనం అంచుకు చేరుకుంటారు. సరిగ్గా మణిపూర్‌లో జరుగుతున్నది ఇదే. ముస్లింలకు వ్యతిరేకంగా హిందువులు, క్రిస్టియన్లపై హిందువులు కాలు దువ్వేలా చేస్తున్నది. హిందీ మాట్లాడే వారిని ఇతర భాషలు మాట్లాడే వారిపైకి, శాకాహారులను మాంసాహారారుల పైకి ఎగదోస్తోంది. హర్యానాలో జాట్‌లకు వ్యతిరేకంగా ఇతర జాతులవారిని, బీహార్, యు.పి లో అత్యంత వెనుకబడిన కులాల వారిపైకి యాదవులను ఎగదోయడం ద్వారా అధికారాన్ని సుస్థిరం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నది. హిందూత్వ వాదులు రాజ్యాంగంగా భావించే మనుస్మృతి ప్రజలను కులాల వారీగా విభజిస్తున్నది. బిజెపి అనుసరిస్తున్న విభజన విధానమే ఈశాన్య రాష్ట్రాలను, ముఖ్యంగా మణిపూర్‌ను అశాంతికి గురిచేస్తున్నది. సంఘ పరివార్ క్రమంగా మెయితీలను వైష్ణవిజం వైపు తిప్పుకుంది. తరువాత సనాతన వాదాన్ని విశ్వసించే హిందూత్వ జాతీయవాదులుగా మార్చింది. తర్వాత క్రైస్తవ కుకీలకు వ్యతిరేకంగా వారిని సమీకరించింది. అరంభీలను సమీకరించి కుకీలపై దాడులకు థెమ్‌కాల్ అనే సాయుధ సమూహాన్ని ప్రోత్సహిస్తోంది. మెజారిటీ మెయితీల మద్దతుతో శాశ్వతంగా అధికారంలో తిష్ట వేయాలన్న ఆలోచనతో బిజెపి ఈ వివాదాన్ని రేపింది. ఇది నేడు దేశ సమైక్యతను, సమగ్రతను దెబ్బతీసే స్థాయికి వెళ్లింది. అందువల్లనే ఆర్ఎస్ఎస్, బిజెపి చేతుల్లో దేశం ఏమాత్రం సురక్షితంగా లేదని సిపిఎం ఎప్పటి నుంచో చెబుతున్నది. సంఘ్ పరివార్ సమాజంలోని ఒక సెక్షన్‌ను శత్రువుల పక్షాన నిలిపి ఐక్యత కోసం పిలుపునిస్తుంది. అంతిమంగా అది విభజనకు, అంతులేని సంఘర్షణకు దారితీస్తుంది. మణిపూర్ ప్రారంభం మాత్రమే. మిజోరంలోని మెయితీలు భయం అంచున జీవనం సాగిస్తున్నారు. ఇతర ఈశాన్య రాష్ట్రాల్లోనూ బిజెపి ఇదే విధానాన్ని అవలంబిస్తోంది. మిజోరాం, నాగాలాండ్, జార?ండ్ లలో క్రైస్తవులను దువ్వి బంగ్లాదేశ్ ముస్లింలపైకి ఎగదోసేందుకు సంఘ్ పరివార్ ప్రయత్నిస్తోంది. ఇటువంటి విచ్ఛిన్నకర ఎజెండాను ఒకవైపు అమలు చేస్తూ మరోవైపు ఈశాన్య రాష్ట్రాల సంబంధాలను మెరుగుపరిచామని మోడీ గొప్పలు చెప్పుకుంటున్నారు. మొత్తంమీద మోడీ పాలన ఈశాన్య రాష్ట్రాలలో రోసిపోయింది.

# కార్పొరేషన్ లో తప్పని గ్రామ సింహాల బెడద

**- ఇటీవల కుక్కల దాడిలో గాయపడిన చిన్నారి**
**- భయాందోళనలో చిన్నారుల తల్లిదండ్రులు**
**- పట్టించుకోని కార్పొరేషన్ సిబ్బంది**
**- గ్రామ సింహాల బారి నుంచి కాపాడాలని ప్రజల వేడుకోలు**

గోదావరిఖనినోటిఫైడ్ ఏరియాగా పేరుగాంచి రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ గా ఎదిగి ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా రూడా ఏర్పాటుపై ఉత్తర్వులు జారీ చేసి ఆచరణలో అమలు కోసం యుద్ధ ప్రాతిపదికన ప్రణాళికలు జరుగుతున్నాయి. అయినప్పటికీ గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతంలో గ్రామ సింహాల బెడద తప్పించడంలో కార్పొరేషన్ అధికారులు అవలంబిస్తూనే ఉన్నారు. గడిచిన కొన్నాళ్లుగా ఈ ప్రాంత ప్రజలకు కుక్కల భయం బెడద తప్పడం లేదు. పారిశ్రామిక ప్రాంతంలో అనేక వీధులలో పదుల సంఖ్యలో ఒక్కసారిగా గుమిగుడి వీధుల వెంట తిరుగుతూ గ్రామ సింహాలైన వీధి కుక్కలు చిన్నారులు పెద్దలపై తిరగబడి కరుస్తూ.. దాడులకు పాల్పడుతున్నాయి. కాగా ఇటి వారి కాలంలో రామగుండం పట్టణంలో ఓ చిన్నారిపై కొన్ని వీధి కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. సదరు చిన్నారి స్థానికంగా ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అయినప్పటికీ కార్పొరేషన్ అధికారులు వీధి కుక్కలను తరలించడంలో తమ నిర్లక్ష్య వైఖరిని అవలంబిస్తున్నారనే వాదన సైతం ప్రజల నుండి అధికంగా వినవస్తున్నాయి. పారిశ్రామిక ప్రాంతంలోని కొన్ని డివిజనల్ నుండి కొందరు పలుమార్లు వీధి కుక్కల బెడద నుండి తమను కాపాడాలని కార్పొరేషన్ కార్యాలయ అధికారులకు మొరపెట్టుకున్నప్పటికీ అధికారులు మొండి వైఖరిని అవలంబిస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. ఇంటి నుండి తమ పిల్లలను బయటకు పంపించాలంటే తల్లిదండ్రులు వీధి కుక్కలు అంటే భయపడుతూ వారిని బయటికి పంపించడానికి జంకుతున్నారు. ద్విచక్ర వాహనలపై వెళ్లే వాహనదారులపై సైతం రోడ్డు వెంట తిరిగే వీధి కుక్కలు గుంపు ద్విచక్ర వాహనదారులపై పరిగెడుతూ భయభ్రాంతులకు గురి చేయడంతో అనేకమంది ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి వాహనం పై నుండి కింద పడి తీవ్ర గాయాల పాలవుతున్నారు. మరికొందరు ద్విచక్ర వాహనదారులపై వీధి కుక్కలు దాడికి పాల్పడి కరుస్తూ గాయపరుస్తున్నాయి. అదేవిధంగా రాత్రిపూట ద్విచక్ర వాహనాలపై విధులకు వెళ్లే సింగరేణి కార్మికుల పై వీధి కుక్కలు వెంటపడి అరుస్తూ దాడి చేయడంతో వాహనం పై నుండి కింద పడి గాయల పాలవుతున్నారు.ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు సిబ్బందిని ఏర్పాటు చేసి ప్రధాన కూడలలో గుంపులు గుంపులుగా ఉండే శునకాలను, వ్యాధిన బారినపడి రోడ్లపై తిరుగుతున్న వాటిని సైతం ప్రాంతాలకు తరలించాలనిప్రజలు వేడుకుంటున్నారు.

# ఫెంగల్ తుఫాన్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్ష

## అన్ని స్థాయిల్లో ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఆదేశం




అమరావతి నవంబర్ 30 ఫెంగల్ తుఫాన్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. అన్ని స్థాయిల్లో ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సిఎం ఆదేశాలు జారీ చేశారు. పరిస్థితులను ఎప్పటికప్పుడు అధికారులు సమీక్షించాలని ఉన్నతాధికారులకు సూచించారు. డిజాస్టర్ టీమ్స్‌ను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఆస్తి, ప్రాణ నష్ట నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఫెంగల్ తుఫాను తీరాన్ని సమీపిస్తున్న సందర్భంగా తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో అధికారులు అప్రమత్తం అయ్యారు. శనివారం మధ్యాహ్నం కల్లా పాండిచ్చేరి తీరానికి తూఫాన్ తాకవచ్చని భావిస్తున్నారు. ఈ సందర్భంగా గంటకు 70 నుంచి 90 కిలో మీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ తెలిపింది. తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ లలోని కొన్ని ప్రాంతాల్లో, ముఖ్యంగా కోస్తా ప్రాంతాల్లో భారీ వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

# ప్రజా పాలన క్రీడా విజయోత్సవాలు

హైదరాబాద్ నవంబర్ 30 ఏడాది పాలనలోనే రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలోక్రీడారంగంలో సమూల మార్పులు సాధించామని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి అన్నారు., సీఎం కప్ ఆన్లైన్ రిజిస్ట్రేషన్లు ప్రారంభం అయిన సందర్భంగా ఈరోజు ఎల్బీ స్టేడియంలో తన చాంబర్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ,మార్పు రావాలి మంచి జరగాలి అన్న ప్రజా ఆకాంక్షల మేరకు ఏర్పడిన రేవంత్ రెడ్డి గారి ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఒక ఏడాది కాలంలోనే అన్ని రంగాల మాదిరిగానే క్రీడారంగంలో సమూల మార్పులు సాధిస్తోందనితెలంగాణ స్పోర్ట్స్ అథారిటీవిజయం వైపు ఒక కొత్త అడుగు బలంగా వేసిందని ఆయన అన్నారు.గ్రామీణ క్రీడా రంగాన్ని బలోపేతం చేయాలని మట్టిలో మాణిక్యాల క్రీడా ప్రతిభను గుర్తించి వారి ఉత్సాహానికి ప్రోత్సాహం కల్పించాలని గ్రామీణ క్రీడారంగాన్ని బలోపేతం చేసేందుకే సీఎం కప్ 2024 నిర్వహిస్తుందని ఆయన వివరించారు. ఏదో మొక్కుబడిగా క్రీడా పోటీలు నిర్వహించడం కాకుండా పకడ్బందీ ప్రణాళిక పటిష్టమైన సమాచార వ్యవస్థను ఏర్పాటు చేసుకొని ఇందులో పాల్గొంటున్న దాదాపు మూడు లక్షల మంది యువ క్రీడాకారుల సమాచారాన్ని సమగ్రంగా ఒకచోట చేర్చేలా పూర్తి సమాచార సేకరణను పటిష్టపరిచేలా చర్యలు తీసుకున్నామని ఆయన తెలిపారు.గ్రామీణ మండల జిల్లా రాష్ట్రస్థాయిలో జరుగుతున్న ఈ సీఎం 2024 పోటీలలో పాల్గొనే ప్రతి క్రీడాకారుడు తన సమాచారాన్ని ఆన్ లైన్ లో పొందుపరిచేలా, వెబ్సైట్ మరియు ఒక మొబైల్ యాప్ ను గ్రామీణ క్రీడాకారుల స్థాయి నుండి అందుబాటులోకి తీసుకొచ్చాం ఈరోజు నుంచి ప్రారంభం అయిన ఆన్ లైన్ ప్రక్రియలో ఉత్సాహంగా గ్రామీణ క్రీడాకారులు తమ సమాచారాన్ని పొందుపరుస్తున్నారని తెలిపారుఈసారి సీఎం కప్ పోటీల నిర్వహణలో.. గేమ్స్ మేనేజ్మెంట్ సిస్టం( జి ఎం ఎస్ ) ద్వారా క్రీడా పోటీల సమాచార సమాహారాన్ని పొందుపరుస్తోంది.

# కరీంనగర్ కమిషనరేట్ కి 349 నూతన కానిస్టేబుళ్ల కేటాయింపు

## విధుల్లో చేరిన నూతన కానిస్టేబుళ్లు

కరీంనగర్ట్రైనింగ్ ప్రతిభ ఆధారంగా నూతన కానిస్టేబుళ్లను పలు పోలీసు స్టేషన్లకు కేటాయింపు.విధుల్లో చేరే నూతన కానిస్టేబుళ్లకు కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి బ్రీఫింగ్ నిర్వహించారు..కరీంనగర్ కమిషనరేట్ కి నూతనంగా భర్తీ అయిన 349 మంది సివిల్ కానిస్టేబుళ్లు పురుషులు-150 మంది మహిళలు - 86 కాగా , మరియు ఏ ఆర్ కానిస్టేబుళ్లు పురుషులు- 95 మంది మహిళలు - 18 మంది కేటాయించ బడ్డారని కరీంనగర్ కమిషనర్ అభిషేక్ మొహంతి ఒక ప్రకటనలో తెలిపారు. వారు విధుల్లో చేరేందుకు శనివారంనాడు కమిషనరేట్ లో హాజరయ్యారు. కమిషనరేట్ పరేడ్ గ్రౌండ్ నందు ఏర్పాటు చేసిన సమావేశంలో వారిని ఉద్దేశించి పోలీస్ కమిషనర్ పలు కీలక సూచనలు చేసారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ట్రైనింగ్ లో నేర్చుకున్న అంశాలన్నీ విధుల్లో చేరాక ఆచరించాలన్నారు. తెలియని విషయాలని సీనియర్ల ద్వారా నేర్చుకోవాలన్నారు. ఇప్పుడు నేర్చుకునే అంశాలే రాబోయే 30 సంవత్సరాల తమ సర్వీస్ లో ఉపయోగపడతాయని అన్నారు. పోలీస్ ఉద్యోగం పోలీస్ యూనిఫామ్ ఎంత కష్టపడ్డారో, ధరించాక అంతే భాద్యతగా వ్యవహరించాలన్నారు. క్రమశిక్షణ తప్పనిసరి అని అన్నారు. నిజాయితీగా, నిస్పక్షపాతంగా విధులు నిర్వహించాలన్నారు. ట్రైనింగ్ లో వారు కనబరిచిన ప్రతిభ ఆధారంగా నూతన కానిస్టేబుళ్లను పలు పోలీసు స్టేషన్లకు కేటాయించామని పోలీస్ కమిషనర్ తెలిపారు. శనివారం సాయంత్రంలోగా విధిగా కేటాయించబడిన పోలీస్ స్టేషన్లలో విధుల్లో చేరాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ ఏ లక్ష్మీనారాయణ, ఏ వో ముని రామయ్య, ఏసీపీ లు శ్రీనివాస్ , విజయకుమార్ ఆర్ ఐలు రజినీకాంత్, జానీమియా కుమారస్వామి, శ్రీధర్ రెడ్డి లు మినిస్టీరియల్ సూపెరింటెండెంట్లు ఇతర అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# సినిమా



## ఛాలెంజింగ్‌గా అనిపించింది..



నరేష్ అగస్త్య, మేఘా ఆకాష్ ప్రధాన పాత్రల్లో ప్రదీప్ మద్దాలి దర్శకత్వంలో ఎస్.ఆర్.టి.ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రామ్ తాళ్లూరి నిర్మించిన వెబ్ సిరీస్ 'వికటకవి'. ఈ వెబ్ సిరీస్ ఈనెల 28 నుంచి జీ5 ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతోంది. ఈ పీరియాడిక్ డిటెక్టీవ్ వెబ్ సిరీస్‌లో తన వర్కింగ్ ఎక్స్‌పీరియన్స్ గురించి కాస్ట్యూమ్ డిజైనర్ జోశ్యుల గాయత్రి దేవి మీడియాతో సంభాషించారు. 'నేను పుట్టింది విజయనగరం. పెరిగిందంతా చెన్నై. కంప్యూటర్ సైన్స్‌లో ఇంజనీరింగ్ పూర్తి చేశాను. మూడేళ్ళు సాఫ్ట్‌వేర్‌గా జాబ్ చేసి మానేశా. ఆ సమయంలోనే ఫ్యాషన్ డిజైనింగ్‌లో జాయిన్ అయ్యాను. 'పలాస' మూవీకి నేను డిజైనింగ్ మాత్రమే చేసిచ్చాను. అయితే ఆహా చేసిన 'కుడిఎడమైతే' వెబ్ సిరీస్ ద్వారా కాస్ట్యూమ్ డిజైనర్‌గా నా కెరీర్ స్టార్ట్ అయ్యింది. తర్వాత 'పారాహుషార్', 'కళాపురం', 'సర్వం శక్తిమయం' వంటి సినిమాలు, వెబ్ సిరీస్‌కు వర్క్‌చేశాను. అలాగే పీపుల్ మీడియా బ్యానర్ సంస్థ నిర్మించిన సిరీస్ 'హరికథ'కు కూడా వర్క్ చేశాను. ఈ 'వికటకవి' సిరీస్ తెలంగాణ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కింది. అది కూడా పీరియాడిక్ కథాంశం కావటంతో చాలా రీసెర్చ్ చేశాను. 1940 సమయంలో అప్పటి ప్రజల వేషధారణ, సంస్కృతి, సాంప్రదాయాల గురించి తెలుసుకున్నాను. టెక్నీషియన్స్‌గా ఇదొక డిఫరెంట్ ఎక్స్‌పీరియెన్స్‌నిచ్చింది. కథకు తగ్గ మూడ్ ప్రకారం ఫ్యాబ్రిక్స్‌ను మార్చాల్సి రావడంతో నాకు పెద్ద ఛాలెంజింగ్ అనిపించింది. సతీష్ వేగేశ్న దర్శకత్వంలో 'మర్మయోగి', అలాగే 'మానసచోర'కు ప్రస్తుతం వర్క్ చేస్తున్నాను'.

## డ్రింకర్ సాయి నుంచి సాంగ్ రిలీజ్



ధర్మ, ఐశ్వర్య శర్మ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా "డ్రింకర్ సాయి". బ్రాండ్ ఆఫ్ బ్యాడ్ బాయ్స్ అనేది ఈ చిత్ర ట్యాగ్ లైన్. ఈ చిత్రాన్ని ఎవరెస్ట్ సినిమాస్, స్మార్ట్ స్క్రీన్ ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్స్ పై బసవరాజు శ్రీనివాస్, ఇస్మాయిల్ షేక్, బసవరాజు లహరిధర్ నిర్మిస్తున్నారు. కొన్ని వాస్తవ ఘటనల ఆధారంగా దర్శకుడు కిరణ్ తిరుమలశెట్టి ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. త్వరలోనే ఈ సినిమా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ రోజు "డ్రింకర్ సాయి" సినిమా నుంచి 'బాగి బాగి..' లిరికల్ సాంగ్ ను రిలీజ్ చేశారు. 'బాగి బాగి..' లిరికల్ సాంగ్ ను శ్రీ వసంత్ మంచి బీట్ తో కంపోజ్ చేయగా, చంద్రబోస్ క్యాచీ లిరిక్స్ అందించారు. జావెద్ అలీ ఎనర్జిటిక్ గా పాడారు. ఈ పాట ఎలా ఉందో చూస్తే – 'సర్రంటు కరెంటు షాక్ కొట్టినట్టు, నరాలు గుర్రాలై దౌడు తీసినట్టు, బుర్రంత గిర్రంటు సుట్టు తిరిగినట్టు, కిర్రెక్కి కిర్రాకు లవ్వు పుట్టినట్టు బాగి బాగి బాగి సూడరాదే కొంచెం ఆగి, బాగి బాగి బాగి గుండె కొట్టుకుందె కొంచెం ఆగి' అంటూ యూత్ ఫుల్ లవ్ సాంగ్ గా ఆకట్టుకుంటుంది పాట. ఈ సాంగ్ లో హీరో ధర్మ చేసిన ఎనర్జిటిక్ డ్యాన్స్ మూవ్ మెంట్స్ హైలైట్ గా నిలుస్తున్నాయి.

## వచ్చే నెలలోనే పెళ్ళి..

కథానాయిక కీర్తి సురేష్ పెళ్ళి ముహూర్తం ఖరారైంది. వచ్చేనెలలోనే ఆమె వివాహ బంధంలోకి అడుగు పెట్టబోతున్నారు. శుక్రవారం తిరుమలలో శ్రీవారిని దర్శించుకున్న అనంతరం ఆమె మీడియాతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 'వచ్చే నెలలో ఆంటోనిని పెళ్ళి చేసుకోబోతున్నా. గోవాలో మా వెడ్డింగ్‌ని ప్లాన్ చేశాం. అలాగే నేను బాలీవుడ్‌లోకి అడుగు పెడుతూ నటించిన చిత్రం 'బేబీ జాన్'. ఈ సినిమా కూడా వచ్చేనెలలోనే విడుదల కానుంది' అని తెలిపారు. తన చిన్న నాటి స్నేహితుడు ఆంటోనీతో దాదాపు 15 ఏండ్ల నుంచి రిలేష్‌షిప్‌లో ఉన్నట్లు ఇటీవల కీర్తి సురేష్ సోషల్ మీడియా వేదికగా అధికారికంగా ప్రకటించింది. అలాగే వీరిద్దరి ఫొటోని సైతం షేర్ చేసింది. తాజాగా పెళ్ళి ముహూర్తం ఖరారు నేపథ్యంలో వీరిద్దరి ఫొటో బాగా వైరల్ అయ్యింది. ఇదిలా ఉంటే, వరుణ్ ధావన్‌తో కీర్తిసురేష్ నటించిన చిత్రం 'బేబీ జాన్'. తమిళంలో విడుదలైన 'తేరీ' చిత్రానికి రీమేక్‌గా దీన్ని తెరకెక్కించినట్టు సమాచారం.

## సంక్రాంతి కానుకగా రిలీజ్



అజిత్‌కుమార్, మగిళ్ తిరుమేని దర్శకత్వంలో లైకా ప్రొడక్షన్స్ పతాకంపై రూపొందుతున్న చిత్రం 'విడాముయర్చి'. ఈ సినిమా వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదలవుతుంది. ఈ సినిమా రీసెంట్‌గానే షూటింగ్‌తోపాటు పోస్ట్ ప్రొడక్షన్ వర్క్‌ను కంప్లీజ్ చేసుకుంది. తాజాగా ఈ చిత్ర టీజర్‌ను మేకర్స్ విడుదల చేశారు. టీజర్‌ను గమనిస్తే, సినిమాలో హీరో అజిత్ కుమార్ డిఫరెంట్ అవతార్‌లో కనిపిస్తున్నారు. ప్రపంచమంతా నిన్ను నమ్మకపోయినా ఫర్వాలేదు. నిన్ను నువ్వు నమ్ముకో.. అనే కాన్సెప్ట్‌తో సినిమా యాక్షన్ బేస్డ్ మూవీగా తెరకెక్కింది. అజిత్ దేని కోసమో అన్వేషిస్తున్నారు. చివరకు తనకు కావాల్సిన దాని కోసం విలన్స్ భరతం పడుతున్నారు. తాను సాధించాల్సిన లక్ష్యం కోసం ఏం చేయటానికైనా, ఎంత దూరం వెళ్లటానికైనా, ఎవరినైనా ఎదిరించేలా ఇప్పటి వరకు కనిపించని ఓ వైవిధ్యమైన పాత్రలో ఆయన మెప్పించబోతున్నారు. ఆద్యంతం ఆకట్టుకునే ఎంటర్‌టైన్మెంట్ చిత్రాలతో పాటు విలక్షణమైన చిత్రాలను తెరకెక్కించిన దర్శకుడిగా పేరున్న మగిళ్ తిరుమేని దర్శకత్వంలో సుభాస్కరన్ ఈ భారీ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అజిత్ కెరీర్‌లో బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ మూవీ 'మంగాత' (తెలుగులో గ్యాంబ్లర్)లో అజిత్ కుమార్, త్రిష, అర్జున్ త్రయం తమదైన నటనతో ప్రేక్షకులను అలరించారు. ఇప్పుడు మరోసారి వీరు ముగ్గురు ఆడియెన్స్‌ను మెప్పించనున్నారు. అలాగే ఇందులో ఆరవ్, రెజీనా కసాండ్ర, నిఖిల్ తదితరులు ఇతర కీలక పాత్రల్లో నటించారు. వారి పాత్రలను కూడా టీజర్‌లో రివీల్ చేశారు.

## ఒకే తరహా పాత్రలు ఇష్టం లేదు



తమన్నా కథానాయికగా నటించిన తాజా చిత్రం 'సికందర్ కా ముఖద్దర్'. నెట్‌ఫ్లిక్స్ వేదికగా శుక్రవారం నుంచి స్ట్రీమింగ్ అవుతోంది. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె తన కెరీర్ గురించి పలు విషయాలు చర్చించారు. ఒకే తరహా పాత్రలు చేయడం తనకు నచ్చదని.. విభిన్నమైన పాత్రలతో తరచూ ప్రేక్షకులను అలరించాలనుకుంటున్నానని అన్నారు. 'సినిమాల్లోకి రావాలని నేను ఎప్పుడూ అనుకోలేదు. అనుకోకుండా ఇండస్ట్రీలోకి వచ్చా. దాదాపు 15 ఏళ్ల నుంచి నటిగా కొనసాగుతున్నా. గొప్ప వ్యక్తులతో కలిసి నటించా. ప్రతి సినిమా నుంచి, నటీనటుల నుంచి ఎన్నో విషయాలు నేర్చుకుంటున్నా. కెరీర్ ఆరంభంలోనే తెలుగు, తమిళంలో కమర్షియల్ విజయాలు అందుకున్నాను. అయినప్పటికీ నటిగా ఏదో చేయాలనే తపన మాత్రం తగ్గలేదు. విభిన్నమైనవి, నన్ను సవాలు చేసే పాత్రలు చేయాలనిపించింది. కమర్షియల్‌గా సక్సెస్ అందుకున్న తర్వాత ప్రయోగాలు చేయడం అనవసరం అని అందరూ భావిస్తుంటారు. కాకపోతే నేను అలా అనుకోలేదు. ఆ క్రమంలోనే బాహుబలిలో యాక్ట్ చేశా. ఎన్నో ప్రశంసలు అందుకున్నా. ఆ తర్వాత కూడా విభిన్నమైన పాత్రలు పోషిస్తూ.. కెరీర్‌లో ముందుకుసాగుతున్నా' అని తెలిపారు.

## సుకుమార్ నన్ను స్టార్‌ను చేశాడు



ఇండియాలోనే బిగ్గెస్ట్ ఫిలింగా రూపొందిన పుష్ప-2 ది రూల్ చి త్రంలో ఐకాన్‌స్టార్ అల్లు అర్జున్ నట విశ్వరూపం చూడబోతున్నారు. బ్రిలియంట్ డైరెక్టర్ సుకుమార్ దర్శకత్వ ప్రతిభ, ఆ యన క్లాస్ టేకింగ్‌తో ఈ చిత్రం బ్లాక్‌బస్టర్ చిత్రంగా నిలవబోతుంది. ప్రపంచ స్థాయి నిర్మాణ విలువలతో ఈ చిత్రాన్ని సుకుమార్ రైటింగ్స్‌తో కలిసి మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. నవీన్ ఎర్నేని, యలమంచిలి రవిశంకర్ ఈ ప్రాజెక్ట్‌ను ఎంతో అత్యున్నతంగా హై బడ్జెట్‌తో నిర్మించారు. డిసెంబరు 5న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదల కాబోతుంది. తాజాగా ముంబయ్‌లో 'పుష్ప-2' హీరో, హీరోయిన్ నిర్మాతలు సందడి చేశారు. అక్కడ గ్రాండ్ ప్రెస్‌మీట్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ మాట్లాడుతూ "ఈ చిత్రాన్ని బాలీవుడ్‌లో విడుదల చేస్తున్న అనిల్ తడాని, భరత్ భూషణ్‌లకు థ్యాంక్స్. నా చిన్ననాటి స్నేహితుడు నా కెరీర్‌లో ఎన్నో సూపర్‌హిట్ సాంగ్స్ ఇచ్చిన దేవి శ్రీ ప్రసాద్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు. త్వరలోనే పుష్ప-2 నుంచి మరో సూపర్ సాంగ్ రాబోతుంది. ఈ పాటతో దేవి మ్యాజిక్ మరో సారి తెలుస్తుంది. అందరి హృదయాలను హత్తుకునే పాట అది. ఫహాద్ ఫాజిల్‌తో పనిచేయడం ఎంతో గ్రేట్ గా వుంది. శ్రీలీల, రష్మికలతో పనిచేయడం ఎంతో హ్యాపీ. నన్ను స్టార్‌ను చేసింది జీనియస్ దర్శకుడు సుకుమారే. నా లైఫ్‌లో అత్యధిక భాగం.. హీరోగా నా ఎదుగుదల ఆయనకే చెందుతుంది. ప్రపంచంలో ప్రతి ఇండియన్, ప్రతి భాష వాళ్లు, ప్రతి రాష్ట్రంలోని వాళ్లు అంద రూ కలిసి పుష్ప-2 విడుదలను సెలబ్రేట్ చేయడం ఎంతో ఆనందంగా ఉంది"అని అన్నారు. రష్మిక మందన్నా మాట్లాడుతూ "ఐదు సంవత్సరాల ఈ ప్రయాణంలో ఎన్నో ఎమోషన్స్ వున్నాయి. పుష్ప దిరైజ్‌లో నా పై చిత్రీకరించిన తొలి సన్నివేశం నాకు ఇంకా గుర్తుంది. డిసెంబర్ 5న మా చిత్రం వస్తుందని గర్వంగా చెబుతున్నాను. సుకుమార్ లాంటి జీనియస్ దర్శకుడుతో పనిచేయడం ఎంతో గర్వంగా ఉంది"అని తెలిపారు.

## మంచు విష్ణు ప్రోత్సాహంతో..



హీరో విష్ణు మంచు, ఆయన సతీమణి విరానికా మంచు వారి వ్యక్తిగత హెయిర్ స్టైలిస్ట్ మహేష్‌కి సంబంధించిన టొయో యునిసెక్స్ సెలూన్‌ను శు క్రవారం బంజారా హిల్స్‌లో ప్రారంభించారు. లాంచ్ స్పాట్‌లో ముఖ్య అతిథుల సమక్షంలో ఈ ప్రారంభోత్సవ వేడుక ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా హీరో విష్ణు మంచు మాట్లాడుతూ, 'నేను స్టోర్స్ ఓపెనింగ్స్‌కు చాలా అరుదుగా వెళ్తుంటాను. మహేష్ నా పర్సనల్ హెయిర్ స్టైలిస్ట్. చాలా టాలెంటెడ్ పర్సన్. 5 సంవత్సరాల క్రితం పర్మనెంట్ పర్సనల్ హెయిర్ స్టైలిస్ట్ కోసం వెతుకుతున్నప్పుడు నాకు ఈయన తారసపడ్డాడు. మహేష్ ఎంతో కష్టపడి ఈ స్థాయికి వచ్చాడు. హెయిర్ స్టయిలింగ్‌లో ఇంకా ఎక్కువగా మెళుకువలు నేర్చుకోవాలని దుబారు, యూరప్‌కు పంపాను. 'కన్నప్ప' చిత్రానికి కూడా స్టైలిస్ట్‌గా పని చేశాడు. ఇప్పుడు ఇలా కొత్తగా సెలూన్ ప్రారంభించడం ఆనందంగా ఉంది' అని అన్నారు. 'నేను సెలూన్ ప్రారంభించాలని అనుకున్నప్పుడు విష్ణుకి చెప్పాను. నా నైపుణ్యాన్ని పెంచుకోవడానికి ఆయన నాకు సలహా ఇచ్చారు. అలాగే 'కన్నప్ప' సినిమాకు అవకాశం ఇచ్చారు. ఇప్పుడు ఆయన ఆశీర్వాదంతో సెలూన్‌ని ప్రారంభించాను' అని టొయో యునిసెక్స్ సెలూన్ మహేష్ చెప్పారు.



# క్రీడలు



## ఫ్రాంచైజీలు ఎన్ని వందల కోట్లు ఖర్చు చేశాయంటే!




ఐపీఎల్ 2025 మెగా వేలం జెడ్డాలో రెండు రోజులపాటు చాలా ఆసక్తికరంగా జరిగింది. ఈ వేలంలో ఇంతకుముందు ఎప్పుడూ లేని విధంగా ఎక్కువ డబ్బు ఖర్చు చేశారు. మొత్తం 182 మంది ఆటగాళ్లను 10 జట్లు కొనుగోలు చేశాయి. ఈ వేలంలో మొత్తం 639.15 కోట్ల రూపాయలు ఖర్చు అయ్యాయి. ఇది ఇంతకు ముందు 2022లో బెంగళూరులో జరిగిన వేలంలో ఖర్చు చేసిన 551.7 కోట్ల రూపాయల రికార్డును బద్దలు కొట్టింది. ఈ వేలంలో అతిపెద్ద ఆశ్చర్యం రిషభ్ పంత్. లక్నో సూపర్ జెయింట్స్ జట్టు రిషభ్ పంత్‌ను 27 కోట్ల రూపాయలకు కొనుగోలు చేసింది. ఇంతకు ముందు ఈ రికార్డు శ్రేయస్ అయ్యర్ పేరిట ఉంది. అయితే పంజాబ్ కింగ్స్ జట్టు శ్రేయస్ అయ్యర్‌ను 26.75 కోట్ల రూపాయలకు కొనుగోలు చేసింది. కానీ రిషభ్ పంత్‌ను ఎక్కువ ధరకు కొనుగోలు చేయడంతో ఈ రికార్డు రిషభ్ పంత్ పేరికి మారింది. రిషభ్ పంత్, శ్రేయస్ అయ్యర్ ఇద్దరూ తమ మునుపటి జట్లతో విభేదాల కారణంగా వేలంలోకి వచ్చారు. ఈ ఏడాది కోల్‌కతా నైట్ రైడర్స్‌ను ఐపీఎల్ టైటిల్‌కు నడిపించిన శ్రేయస్ అయ్యర్, పంజాబ్ కింగ్స్ జట్టుకు కెప్టెన్‌గా ఉండే అవకాశం ఉంది. అదేవిధంగా, రిషభ్ పంత్ ఎల్ఎస్‌జీ జట్టుకు కెప్టెన్‌గా ఉండే అవకాశం ఉంది. ఢిల్లీ క్యాపిటల్స్ రిషభ్ పంత్‌ను తమ జట్టులోనే ఉంచుకోవడానికి ప్రయత్నించింది. దీనికోసం రైట్ టు మ్యాచ్ కార్డును ఉపయోగించి 20.75 కోట్ల రూపాయలు బిడ్ చేసింది. అయితే, ఎల్ఎస్‌జీ తన బిడ్‌ను 27 కోట్ల రూపాయలకు పెంచడంతో ఢిల్లీ క్యాపిటల్స్ ఈ బిడ్‌కు సమానంగా బిడ్ చేయలేకపోయింది. దీంతో రిషభ్ పంత్ ఐపీఎల్ చరిత్రలో అత్యధిక ధరకు అమ్ముడుపోయిన ఆటగాడిగా నిలిచాడు. 2022 ఐపీఎల్ వేలంలో మొత్తం 204 మంది క్రికెటర్లు అమ్ముడుపోయారు. ఈ వేలంలో అత్యధిక ధర పలికిన ఆటగాడు ఇషాన్ కిషన్. ముంబై ఇండియన్స్ జట్టు ఇషాన్ కిషన్‌ను 15.25 కోట్ల రూపాయలకు కొనుగోలు చేసింది. అదేవిధంగా, భారతీయ పేస్ బౌలర్ దీపక్ చాహర్‌ను చెన్నై సూపర్ కింగ్స్ జట్టు 14 కోట్ల రూపాయలకు కొనుగోలు చేసింది. కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టు శ్రేయస్ అయ్యర్‌ను 12.25 కోట్ల రూపాయలకు కొనుగోలు చేసింది. విదేశీ ఆటగాళ్లైన లియామ్ లివింగ్‌స్టోన్, వానిందు హసరంగ, నికోలస్ పూరన్ వంటి వారు కూడా భారీ మొత్తాలకు అమ్ముడుపోయారు. అలాగే, అన్‌క్యాప్డ్ ఆటగాళ్ళలో అవేష్ ఖాన్ అత్యధిక ధర పలికాడు. లక్నో సూపర్ జెయింట్స్ జట్టు అతన్ని 10 కోట్ల రూపాయలకు కొనుగోలు చేసింది..

## సెమీస్‌లో సింధు



భారత అగ్రశ్రేణి షట్లర్ పివి.సింధు సెమీఫైనల్లోకి ప్రవేశించింది. సయ్యద్ మోడీ ఇండియా ఇంటర్నేషనల్ ఓపెన్ సూపర్ 300 టోర్నీ మహిళల సింగిల్స్‌లో సింధు జోరు కొనసాగించింది. శుక్రవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్ మ్యాచ్‌లో చైనా అమ్మాయి వాంగ్‌పై 21-15, 21-17తో వరుస గేముల్లో గెలుపొందిన సింధు సెమీస్‌కు చేరుకుంది. పురుషుల సింగిల్స్‌లో టాప్ సీడ్ లక్ష్యసేన్ సైతం సెమీఫైనల్‌కు చేరుకున్నాడు. సహచర షట్లర్ లువాంగ్‌పై 21-8, 21-19తో ఏకపక్ష విజయం సాధించాడు. మరో క్వార్టర్స్‌లో ప్రియాన్షు రజావత్ 21-13, 21-8తో డాంగ్‌పై గెలుపొంది సెమీస్‌లో అడుగుపెట్టాడు. మహిళల డబుల్స్‌లో తనీశ క్రాస్టో, అశ్విని పొన్నప్ప జోడీ 21-12, 17-21, 21-16తో ప్రియ, శృతి జోడీపై మూడు గేముల మ్యాచ్‌లో గెలుపొందింది. మరో క్వార్టర్స్‌లో ట్రెసా జాలి, పుల్లెల గాయత్రి 21-8, 21-15తో వరుస గేముల్లో మలేషియా జోడీపై అలవోక విజయం సాధించింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో ధ్రువ్ కపిల, తనీశ క్రాస్టోలు 21-16, 21-13తో మలేషియా జంటపై గెలుపొంది సెమీఫైనల్‌కు చేరుకున్నారు.

## ఆసీస్ పిఎం ఎలెవన్‌తో భారత్ ఢీ



కాన్‌బెర్రా : పెర్త్ టెస్టులో సూపర్ విజయాన్ని ఆస్వాదిస్తున్న టీమిండియా.. కంగారూ గడ్డపై మరో కఠిన సవాల్‌కు సిద్ధమవుతోంది. అడిలైడ్ వేదికగా డే అండ్ నైట్ పింక్ బాల్ టెస్టు వచ్చేనెల ఆరో తేదీ నుంచి ఆరంభం కానుంది. ఇప్పటి వరకూ నాలుగు పింక్ బాల్ టెస్టుల్లో ఆడిన టీమిండియా మూడింట విజయాలు సాధించింది. చివరగా అడిలైడ్‌లో జరిగిన పింక్ బాల్ టెస్టులో భారత్ ఓటమి చవిచూసింది. దీంతో ఈసారి గులాబీ సవాల్‌కు మెరుగ్గా సన్నద్ధమయ్యేందుకు సిద్ధమైంది. ఆస్ట్రేలియా ప్రధానమంత్రి ఎలెవన్‌తో రెండు రోజుల వార్మప్‌తో మ్యాచ్ ప్రాక్టీస్ చేయనుంది. కాన్‌బెర్రా మనుకా ఓవల్‌లో శనివారం, ఆదివారం పింక్ బాల్ వార్మప్ జరుగనుంది. అడిలైడ్ డే అండ్ నైట్‌లో జరుగనుండగా.. వార్మప్ మ్యాచ్ మాత్రం పూర్తిగా డేలోనే జరుగుతుంది. బొటనవేలి గాయంతో పెర్త్ టెస్టుకు దూరమైన శుభ్‌మన్ గిల్ వార్మప్ మ్యాచ్‌లో ఆడనున్నాడు. శుక్రవారం నెట్ సెషన్‌లో గిల్ మంచిగా కనిపించాడు. పది నిమిషాల పాటు త్రోడౌన్స్ ఎదుర్కొన్న గిల్.. ఆ తర్వాత ఫుల్ లెంగ్త్ బాల్స్‌ను ఆడాడు. బ్యాటింగ్ కోచ్ నుంచి డిఫెన్స్ సూచనలు తీసుకున్నాడు. బొటనవేలి గాయం గిల్‌ను ఇబ్బంది పెట్టినట్టు కనిపించలేదు. దీంతో గిల్ నేడు వార్మప్ మ్యాచ్‌లో ఆడే అవకాశాలు మెండుగా ఉన్నాయి. రోహిత్ శర్మ పెర్త్‌లోనే నెట్స్‌లో పింక్ బాల్‌పై సాధన చేశాడు. కాన్‌బెర్రాలోనూ అదే సాధన కొనసాగించాడు. విరాట్ కోహ్లి నెట్స్‌లో డ్రైవ్స్ ఆడగా.. ఎక్కువగా ఎడ్జ్ తీసుకున్నాయి. దీంతో ప్రాక్టీస్‌లో అసహనంగా కనిపించాడు. రిషబ్ పంత్, యశస్వి జైస్వాల్ బ్యాటింగ్ చేస్తూ ఉత్సాహంగా కనిపించారు. యువ బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్ పింక్ బాల్‌ను ఎదుర్కొనేందుకు ఇబ్బందిపడ్డాడు. జశ్‌ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్, ఆకాశ్ దీప్, ముకేశ్ కుమార్, ప్రసిద్ కృష్ణలు సైతం పింక్ బాల్ వార్మప్‌లో ఆడనున్నారు. స్పిన్నర్లు వాషింగ్టన్ సుందర్, రవీంద్ర జడేజా, రవిచంద్రన్ అశ్విన్‌లు ఇటు బ్యాట్‌తో, అటు బంతితో వార్మప్‌లో అవకాశం అందుకునే వీలుంది. కెఎల్ రాహుల్ నెట్స్‌లో శ్రద్ధగా సాధన చేశాడు. రోహిత్ శర్మ రాకతో జట్టు బ్యాటింగ్ ఆర్డర్‌లో రాహుల్ స్థానంపై అనిశ్చితి నెలకొంది. మూడోస్థానంలో ఆడిన దేవదత్ పడిక్కల్ బెంచ్‌కు పరిమితం కానుండగా.. ఆ స్థానంలో రాహుల్ వస్తాడా? లేదంటే యశస్వి, రాహుల్ జోడీ జోరు కొనసాగించేందుకు రోహిత్ శర్మనే మూడో స్థానంలో ఆడతాడా? అనేది చూడాలి.

## రోహిత్‌తో ఓపెనింగ్ చేసేది... ఈ పవర్ హిట్టరేనట!



ఐపీఎల్ 2025 మెగా ఆక్షన్ నిన్నటితో ముగిసిన సంగతి తెలిసిందే. కొద్దిరోజుల్లోనే ఐపీఎల్ 2025 సీజన్ ప్రారంభం కానుంది. అయితే దీనికంటే ముందు ముంబై ఇండియన్స్ జట్టుకు రోహిత్ శర్మతో ఎవరు ఓపెనింగ్ చేస్తారనేది అతిపెద్ద సమస్యగా మారింది. ఇషాన్ కిషన్ సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకు వెళ్లిపోవడంతో ఈ ప్రశ్న తలెత్తింది. ఐపీఎల్ 2025 వేలం తర్వాత, ముంబై ఇండియన్స్ 23 మంది ఆటగాళ్లతో తమ జట్టును ఫైనల్ చేసింది. వేలం ముందు ఐదుగురు ఆటగాళ్లను నిలుపుకున్న ముంబై విల్ జాక్స్, ర్యాన్ రికెల్టన్ వంటి 18 మంది కొత్త ఆటగాళ్లను జట్టులో చేర్చుకుంది. ఈ ఇద్దరు ఆటగాళ్లు రోహిత్ శర్మతో ఓపెనింగ్ చేసే అవకాశం కోసం పోటీపడుతున్నారు. ర్యాన్ రికెల్టన్ పవర్ హిట్టర్. అతను కొట్టే బంతులు స్టేడియాన్ని దాటిపోతుంటాయి. అయితే అతన్నే ఓపెనర్ గా దించితే బాగుంటుందని చాలామంది అభిప్రాయపడుతున్నారు. ముంబై ఇండియన్స్ జట్టు బ్యాటింగ్ ఆర్డర్ ఎలా ఉండాలనే విషయంపై మాజీ క్రికెటర్ మహమ్మద్ కైఫ్ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. స్టార్ స్పోర్ట్స్‌లో జరిగిన చర్చలో మాట్లాడుతూ, తిలక్ వర్మ రోహిత్ శర్మతో కలిసి ఓపెనింగ్ చేయాలని కైఫ్ సూచించారు. సూర్యకుమార్ యాదవ్ తన సాధారణ స్థానం అయిన మూడవ స్థానంలో కొనసాగవచ్చని, హార్దిక్ పాండ్య నాలుగో లేదా ఐదవ స్థానంలో బ్యాటింగ్ చేయవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. విల్ జాక్స్ తర్వాత వచ్చి బ్యాటింగ్ చేయవచ్చని కూడా కైఫ్ అన్నారు. “తిలక్ వర్మ, రోహిత్ శర్మ ఈసారి ఓపెనింగ్ చేయాలి,” అని కైఫ్ అన్నారు. “సూర్యకుమార్ యాదవ్ మూడవ స్థానంలో బ్యాటింగ్ చేయాలి. హార్దిక్ పాండ్య నాలుగు లేదా ఐదవ స్థానంలో బ్యాటింగ్ చేయవచ్చు. విల్ జాక్స్ అతని తర్వాత బ్యాటింగ్ చేయవచ్చు.” అని అభిప్రాయపడ్డాడు. ముంబై ఇండియన్స్ జట్టుకు యువ ఆటగాళ్లు అవసరమని మహమ్మద్ కైఫ్ అన్నారు. ముఖ్యంగా వికెట్‌కీపర్-బ్యాట్స్‌మన్‌గా ఉన్న రోబిన్ మిన్జ్, నమన్ ధీర్ వంటి ఆటగాళ్లను జట్టులోకి తీసుకుంటే బాగుంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. వేలం మొదటి రోజు ముంబై ఇండియన్స్ జట్టు అంతగా ఆకట్టుకోకపోయినప్పటికీ, రెండో రోజు బలమైన ఆటగాళ్లను జట్టులోకి తీసుకోవడంతో బాగా రాణించిందని కైఫ్ అన్నారు. దీంతో వచ్చే సీజన్‌లో ముంబై ఇండియన్స్ జట్టు బాగా ఆడే అవకాశం ఉంది. అయితే, ఇంకా ఓపెనర్‌ను ఎవరుగా ఎంచుకోవాలనేది నిర్ణయించాల్సి ఉంది

## మైదానంలో కుప్పకూలిన క్రికెటర్.. గుండెపోటుతో మృతి



గుండెపోటు ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి. ఆరోగ్యంగా ఉన్నారనుకున్న ప్లేయర్లు దీనిబారిన పడుతున్నారు. తాజాగా పూణె వేదికగా ఎగ్జిబిషన్ మ్యాచ్‌లో ఓ క్రికెటర్ మైదానంలోనే కుప్పకూలి ప్రాణాలు వదిలాడు. అప్పటివరకూ తమతో ఆడుతున్న ఆటగాడు నిర్జీవంగా మారడంతో సహచరులంతా బాధలో మునిగిపోయారు. 35 ఏళ్ల ఇమ్రాన్ పటేల్ ఓపెనర్‌గా క్రీజ్‌లోకి వచ్చాడు. కాసేపటికే ఎడమవైపు ఛాతీలో నొప్పిగా ఉందంటూ సహచరులకు చెప్పాడు. ఆన్ ఫీల్డ్ అంపైర్లతో చర్చించిన అనంతరం అతడు డగౌట్‌కు వెళ్లేందుకు సిద్ధమయ్యాడు. కొద్దిదూరం వెళ్లగానే కుప్పకూలాడు. దీంతో ఒక్కసారిగా ఆటగాళ్లు, ప్రేక్షకులు హడలెత్తిపోయారు. ఆ మ్యాచ్ లైవ్‌స్ట్రీమింగ్ జరుగుతుండటంతో వీడియోలు బయటకు వచ్చేశాయి. వెంటనే అతడిని ఆసుపత్రికి తరలించినా ఫలితం మాత్రం లేదు. అప్పటికే ప్రాణాలు విడిచినట్లు వైద్యులు ప్రకటించారు. ఇమ్రాన్ పటేల్‌కు భార్య, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నాడు. కొడుకు వయసు కేవలం నాలుగు నెలలు మాత్రమే. క్రికెట్ ఆడటంతోపాటు రియల్ ఎస్టేట్, జ్యూస్‌షాప్ కూడా నిర్వహిస్తున్నాడు. పూణెలోనే ఇదే ఏడాది సెప్టెంబర్‌లో హబీబ్ షేక్ అనే క్రికెటర్ కూడా క్రికెట్ ఆడుతూ ప్రాణాలు వదిలాడు. అయితే, అతడికి అప్పటికే డయాబెటిక్ సమస్య ఉంది. కానీ, ఇమ్రాన్ పటేల్‌కు మాత్రం అనారోగ్య సమస్యలేమీ లేకపోవడం గమనార్హం. తోటి క్రికెటర్ మృతిపై సహచరులు తీవ్ర ఆవేదన వ్యక్తంచేశారు. ఫిజికల్‌గా ఫిట్‌గా ఉండే ఇమ్రాన్‌కు ఇలా జరుగుతుందని అస్సలు ఊహించలేదని వాపోయారు.

## ఘనంగాఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి జన్మదిన వేడుకలు -విద్యార్థులకు అన్నదానం చేసిన నాయకులు



**ప్రజాబలం మందమర్రి మండల రిపోర్టర్ నవంబర్ 30 :**చెన్నూరు నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి పుట్టినరోజు సందర్భంగా శనివారం సింగరేణి హైస్కూల్లో ఉన్న మనోవికాస్ స్కూల్లో విద్యార్థుల సమక్షంలో కేకు కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. విద్యార్థులకు నోట్ బుక్స్ పెన్నులు పంపిణీ చేసిన అనంతరం విద్యార్థులకు అన్నదానం చేసారు. ఈ సందర్భంగా పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు నోముల ఉపేందర్ గౌడ్, చెన్నూరు మాజీ శాసనసభ్యులు నల్లాల ఓదెలు, ఉమ్మడి జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి సోతుకు సుదర్శన్ లు మాట్లాడుతూ వివేక్ వెంకటస్వామి మచ్చలేని వ్యక్తి అని వారి కుటుంబం ఎల్లప్పుడూ ప్రజల కొరకే పోరాటం చేసే మనస్తత్వమని అన్నారు. వివేక్ వెంకటస్వామి మొదటి నుండి విశాఖ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా విద్యార్థులకు బెంచీలు ప్రతి వార్డులలో బోర్లు వేయించడం జరిగిందన్నారు. వివేక్ వెంకటస్వామి మార్నింగ్ వాక్ లో వార్డులలో ఏ సమస్యలు ఉన్నాయో తెలుసుకుని వాటిని అధికారులతో మాట్లాడి అప్పటికప్పుడే పరిష్కరించి ప్రజలకు అందుబాటులో ఉంటూ చెన్నూరు నియోజవర్గాన్ని అభివృద్ధి బాటలో తీసుకు వెళ్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షులు నెరువట్ల శ్రీనివాస్, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు పుల్లూరు లక్ష్మణ్, మహిళా పట్టణ అధ్యక్షురాలు గడ్డం రజని, మండ భాస్కర్ గోగుల రాజయ్య, సంగి సదానందం, పైడిమల్ల నర్సింగ్, కనకం రాజు, మంకు రమేష్, రాచర్ల రవి, నామిని ముత్తయ్య, మహంతి అర్జున్, రావుల శ్రీనివాస్, బుర్ర ఆంజనేయులు గౌడ్, ఆకారం రమేష్, పిండి ఐలయ్య, కడారి వీరస్వామి, జమాల్పూర్ నర్సోజి, కదలి శ్రీనివాస్, రేగుల శ్రీనివాస్, తిరుమల్, ఎర్ర రాజు, దుర్గం ప్రభాకర్, కొలిపాక సదానందం, జావిద్ ఖాన్, ఎండి ఇసాక్, రాయబారం కిరణ్, వీరన్న, బండి శంకర్, శ్రీనివాసు, అందుగుల లక్ష్మణ్, డాక్టర్ లింగన్న, వేటూరి సత్యనారాయణ, ఎండి సుకూరు, రాచర్ల గణేష్, మహిళా నాయకురాలు పోచంపల్లి లక్ష్మి, స్వరూప, కవిత, సమత, శంకర్, జంగపల్లి రాజేష్, సామ్యూల్, లక్ష్మణ్, పిడుగురాళ్ల వెంకన్న గజ్జల నరేష్ తదితరులు పాల్గొన్నారు.



# ఆర్థిక సహాయం అందచేసిన వినయ్ స్వచ్ఛంధ సేవ సంస్థ





**ప్రజాబలం దండేపల్లి మండల రిపోర్టర్ నవంబర్ 30** : మంచిర్యాల జిల్లాలోని దండేపల్లి మండలంలోని మామిడిపల్లి గ్రామానికి చెందిన జిల్లపల్లి బొందమ్మ ఇటీవల అనారోగ్యం కారణంగా మృతి చెందగా వారి కుటుంబ సభ్యుల ను పరామర్శించి వినయ్ స్వచ్ఛంధ సేవ సంస్థ ద్వారా 5000/- రూపాల ఆర్థిక సహాయం అందచేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు గడ్డం త్రిమూర్తి,తాజా మాజీ సర్పంచ్ ఎల్తపు శ్రీనివాస్,గడ్డం రామచందర్, అరేపల్లి రమేష్,బుఖ్య రవి,లేంకథి శేకర్,జోగు శేకర్,బల్లి కొండ మల్లేష్,కంది శంకర్,పతిపక వినోద్,మేకల రమేష్, జిళ్లపల్లి పల్లి బానుచంధర్,కుమ్మరి రాజన్న,తదితరులు పాల్గొన్నారు.

## క్రమశిక్షణ,నిజాయితీతో విధులు నిర్వర్తించి ఉన్నత స్థాయికి చేరాలి

### అంకితభావంతో ప్రజలకు సేవలందిస్తూ పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలి

### తొమ్మిది నెలలు ప్రాథమిక శిక్షణను పూర్తి చేసుకొని జిల్లాకు కేటాయించబడిన 78 మంది పోలీస్ కానిస్టేబుల్ ఆఫీసర్స్ తో సమావేశమైన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు



భద్రాద్రి కొత్తగూడెం తొమ్మిది నెలల పాటు బేసిక్ ట్రైనింగ్ ను పూర్తి చేసుకొని జిల్లాలో విధులను నిర్వర్తించడానికి కేటాయించబడిన 78 మంది కానిస్టేబుల్ ఆఫీసర్స్ తో ఈ రోజు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు హెడ్ క్వార్టర్స్ నందు గల కాన్ఫరెన్స్ హాల్లో సమావేశమయ్యారు.ఇందులో 28 మంది సివిల్ కానిస్టేబుళ్ళు (పురుషులు),17 మంది ఉమేన్ కానిస్టేబుళ్ళు,25 మంది ఏఆర్ కానిస్టేబుళు (పురుషులు),08 మంది ఏఆర్ ఉమేన్ కానిస్టేబుళ్ళు మొత్తం 78 మంది రిపోర్ట్ చేయడం జరిగింది.వీరితో సమావేశమైన జిల్లా ఎస్పీ గారు మాట్లాడుతూ పోలీస్ శాఖలో పనిచేసే ప్రతి ఒక్కరూ క్రమశిక్షణ,నిజాయితీతో విధులు నిర్వర్తించి మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. అంకితభావంతో ప్రజలకు సేవలు అందిస్తూ ప్రజలలో పోలీస్ శాఖపై మరింత నమ్మకాన్ని పెంపొందించాలని తెలిపారు.ప్రతి ఒక్కరూ కొత్త క్రిమినల్ చట్టాలపై అవగాహన పెంచుకొని సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు.మానసికంగా,శారీరకంగా దృఢంగా ఉంటూ,ఉన్నతాధికారుల ఆదేశాలను పాటిస్తూ బాధ్యతగా తమ యొక్క కేటాయించిన విధులను నిర్వర్తించాలని తెలిపారు. విధులు పరంగా ఎలాంటి సమస్యలు తలెత్తిన వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు.నీతి,నిజాయితీతో పనిచేసే వారికి పోలీస్ శాఖలో ఎల్లప్పుడూ ప్రత్యేక గుర్తింపు ఉంటుందని అన్నారు.కష్టపడి సాధించిన ఉద్యోగంలో తమకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకొని ఉన్నత స్థాయికి చేరాలని తెలియజేసారు.ప్రస్తుతం పోలీస్ శాఖలో వినియోగిస్తున్న సాంకేతికతపై అవగాహన పెంచుకుని దానికనుణంగా పనిచేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏఆర్ డిఎస్పి సత్యనారాయణ,అడ్మిన్ ఆర్ఐ లాల్ బాబు,వెల్ఫేర్ ఆర్ఐ కృష్ణారావు మరియు తదితరులు పాల్గొన్నారు.

# మెదక్ జిల్లా స్థాయి ఇన్స్పైర్ మరియు వైజ్ఞానిక ప్రదర్శన విజేతలు

విద్యార్థులు తన సృజనాత్మకతను పదును పెట్టె విజ్ఞాన ప్రదర్శనలు 29, 30వ తేదీలలో వెస్లీ ఉన్నత పాఠశాల వేదిక అయింది.జిల్లా స్థాయి ప్రేరణ (INSPIRE) కు 36 పాఠశాలల నుండి విద్యార్థులు ఎగ్జిబిట్స్ ను ప్రదర్శించగా రాష్ట్రస్థాయికి నాలుగు(4) ఎగ్జిబిట్స్ ఎంపికయ్యాయి అందులో 1. దుంపలసిరి బంగారు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మాసాయిపేట్, స్వయంచాలక నీటిపారుదల రోబో

2. కుమ్మరి మధు జడ్.పి.హెచ్.ఎస్ కాగజ్ మద్దూర్ నర్సాపూర్, సౌర శక్తితో నడిచే అల్ట్రాసోనిక్ ఎనిమల్ రిపేల్లర్ 3. చిన్నం సంజన శ్రీ %యూఔ=జు×వా% గాంధీనగర్, మెదక్, బహుళార్థక చేతి కర్ర

4. సారా సంజన గీతా హై స్కూల్ మంభోజిపల్లి, రైతులకు భద్రతా పరికరం . 2024 -25 వ సంవత్సరంనకు గాను సంబంధిత బాల వైజ్ఞానిక పోటీలో ప్రధాన అంశంగా సుస్థిర భవిష్యత్తు కోసం శాస్త్ర సాంకేతికతలో ఏడు ఉప అంశాలలో జూనియర్ మరియు సీనియర్ విభాగాలలో మొత్తం 375 ప్రదర్శనలు ప్రదర్శించబడ్డాయి. ఇందులో ప్రతి ఉపఅంశము నుండి ప్రథమ స్థాయిలో నిలిచిన ఏడుగురు సీనియర్ మరియు జూనియర్ విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీకి ఎంపిక అయినారు. అందులో

విపత్తుల నిర్వహణ ఉపఅంశంలో సీనియర్ విభాగం నుండి

ప్రథమ స్థానంలో ఏ శివ చైతన్య జడ్పిహెచ్ఎస్ చీకోడ్ లింగాయపల్లి బహుళ ప్రయోజన జెసిబి

ద్వితీయ స్థానంలో మీ జీవిత పటేల్ సిద్ధార్థ హై స్కూల్ మెదక్ స్వయంచాలక బాంబు శోధన యంత్రం

తృతీయ స్థానంలో ఎం శ్రీధర్ జడ్.పి.హెచ్.ఎస్ మాచవరం అగ్నిశోదక గంటిక యంత్రం

జూనియర్ విభాగము నుండి ప్రథమ స్థానంలో వి యశశ్రీ విష్ణు హై స్కూల్ నర్సాపూర్ అగ్నిపర్వత వి ఎ ో ఎ ట న ం

ద్వితీయ స్థానంలో ఎం సంగమేశ్వర్ యుపిఎస్ వెంకట్రావుపేట అల్లాదుర్గ్ ఆరబెట్టు ప్రదేశం

తృతీయస్థానంలో కే రేశ్వంత్ %వీభ్రూఔజఔ=వా% బాలుర మెదక్ స్వయంచాలక అగ్నిమాపక యంత్రం ,

ఆహారం ఆరోగ్యం పరిశుభ్రత అనే ఉప అంశములో

సీనియర్ విభాగం నుండి

ప్రథమ స్థానంలో పి అంజనా శ్రీ గీత హై స్కూల్, మంభోజిపల్లి ఆహారం శోధించే పరికరం

ద్వితీయ స్థానంలో ఆసీమ జిశాన్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల మెదక్ గోధుమ గడ్డితో రోగనిరోధకత

తృతీయ స్థానంలో ఏం మనోహరి సిద్ధార్థ గ్రామీణ హై స్కూల్ మాచవరం పర్యావరణహిత శానిటరీ ప్యాడ్స్

జూనియర్ విభాగము నుండి

ప్రథమ స్థానంలో పి చైతన్య జడ్పిహెచ్ఎస్ శంకరంపేట్ %ూా% జలనేతి యోగ ప్రక్రియ

ద్వితీయ స్థానంలో %వీణ% అన్వర్ ఖాన్ అక్షయ ప్రాథమికోన్నత పాఠశాల తూప్రాన్ సాంప్రదాయ పద్ధతుల్లో ఆహార సంరక్షణ

తృతీయ స్థానంలో ఎన్ హర్షవర్ధన్ జెడ్పిహెచ్ఎస్ యూసుఫ్ పేట పాపన్నపేట ఆహార అలవాట్లు నాడు నేడు ,

గణిత నమూనాలు మరియు గణన ఆలోచన అనే ఉప అంశంలో

సీనియర్ విభాగం నుండి

ప్రథమ స్థానంలో జె శ్రీకర్ సిద్ధార్థ గ్రామీణ హై స్కూల్ మాచవరం టాన్జెంట్స్ నిర్మాణం

ద్వితీయ స్థానంలో నేహా గీత హై స్కూల్ నర్సాపూర్ త్రికోణమితి పార్క్

తృతీయ స్థానంలో సుజాత జడ్పీహెచ్ఎస్ రైలాపూర్ ద్విమితీయ, త్రిమితీయ ఆకారాలు

జూనియర్ విభాగము నుండి

ప్రథమ స్థానంలో %వీణ% ఆసిఫా ఫాతిమా గీత హై స్కూల్ తూప్రాన్ సరూప త్రిభుజాలు

ద్వితీయ స్థానంలో పి అంజనీ ప్రసాద్ %ు+మీ% కోమటిపల్లి జామితీయ భావనలు

తృతీయ స్థానంలో ఎస్ ప్రనిష్ సిద్ధార్థ హై స్కూల్ మెదక్ ద్విమితీయ త్రిమితీయ ఆకారాలు ,

సహజ వ్యవసాయం అనే ఉప అంశం లో

సీనియర్ విభాగం నుండి

ప్రథమ స్థానంలో %జ౧% మహేశ్వరి వెస్లీ హై స్కూల్ సేంద్రీయ వ్యవసాయం

ద్వితీయ స్థానంలో ఎం ఆదిత్ ఆర్యన్ సిద్ధార్థ గ్రామీణ హై స్కూల్ మాచవరం ఆధునిక నాటు యంత్రం

తృతీయ స్థానంలో%వీ% సహస్ర గీత హై స్కూల్ మెదక్ ఫెర్మికల్చర్ ఫార్మింగ్

జూనియర్ విభాగము నుండి

ప్రథమ స్థానంలో %దీ% శశి ప్రియ ప్రాథమికోన్నత పాఠశాల శివాయిపల్లి సేంద్రియ వ్యవసాయం

ద్వితీయ స్థానంలో %జ౧% ఎలేందర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నాగసానిపల్లి వడ్లు ఆరబెట్టే యంత్రం

తృతీయ స్థానంలో ఏ సహస్ర రెడ్డి వివేక విద్యాలయం రామాయంపేట మంకీ గన్,

వనరుల నిర్వహణ అనే ఉప అంశంలో సీనియర్ విభాగం నుండి

ప్రథమ స్థానంలో జి ఐశ్వర్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల టేక్మాల్ అంతరిస్తున్న జంతుజాల పరిరక్షణ

ద్వితీయ స్థానంలో నివాస్ నాయుడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మిర్జాపల్లి శంకరంపేట్ %=% విత్తన రోబేటర్

తృతీయ స్థానంలో కే సాయికుమార్ %MJPTWCWRS% హవేలీ ఘన్పూర్ సౌరశోధన వ్యవస్థ

జూనియర్ విభాగము నుండి

ప్రథమ స్థానంలో యుమెన్ గీత హై స్కూల్ బయో ప్లాస్టిక్

ద్వితీయ స్థానంలో వెంకట సాయి గీత హై స్కూల్ మెదక్ కాలుష్య నివారణ

తృతీయ స్థానంలో వేణుగోపాల్ ప్రాథమికోన్నత పాఠశాల పైతర కొల్చారం సౌర పలకలతో ఎలక్ట్రిక్ వాహనం ,

రవాణా మరియు కమ్యూనికేషన్ అనే ఉప అంశం లో

సీనియర్ విభాగం నుండి

ప్రథమ స్థానంలో భాను ప్రకాష్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రాజు పల్లి రోడ్డు ప్రమాద నివారణ

ద్వితీయ స్థానంలో గంగోత్రి గీతా హై స్కూల్, మంభోజిపల్లి సెన్సార్ ఆధారిత స్కూల్ బస్సు

తృతీయ స్థానంలో వి దీపిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చిన్నగన్పూర్ కొల్చారం రవాణా వ్యవస్థ

జూనియర్ విభాగము నుండి

ప్రథమ స్థానంలో తాళహా గీతా హై స్కూల్ మంబోజి పల్లి విద్యుత్ స్తంభాల వద్ద విద్యుత్ ఘాత నివారణ

ద్వితీయ స్థానంలో బి మహేష్ కుమార్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎలకుర్తి ఆధునిక వ్యవసాయ పద్ధతి

తృతీయ స్థానంలో డి సిరి చందన వివేక విద్యాలయం రామాయంపేట చంద్రయాన్ 3 ,

లి?? వ్యర్థాల నిర్వహణ అనే ఉప అంశంలో

సీనియర్ విభాగం నుండి

ప్రథమ స్థానంలో ఏ అక్షయ్ సిద్ధార్థ గ్రామీణ హై స్కూల్ మాచవరం అంతరిక్ష శకలాల నిర్మూలన

ద్వితీయ స్థానంలో ఎన్ శ్రీకాంత్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చికోడ్ లింగాయపల్లి ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహన

తృతీయ స్థానంలో డి ఐశ్వర్య రత్నం టెక్నో స్కూల్ మెదక్ ఆధునిక నీటిపారుదల పరిష్కారం

జూనియర్ విభాగము నుండి

ప్రథమ స్థానంలో ఎం నిశ్విత అక్షర ప్రాథమికోన్నత పాఠశాల తూప్రాన్ పొడి పునర్వినియోగ కళ

ద్వితీయ స్థానంలో కే సంతోష్ జిల్లా పరిషత్ కాగజ్ మద్దూర్ నర్సాపూర్ కంపెనీల నుండి కార్బన్ సంగ్రహణ

తృతీయ స్థానంలో పి శివరాజు %MJPTWCWRS% హవేలీ ఘన్పూర్ ఫ్లైఓవర్ కింద స్థల వినియోగం, నిలిచారు . అదేవిధంగా ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కూడా ఎగ్జిబిట్స్ ను ప్రదర్శించారు అందులో

ప్రథమ బహుమతి ఎం రజిత స్కూల్ అసిస్టెంట్ భౌతిక శాస్త్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రామాయిపల్లి స్మార్ట్ కప్ పొందారు. అదేవిధంగా స్థిరమైన భవిష్యత్తు మరియు ఆరోగ్యం కోసం చిరుధాన్యాలు అనే అంశంపై సెమినార్ నిర్వహించడం జరిగింది ఈ సెమినార్ లో

ప్రథమ స్థానంలో శృతి నక్షత్ర గవర్నమెంట్ న్యూ హై స్కూల్ మెదక్,

ద్వితీయ స్థానంలో జియా తబస్సుమ్, ప్రభుత్వ బాలిక ఉన్నత పాఠశాల మెదక్

తృతీయ స్థానంలో వాగ్దేవి గీత ఉన్నత పాఠశాల మంభోజిపల్లి మెదక్

నిలిచారుజి

## జిల్లా వ్యాప్తంగా నెల రోజుల పాటు 30, 30(ఎ) పోలీసు యాక్ట్ అమలు.

### ...... జిల్లా ఎస్పీ. చెన్నూరి రూపేష్,




**సంగారెడ్డి నవంబర్ 30 ప్రజ బలం ప్రతినిధి:** శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా జిల్లా వ్యాప్తంగానెల రోజుల పాటు (డిసెంబర్ 1వ తేది నుండి 31 వరకు) 30, 30(ఎ) పోలీసు యాక్ట్-1861 అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ ఒక ప్రకటనలో తెలియజేశారు. కావున పోలీసు అధికారుల ముందస్తు అనుమతి లేనిది సంగారెడ్డి జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్ లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని, శాంతి భద్రతలకు భంగం కలిగించే విధంగా, ప్రజా ధనానికి నష్టం కల్గించే, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేపట్టకూడదన్నారు. జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు ఇట్టి విషయంలో పోలీసు వారికి సహకరించవలసిందిగా సూచించారు. అనుమతి లేకుండా పై చర్యలకు పాల్పడితే సంబంధిత వ్యక్తులపై చట్టరిత్య కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

# చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి జన్మదిన వేడుకలు

## -పేదలకు దుప్పట్ల పంపిణీ



**ప్రజాబలం మందమర్రి మండల రిపోర్టర్ నవంబర్ 30 :** చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకట్ స్వామి పుట్టినరోజు వేడుకలను మందమర్రి పట్టణంలో ప్రధాన రహదారి కూడలి వద్ద కాంగ్రెస్ సీనియర్ నాయకుడు యాదవ మహాసభ అధ్యక్షుడు బండి సదానందం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బండి సదానందం మాట్లాడుతూ వివేక్ వెంకటస్వామి బడుగు బలహీన వర్గాల నాయకుడిగా పేదల పెన్నిధిగా,పేదల కోసం తపించే నాయకుడని అభివర్ణించారు. తెలంగాణ ఉద్యమం సమయంలో అనేక పోరాటాలు చేసి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో ఎంతో కృషి చేశారని చెప్పారు. చెన్నూరు నియోజకవర్గానికి 1000 కోట్ల నిధులు తీసుకువచ్చిన ఘనత ఎమ్మెల్యే వివేకదని అన్నారు. అధికారంలో ఉన్న లేకున్నా విశాఖ ట్రస్టు ద్వారా ఎంతోమందికి ఉద్యోగ అవకాశాలు ఇచ్చారని కొనియాడారు. ఆయన ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామని అన్నారు. ఈ కార్యక్రమలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎమ్మార్వో సతీష్, సి. ఐ శశిధర్ రెడ్డి, ఎస్.ఐ శివనీతి రాజశేఖర్ ల చేతుల మీదుగా దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం అన్నదానాన్ని కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంద తిరుమలరెడ్డి, రాగడి రామ్ రెడ్డి, పెద్ది రాజన్న, ఎండి ఇబ్రహీం, మల్లెత్తుల నరేష్ యాదవ్, కొలుగూరి విజయ్ కుమార్, రామసాని సురేందర్, సుద్దాల రాజ్ కుమార్, ఎం.డి ఇసాక్, వేముల శ్రీనివాస్, తాడేపు వేణు, బాకం రవి, కాంగ్రెస్ యువ నాయకులు రాయబారపు కిరణ్, ఏం.డి జావిద్ ఖాన్, బియ్యని రవికిరణ్, నిర్మట్ల సుజిత్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.



# మండలంలో ప్రజా పాలన ప్రజా విజయోత్సవాలు



**ప్రజాబలం మందమర్రి మండల రిపోర్టర్ నవంబర్ 30 :** ప్రజా పాలన- ప్రజా విజయోత్సవాలు కార్యక్రమంలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలపై తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు ఆటపాటల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిన్నారు. మందమర్రి మండల పరిధిలోని సారంగ పల్లి, చిర్రకుంట, ఆడిల్ పేట గ్రామాలలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డిపిఆర్ఓ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 6 గ్యారంటీ లపై అవగాహన కల్పించారు.

రానున్న రోజులలో మరెన్నో సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతుందని పేర్కొన్నారు. ఈనెల 19 తేదీ నుండి డిసెంబర్ 7 వరకు ప్రజా పాలన, ప్రజా విజయోత్సవాలు కార్యక్రమంలో భాగంగా తెలంగాణ సాంస్కృతిక సారథి కళాయాత్ర కొనసాగుతుందని అన్నారు. ఈ కార్యక్రమాలలో సారధి కళాకారులు లావుడ్యా రమేష్ ( టీం లీడర్ ) మామిళ్ల లచ్చన్న, గొడిసెల కృష్ణ, సల్లూరి కృష్ణ, రామటెంకి రాజ తిరుపతి, కాసిపేట సంతోష్, వావిలాల నాగలక్ష్మి, స్థానిక మాజీ సర్పంచ్ లు, వార్డు మెంబర్లు, పంచాయతీ కార్యదర్శి, ప్రజలు పాల్గొన్నారు.

## ఎయిడ్స్ పై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలి

## జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ టి. రఘునాథ స్వామి



**ప్రజాబలం ప్రతినిధి మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా నవంబర్ 30:**

ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా, ప్రజలకు హెచ్.ఐ.వి/ఎయిడ్స్ గురించి అవగాహన కల్పించడం మరియు వ్యాధి వ్యాప్తిని తగ్గించడంపై దృష్టి పెట్టడం అత్యంత ముఖ్యమైన అంశం.

జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డా టి రఘునాథ్ స్వామి మాట్లాడుతూ,

ఎయిడ్స్ (అధికారహీనత వ్యాధి) అనేది హెచ్.ఐ.వి (హ్యూమన్ ఇమ్యునో డెఫిషియన్సీ వైరస్) వల్ల సంభవించే వ్యాధి అని, ఈ వైరస్ మన శరీరంలో ఇమ్యునిటీ వ్యవస్థపై దాడి చేస్తుంది, తద్వారా శరీరం సాధారణ సానుకూల వ్యాధులతో కూడా పోరాడలేని స్థితికి చేరుకుంటుంది.

రక్త మార్పిడి ద్వారా (సురక్షితమైన రక్త పరీక్షలు చేయని సందర్భాల్లో).

అజాగ్రత్తగా ఉపయోగించిన సూదులు, లేదా ఇతర వైద్య పరికరాల ద్వారా.

హెచ్.ఐ.వి సోకిన వ్యక్తితో రక్షణ లేని శారీరక సంబంధం ద్వారా,హెచ్.ఐ.వి కలిగిన తల్లి నుండి బిడ్డకు గర్భంలో, ప్రసవ సమయంలో, లేదా పాలు తాగించేటప్పుడు వ్యాప్తి చెందుతుందని తెలిపారు.

ఎయిడ్స్ కి మందులేదని నివారణ ఒకటే మార్గం

సురక్షిత రక్త మార్పిడి: రక్తాన్ని తీసుకునే ముందు హెచ్.ఐ.వి పరీక్షలు చేయండి.

కండోమ్‌ల వాడకాన్ని పాటించడం ద్వారా వైరస్ వ్యాప్తి నుండి రక్షణ పొందవచ్చు.

వాడిన సూదులను మళ్లీ ఉపయోగించకూడదు.గర్భిణీ స్త్రీలు హెచ్.ఐ.వి పరీక్షలు చేయించుకోవడం మరియు వైద్య సలహాలు తీసుకోవడం అవసరం.ఎయిడ్స్ సోకినవారిని వివక్షతో చూడటం సరికాదు. వారికి మానవత్వంతో సహాయం చేయాలి. సమాజంలో హెచ్.ఐ.వి/ఎయిడ్స్ పై అవగాహన పెంచడమే మన అందరి బాధ్యత అని తెలిపారు.

ప్రతి ఒక్కరూ ఈ సందేశాన్ని గమనించి, వ్యక్తిగతంగా మరియు సామూహికంగా హెచ్.ఐ.వి వ్యాప్తిని నివారించేందుకు కృషి చేయాలని కోరుకుంటున్నాము.ఎదైనా సందేహం ఉంటే సమీప బస్తీ / పల్లె దవాఖాన, ప్రాథమిక / పట్టణ ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ / ఏరియా / జిల్లా కేంద్రం ఆసుపత్రులలో రక్త పరీక్షలు చేయించుకోవాలని , లేదా 1097 అనే టోల్-ఫ్రీ నంబర్‌కు సంప్రదించి, ఎలాంటి సందేహాలు లేదా వైద్య సహాయం కోసం మరియు సంబంధిత విషయాలపై స్పష్టత కోసం సహాయం పొందవచ్చు వ్యక్తి ఒక్క వివరాలు గోప్యంగా ఉంటాయని తెలిపారు.

ఈ ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం మనకు ఆరోగ్యవంతమైన జీవన విధానం పాటిస్తాం అని ప్రతిజ్ఞ చేయాలని

జిల్లా హెచ్ఐవీ మరియు కుష్టురోగ కార్యక్రమ అధికారి డాక్టర్ శ్రీదేవితెలిపారు.

# శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో కలిసి జీవితం ఆనందంగా గడపాలి

## ఉద్యోగ విరమణ పొందిన ఎస్ఐ ని సన్మానించి జ్ఞాపకాలు అందజేసిన సిపి

## అధికారులకు,సిబ్బందికి ఎల్లప్పుడూ అండగా ఉంటాం

## పోలీస్ కమీషనర్ ఐపిఎస్ ఐజీ ఎం.శ్రీనివాస్





**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి నవంబర్ 30 :** పోలీస్ శాఖ నందు సుదీర్ఘ కాలం పాటు విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ పొందిన ఎస్సైని ఫరీద్ ని శనివారం రోజున రామగుండం పోలీస్ కమీషనర్ కార్యాలయం నందు ఏర్పాటు చేసిన పదవీ విరమణ కార్యక్రమంలో రామగుండము పోలీస్ కమీషనర్ ఐపిఎస్ ఐజీ ఎం.శ్రీనివాస్ పాల్గొని పదవీ విరమణ పొందిన ఎస్సైని కుటుంబ సభ్యుల తో కలిసి శాలువా,పూలమాలతో సత్కరించి జ్ఞాపిక అందచేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

పదవీ విరమణ పొందిన షేక్ ఫరీద్ ఎస్సై1983 సంవత్సరంలో పోలీసు డిపార్ట్మెంట్ లోకి కానిస్టేబుల్ గా ఎంపికై అంచలంచలుగా ఎదిగి 41 సంవత్సరముల,7 నెలలు విధులను నిర్వర్తించడం జరిగింది.1987 సంవత్సరం లో ముఖ్యమంత్రి సౌర్య పతకం 2021 సంవత్సరం లో సేవా పతకం ను పొందారు.ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ... గతంలో పోలీసు వ్యవస్థ అత్యంత క్లిష్ట పరిస్థితుల నందు విధులను నిర్వర్తించి ప్రస్తుతం పోలీసు వ్యవస్థ ప్రశాంతంగా ఉండడానికి గల కారణమైన అధికారులకు,సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు.సుదీర్ఘ కాలం పాటు పోలీసు వ్యవస్థను సేవలందించి పదవీ విరమణ పొందుతున్నందుకు ప్రతి ఒక్కరికి శుభాకాంక్షలు తెలియజేశారు.ప్రజలను పోలీసులు సక్రమంగా విధులను నిర్వర్తించడానికి కుటుంబ సభ్యుల ప్రోత్సాహం ఎంతగానో ఉంటుందని వారి తోడ్పాటు వల్లనే విధులను నిర్వర్తించి ఉన్నత స్థానాలకు ఎదగగలరని తెలియజేశారు.ఉద్యోగ విరమణ పొందిన తర్వాత వచ్చే ప్రయోజనాలను త్వరగా అందించాలని సిబ్బందికి తెలియజేశారు. ఉద్యోగ విరమణ చేసిన మీరు ఇకపై కుటుంబ సభ్యులతో తమ శేష జీవితాన్ని ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఆనందంగా గడపాలని సూచించారు.తమ ఆరోగ్యాల పట్ల తగు జాగ్రత్తలను తీసుకోవాలని కోరారు.ఎటువంటి అవసరం ఉన్న కమీషనరేట్ పోలీసు వ్యవస్థ ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో అదనపు డిసిపి అడ్మిన్ సి.రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్ర రావు, ఎఆర్ సుందర్,ఏ ఓ అశోక్ కుమార్, రిజర్వ్ ఇన్స్పెక్టర్ లు దామోదర్,వామన మూర్తి,శ్రీనివాస్, మల్లేశం,రామగుండం పోలీస్ కమీషనరేట్ పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు బోర్లా కుంట పోచలింగం,పదవి విరమణ అధికారుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పదవి విరమణ చేస్తున్న అధికారులకు ఘనంగా వీడ్కోలు



**ప్రజాబలం మందమర్రి మండల రిపోర్టర్ నవంబర్ 30 :** మందమర్రి ఏరియాలోని స్థానిక ఎల్లందు క్లబ్ లో శనివారం మందమర్రి ఏరియా జి.ఎం జి.దేవేందర్ అధ్యక్షతన వీడ్కోలు కార్యక్రమం ఏర్పాటు చేసారు. మందమర్రి జనరల్ మేనేజర్ కార్యాలయం లో సాంబశివారెడ్డి, ఈ అండ్ ఎం డిపార్ట్మెంట్ (డిప్యూటీ సూపరింటెండెంట్) అండ్ పర్చేస్ డిపార్ట్మెంట్ దామోదర్, (ఆఫీసు సుపరింటెండెంట్) గా విధులు నిర్వహిస్తు వీరు ఈనెల పదవి విరమణ పొందుతున్న సందర్భంగా ఏరియా ఉన్నతాధికారులు జ్ఞాపికను అందజేసి, శాలువా కప్పి, ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జి.ఎం జి.దేవేందర్ మాట్లాడుతూ ప్రతి ఒక్క అధికారికి పదవి విరమణ అనివార్యమని అన్నారు. పదవి విరమణ అనంతరం ఆయురారోగ్యాలతో సంతోషంగా వారి జీవనం జరగాలని వారు అన్నారు. ఈసందర్భంగా మందమర్రి ఏరియాకు వీరు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో డి జి ఎం ఈ అండ్ ఎం వెంకటరమణ, పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్, జిఎం కార్యాలయ సీనియర్ అధికారులు, హెచ్.ఓ.డీ.లు, సిబ్బంది పాల్గొన్నారు.

# పదవి విరమణ శుభాకాంక్షలు



మూడ్చింతలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్

భారత సత్యనారాయణ పదవీ విరమణ వేడుకలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ టి. రఘునాథస్వామి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా,

డాక్టర్ రఘునాథస్వామి మాట్లాడుతూ,

భారత సత్యనారాయణ ఆరోగ్యశాఖ కు చేసిన సేవలను కొనియాడారు, ఆయన ఆరోగ్య రంగంలో ప్రజలకు అందించిన నిస్వార్థ సేవలు ప్రశంసనీయమని, ఆయన పనితనం స్ఫూర్తిదాయకమని గుర్తుచేశారు. పదవి విరమణ పత్రాన్ని అందచేసి సన్మానం చేశారు.భారత సత్యనారాయణ

పదవీ విరమణ తరువాత కూడా ఆయన ఆరోగ్యానికి, ఆనందకర జీవితానికి శుభాకాంక్షలు తెలిపారు. సమాజంలో మరింత సేవ చేయడానికి వీలు కల్పించేలా ఆయన అనుభవాలను ఉపయోగించుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో కీసర డివిజన్ డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ సత్యవతి, మూడ్చింతలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య అధికారి డాక్టర్ దామయంతి, అబ్రహాం, కాశీరాం తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## కంకిపాడు దగ్గర ఘోర రోడ్డు ప్రమాదం ముగ్గురు మృతి

విజయవాడ కంకిపాడు వద్ద జాతీయ రహదారి పై ఘోరరోడ్డు ప్రమాదం జరిగింగి. చేపల వ్యాన్ ను కారు ఢీకొట్టింది. మచిలీపట్నం వైపు వెళ్తున్న కారు, చేపల లోడుతో మచిలీపట్నం నుంచి విజయవాడ వైపు వెళ్తున్న బొలేరో వ్యాన్ ను ఢీకొట్టింది. కారు టైరు పేలడంతో డివైడర్ దాటుకుని వెళ్లి చేపల వ్యాన్ ను ఢీకొట్టింది. ఘటనలో కారులో ఉన్న ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. చేపల వ్యాన్ లో డ్రైవర్ ఇరక్కుపోయాడు. పోలీసులు, స్థానికులు అతికష్టం తో డ్రైవర్ ను బయటికి తీసారు.

# వృత్తిపరమైన జీవితంలో ఉన్నత స్థాయికి చేరాలి

**స్టేషన్‌కు వచ్చిన బాధితులకు భరోసా ఇవ్వాలి**

**నీతి నిజాయితీలతో విధులను నిర్వర్తించాలి  పోలీస్ కమిషనర్ ఐపిఎస్**

**ఐజీ ఎం. శ్రీనివాస్ ఐపిఎస్**

**నూతన కానిస్టేబుల్ లకు సిపి దిశానిర్దేశం**

**నూతన సివిల్ కానిస్టేబుల్ లకు నియామక ఉత్తర్వులు అందజేత**



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి నవంబర్ 30 :** పోలీసులు విధి నిర్వహణలో అంకిత భావంతో పని చెయ్యాలని, పోలీసింగ్ ఎదురయ్యే సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోని ప్రజలకు సేవలు అందించాలని వృత్తిపరమైన జీవితంలో ఉన్న స్థాయికి ఎదగాలని బాధతో పోలీసు స్టేషన్‌కు వచ్చే వారికి భరోసా ఇచ్చేలా విధి నిర్వహణ ఉండాలని రామగుండం పోలీస్ కమిషనర్ ఐపిఎస్ ఐజీ ఎం.శ్రీనివాస్ సూచించారు.

రామగుండము పోలీస్ కమీషనర్ మాట్లాడుతూ%ొౌ%. రామగుండము పోలీస్ కమీషనరేట్ పెద్దపల్లి,మంచిర్యాల జిల్లాల నుండి పోలీస్ శాఖకు ఎంపికైన 392 మంది ఇందులో 236 మంది సివిల్ కానిస్టేబుళ్లు, అందులో 83 మంది సివిల్ మహిళా కానిస్టేబుళ్లు,156 మంది ఆర్మ్‌డ్ కానిస్టేబుళ్లు, అందులో 37 మంది ఆర్మ్‌డ్ మహిళా కానిస్టేబుళ్లు, వివిద పోలీస్ శిక్షణ కేంద్రాలకు శిక్షణకు వెళ్ళి 9 నెలల కఠినమైన పోలీస్ శిక్షణ పూర్తి చేసుకుని ఈ రోజు కమీషనరేట్ కు రావడం జరిగిందని ఈ రోజు నుండి కొత్తగా విధుల్లో చేరనున్న కానిస్టేబుళ్లకు బాధతో పోలీసు స్టేషన్‌కు వచ్చే వారికి మేమున్నామనే భరోసా కల్పించాలని దిశానిర్దేశం చేశారు. విధి నిర్వహణలో కమ్యూనిటీ పోలీసింగ్‌కు ప్రాధాన్యమివ్వాలన్నారు. పోలీసు శాఖలో పూర్తి బాధ్యతలు నిర్వహించేందుకు ఎంపిక చేయబడిని ప్రతి ఒక్కరు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలన్నారు. ఎలాంటి ప్రలోభాలకు గురికా కుండా నీతి నిజాయితీతో విధులు నిర్వహిస్తే ప్రజలు ఆదరిస్తారన్నారు. పోలీస్ శాఖలో ఉద్యోగం అంటేనే అనేక సవాళ్లతో కూడుకున్న ఉద్యోగమని మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండాలని సూచించారు. పోలీస్ జీవితంలో క్రమశిక్షణ ఎంతో ముఖ్యమైనదని, అధికారులు అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. పోలీసులకు ప్రధాన బాధ్యత ప్రజల రక్షణ అని, వారి హక్కులకు, ఆత్మగౌరవానికి భంగం కలగకుండా ప్రజలతో మంచి నడవడికను అలవాటు చేసుకోవాలని చెప్పారు. పోలీసు శాఖ అంటేనే క్రమశిక్షణకు మారుపేరు అని, అధికారుల సలహాలు సూచనలు పాటిస్తూ తమకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహిస్తూ అధికారుల మన్ననలు పొందాలని అంకిత భావంతో సేవలుంది స్త వృత్తిపరమైన జీవితంలో ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో అమలు చేయాలని కోరారు. నేరాల నియంత్రణ కొత్త టెక్నాలజీ వినియోగంలో తెలంగాణ పోలీసులకు మంచి గుర్తింపు ఉన్నదని, చట్టబద్ధమైన పౌరులుగా మీ సేవలను చూసి సమాజం గౌరవించేలా ఉండాలన్నారు. ప్రతీ ఒక్కరూ క్రమశిక్షణ ,నిబద్దత తో పనిచేసి పోలీస్ వ్యవస్థకు కృషి చేయాలని, కమీషనరేట్ కు, తెలంగాణ పోలీస్ కు, రాష్ట్రానికి మంచి పేరు తేవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ సి. రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్ర రావు, ఎ ఆర్ ఏసీపీ సుందర్ రావు, ఎఓ అశోక్ కుమార్, ఆర్ఐ లు దామోదర్, మల్లేశం, వామన మూర్తి, శ్రీనివాస్, సూపరిండెంట్ల ఇంద్ర సేనా రెడ్డి, మనోజ్ కుమార్,సంధ్య, ఇన్స్పెక్టర్ లు, ఆర్ ఎస్ ఐ లు పాల్గొన్నారు

# అర్హులైన ప్రతి ఒక్కరికి పరిహారం అందజేత

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి నవంబర్ 30 :** జాతీయ రహదారుల నిర్మాణంలో భాగంగా మంచిర్యాల-వరంగల్-ఖమ్మం-విజయవాడ జాతీయ రహదారి 163జి నిర్మాణంలో భూములు కోల్పోయిన అర్హులైన ప్రతి ఒక్కరికి పరిహారం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.శనివారం జిల్లా కేంద్రంలోని రాజస్వ మండల అధికారి కార్యాలయంలో జాతీయ రహదారి విస్తరణలో బాధితుల కోల్పోయిన వివరాలను మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ రహదారి 163జి 384 కిలోమీటర్ల మేర ఉంటుందని, రహదారి నిర్మాణంలో భూములు కోల్పోయిన వారి జాబితా ప్రకారం బాధితులకు నష్టపరిహారం చెల్లించడం జరిగిందని, ఆర్బిట్రేషన్ కొరకు దరఖాస్తు చేసుకున్న వారికి పరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు.మొదటి జాబితాలో పరిహారం అందని అర్హత గల వారు సంబంధిత పత్రాలు,బ్యాంక్ పాస్ పుస్తకాలతో సంప్రదించినట్లయితే రికార్డులు పరిశీలించి సరిగ్గా ఉన్నట్లు నిర్ధారణ జరిగితే సంబంధిత లబ్ధిదారుల నుండి అక్విటెన్సీ తీసుకొని పరిహారం చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.భూములలో చెట్లు,బోర్లు, పైప్‌లు ఉన్నట్లయితే సంబంధిత ఫొటోలు తీసుకొని ప్రక్క భూమి రైతు వద్ద సంతకం తీసుకొని తహశిల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని, నిర్దేశిత ధరల ప్రకారం పరిహారం చెల్లించడం జరుగుతుందని, నష్టపోయిన వారు ఆలస్యం చేయకుండా త్వరగా దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాలకు పై ప్రచారం



ప్రజాబలం ప్రతినిధి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నవంబర్ 30:తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న “ప్రజాపాలన-ప్రజా విజయోత్సవాలు-2024” లో భాగంగా మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా ‘తెలంగాణ సాంస్కృతిక సారథి ‘ కళాకారుల 2 బృందాలు “ప్రజా పాలన కళాయాత్ర” శనివారం నిర్వహించినారు. ఇందులో భాగంగా మేడ్చల్ మండలం గౌడవల్లి, పూడూర్ మరియు గుండ్ల పోచంపల్లి మున్సిపల్ పరిసర ప్రాంతాలలో మరియు కీసర మండలం అంకిరెడ్డిపల్లి (దమ్మాయిగూడ మున్సిపల్), కీసర, కీసర దాయర మున్సిపల్ పరిసర ప్రాంతాలలో ప్రభుత్వ సంక్షేమ పథకాల పై పాటలతో ప్రచారం చేసినారు.

# విద్యార్థుల వినూత్న ఆలోచనలతో సమాజ హిత ఆవిష్కరణలు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి నవంబర్ 30 :** విద్యార్థి దశ నుండి విద్యార్థుల వినూత్న ఆలోచనలతో సమాజ హిత ఆవిష్కరణలు రూపొందుతాయని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ట్రినిటీ ఉన్నత పాఠశాలలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన 2024-25, జిల్లాస్థాయి ఇన్స్ ఫైర్ అవార్డుల ప్రదర్శన 2023-24 కార్యక్రమానికి మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు,జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య లతో కలిసి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తూ విద్యార్థులకు అన్ని సౌకర్యాలతో కూడిన నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, తరగతులకు అవసరమైన ఉపాధ్యాయుల నియామకాన్ని చేపట్టి విద్యార్థులకు కార్యచరణ ప్రకారం విద్యా బోధన అందించేందుకు కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులలో దాగి ఉన్న నైపుణ్యతను వెలికి తీసి భవిష్యత్తులో మరిన్ని ప్రజా ప్రయోజనకర అంశాల సాధన దిశగా ప్రోత్సహించడం జరుగుతుందని తెలిపారు. ఇన్స్ ఫైర్ అవార్డులలో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలలో అత్యుత్తమ ప్రతిభ గల విద్యార్థులను ఎంపిక చేసి వారి ఆవిష్కరణలను ప్రోత్సహించడం జరుగుతుందని, విద్యార్థులకు గుర్తింపు రావడంతో పాటు నగదు బహుమతి అందించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు ప్రజలకు ఉపయోగపడే నూతన ఆవిష్కరణల సాధనలో ముందు ఉండేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని, విద్యార్థుల నూతన ఆలోచనల ద్వారా ఆవిష్కరణలను రూపొందించి విజయం బాటలో నడిపించాలని, దేశ అభివృద్ధికి దోహదపడాలని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు సైన్స్ ను వినియోగించి ఆవిష్కరణలను రూపొందించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యార్థులు రూపొందించిన ఆవిష్కరణలను గణతంత్ర దినోత్సవం, స్వాతంత్ర దినోత్సవ వేడుకలలో ప్రత్యేకంగా స్టాల్స్ ఏర్పాటు చేసి ప్రదర్శించడం జరుగుతుందని, సమాజంలోని సామాన్య సమస్యలకు సరైన పరిష్కారం చూపుతూ విద్యార్థుల రూపొందించే ఆవిష్కరణలకు ఎంతో గుర్తింపు వస్తుందని తెలిపారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమాజ హిత విద్యార్థుల ఆలోచనలను ప్రోత్సహించాలని, వారు అందించే వినూత్న ఆలోచనల ద్వారా భవిష్యత్తు సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలు రూపొందుతాయని తెలిపారు.ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరిని ఆకట్టుకున్నాయి.  ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, పాఠశాల యాజమాన్యం, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# జమ్మికుంట ప్రభుత్వాసుపత్రిని సందర్శించిన సబ్బని వెంకట్



**జమ్మికుంట ప్రజాబలం ప్రతినిధి నవంబర్ 30** జమ్మికుంట ప్రభుత్వాసుపత్రిని శనివారం ప్రముఖ సామాజికవేత్త, మల్టీ నేషనల్ కంపెనీ ‘జెన్ ప్యాక్ట్’ గ్లోబల్ వైస్ ప్రెసిడెంట్ సబ్బని వెంకట్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ ఆసుపత్రిలో కనీస వసతులకు నోచుకోకపోవడం సరికాదన్నారు. ఆస్పత్రిలో గుండె వైద్య నిపుణుడు ఉండాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. ఇటీవల మృతి చెందిన అధికార పార్టీ నాయకుడు తుమ్మేటి సమ్మిరెడ్డి, హుజురాబాద్ కు చెందిన అడ్వకేట్, జర్నలిస్ట్ శ్యామ్.. మైనర్ చెస్ట్ పెయిన్ వల్ల మృతి చెందారని వారికి సరైన సమయంలో తగు ట్రీట్మెంట్ అందినట్లయితే బతికేవారని పేర్కొన్నారు. హుజురాబాద్ తో పాటు జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రుల్లో కార్డియాలజిస్ట్ ఉండాలని స్థానిక నియోజకవర్గ నాయకులు ఎందుకు ప్రభుత్వాన్ని అడగడం లేదని ప్రశ్నించారు. కరీంనగర్, హన్మకొండ జిల్లా కేంద్రాల నడుమ ఉన్న హుజురాబాద్ నియోజకవర్గం ఇంకా ఎందుకు అభివృద్ధి చెందడం లేదని అడిగారు. విద్య, వైద్యం ఉపాధి పైన దృష్టి సారించాలని సూచించారు. విద్య, ఉపాధి ప్రభుత్వ పరిధిలో ఉన్నప్పటికీ వైద్యం విషయమై వ్యవస్థలో నిర్లక్ష్యం వహించడం సరికాదని వెల్లడించారు. స్థానిక ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ ఇన్ చార్జి సీఎంఆర్ఎఫ్ చెక్కుల కోసం కొట్లాడుకోవడం సరికాదని అభిప్రాయపడ్డారు. హుజరాబాద్ నియోజకవర్గ పరిధిలో మెడికల్ కాలేజీ, కంపెనీల ఏర్పాటు కోసం నాయకులు ఎందుకు అడగడం లేదని ప్రశ్నించారు. సమర్థవంతులైన మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు లకు ఈ విషయమై ఎందుకు వినతి పత్రాలు సమర్పించడం లేదని అడిగారు. ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేసే సిబ్బందికి సైతం ఫిట్ నెస్ టెస్టులు ఉండాలని అభిప్రాయపడ్డారు.



## వరంగల్ నగరంలో చైన్ స్నాచింగ్

వరంగల్ నగరంలో  చైన్ స్నాచింగ్ కేసులు కలవర పెడుతున్నాయి. మాస్కులు, హెల్మెట్లు, క్యాపులు ధరించి రావడం, రోడ్డు మీద వెళ్లే ఒంటరి మహిళలను టార్గెట్ చేసి చైన్ స్నాచింగులకు పాల్పడటం పరిపాటిగా మారింది. తాజాగా ఈరోజు ఉదయం వరంగల్ నగరంలోని మట్టేవాడకు చెందిన ఓదెల ప్రమీల అనే వృద్ధురాలు తన ఇంటి ముందు ముగ్గు వేస్తుండగా బైకుపై వచ్చిన ఇద్దరు దుండగులు వృద్ధు రాలి మెడలో నుంచి బంగారు చైన్ లాక్కొని వెళ్లారు..దుండగులు చైన్ తీసే క్రమంలో వృద్ధురాలు వారితో పెనుగులాడినట్టు తెలుస్తుంది, ఆమెకు స్వల్ప గాయాలు కావడంతో ప్రభుత్వ ఆస్పత్రి తరలించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు..

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI  ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI  NO ; TELTEL/2005/16755  Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com